# ఆంధ్రుల సంగీతకళ

మంచాళ జగన్నాధరావు

Acc No 6230

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భమున ప్రచురితము

ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ

ప్రచురణ నెం. 21
ఏప్రిల్, 1975

ముద్రణ.
నాట్యకళ ప్రెస్
హైదరాబాదు-500004.

780
JAG

వెల : రెండు రూపాయలు

ముఖపత్రం : వఝ శ్రీనివాసశర్మ

ప్రతులకు
ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ
కళాభవన్, హైదరాబాదు-500004

# పరిచయము

ఇరువై శతాబ్దాల తెలుగు చరిత్ర సంస్కృతి పునాదులపైన నిర్మింప బడ్డ తెలుగు జాతి సమైక్యతను సర్వతోముఖాభివృద్ధిని పటిష్ఠం చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధ్వర్యంలో రాక్షసనామ సంవత్సర ఉగాది (1975 ఏప్రిల్ 12వ తేదీ) నుండి వారం రోజులపాటు ప్రపంచ తెలుగు మహాసభలు జరుగుతున్నవి. ఈ మహాసభల ఏర్పాట్లకుగాను ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావుగారు అధ్యక్షులుగాను, విద్యాశాఖ మంత్రి శ్రీ మండలి వెంకటకృష్ణరావుగారు నిర్వాహకాధ్యక్షులుగాను ఒక సంఘం ఏర్పడింది. ఈ సందర్భంగా 1975 సంవత్సరాన్ని తెలుగు సాంస్కృతిక సంవత్సరంగా పరిగణించడం జరుగుతున్నది.

ప్రపంచ మహాసభలకు నాందిగా రాష్ట్రంలోని పలు ప్రదేశాలలోను, ఢిల్లీలోను సంగీత, నాటక, నృత్య, జానపద కళోత్సవాలను నిర్వహించే బాధ్యతను, ఆయా కళారంగాలకు సంబంధించిన గ్రంథాలను ప్రచురించే బాధ్యతను స్వీకరించవలసిందని ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీని ప్రపంచ తెలుగు మహాసభల కార్యవర్గం కోరింది. ఈ కార్యక్రమం క్రింద అకాడమీ విజయవాడలో నాటకోత్సవాన్ని, అనంతపురంలో వీధినాటకం సదస్సును, నిజామాబాద్‌లో నృత్యోత్సవాన్ని, తిరుపతిలో సంగీతోత్సవాన్ని ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ జానపద, నాటక కళోత్సవాన్ని నిర్వహించింది,

ఈ సందర్భంలో సంగీత, నృత్య, నాటక, చలనచిత్రాలకు సంబంధించిన గ్రంథాలను ప్రచురించే అవకాశం కల్పించి, అకాడమీ గ్రంథ ప్రచురణ కార్యక్రమానికి ప్రపంచ తెలుగు మహాసభల కార్యవర్గం దోహదం చేసింది. అందుకు వారికి మేమెంతో కృతజ్ఞులం. ఈ అవకాశాన్ని పురస్కరించుకొని ప్రచురించిన అనేక గ్రంథాలలో ఈ "ఆంధ్రుల సంగీతకళ" ఒకటి. ఈ గ్రంథాన్ని రచించిన సుప్రసిద్ధ సంగీత విద్వాంసులు మంచాళ జగన్నాధరావుగారికి మా ధన్యవాదాలు.

**జె. బాపురెడ్డి**
స్పెషల్ ఆఫీసర్
ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ.

# ముందు మాట

ఎన్నో ఏళ్లుగా అనుకొంటున్న ప్రపంచ తెలుగు మహాసభలు జరుగనున్న పర్వ సమయం ఆసన్నమవుతున్నది. ప్రపంచంలోని తెలుగువారి ప్రతినిధుల నందరినీ ఒకచోట సమీకరించవలెనని పెద్దలందరూ కన్నకలలు ఫలిస్తున్న శుభసమయమిది. రాబోయే ఉగాది రెండు వేల అయిదువందల సంవత్సరాల తెలుగు జాతి చరిత్రలో మరపురాని మధుర ఘట్టము కాగలదు.

క్రీస్తుపూర్వం మూడవ శతాబ్దికి చెందిన శాతవాహన రాజుల కాలంనుంచి తెలుగు ప్రజలకు ఒక విశిష్టమైన చరిత్ర ఉన్నది. భారత దేశంలో తెలుగు మాట్లాడే ప్రజలు దాదాపు ఐదు కోట్లకు పైగా ఉన్నారు. హిందీ మాట్లాడే వారి తరువాతి స్థానం తెలుగువారిదే. బౌద్ధపూర్వయుగంనుంచి ఇటీవల బ్రిటిష్ సామ్రాజ్యపరిపాలనా యుగం వరకూ తెలుగువారు పెద్దఎత్తున ప్రపంచం నలుమూలలకూ వలస వెళ్లడం జరిగింది. అట్లా వెళ్లిన తెలుగువారు తమ భాషా సంస్కృతీ సంప్రదాయాలను ఆయా జాతీయ జీవన విధానాలతో మేళవించి, వాటిని సుసంపన్నం చేస్తూ ఉన్నారు.

ప్రపంచ తెలుగు మహాసభల ప్రధాన లక్ష్యం తెలుగు ప్రజల, తెలుగు అభిమానుల ప్రతినిధులను ఒక వేదికమీద సమావేశపర్చడం. జాతీయ, అంతర్జాతీయ సాంస్కృతిక రంగాలలో తెలుగువారు చేయవలసిన కృషినిగూర్చి చర్చించి, నిర్ణయించుకోవడానికి, తద్వారా

వివిధ చైతన్య స్రవంతులను ఏకోన్ముఖంచేసి మన సాంస్కృతిక సంబంధాలను దృఢతరం చేసుకోవడానికి ఈ మహాసభలు దోహదకారులు అవుతవి. అంతేకాక ఈ మహాసభలు ఆర్ద్రమైన భావసమైక్యతకు ప్రాతిపదికలై తెలుగు జాతిని సమైక్యం చేయగలవని, ఆ విధంగా జాతీయ అభ్యుదయానికి తోడ్పడగలవని విశ్వసిస్తున్నాను.

1975 ఏప్రిల్ 12 వ తేదీన తెలుగు ఉగాది రోజున ప్రారంభమై ఒక వారంరోజుల పాటు జరిగే ఈ మహాసభలలో వివిధ దేశాలనుంచీ, వివిధ రాష్ట్రాలనుంచీ, యునెస్కోవంటి అంతర్జాతీయ సంస్థలనుంచి విచ్చేసిన ప్రముఖులు ప్రతినిధులుగానో, పరిశీలకులుగానో పాల్గొంటారు. ఈ మహాసభల సమయంలో చర్చాగోష్ఠులు, ప్రదర్శనలు, ప్రచురణలు మొదలైన కార్యక్రమాలు జరుగుతాయి. దేశ విదేశాలలోని తెలుగువారి సంస్కృతి, తెలుగు భాషా సాహిత్యాల, కళల అభివృద్ధి, వైజ్ఞానిక సాంకేతిక ప్రగతి మొదలైన విషయాలపై చర్చాగోష్ఠులు జరుగుతవి. తెలుగువారి సాంస్కృతిక వైభవాన్ని వివిధ కోణాలనుంచి ప్రస్ఫుటంచేసే ఒక ప్రదర్శన ఏర్పాటు అవుతున్నది. తెలుగువారి సమగ్ర స్వరూపాన్ని సందర్శించడానికి వీలైన సంగ్రహాలయాన్ని 'మ్యూజియంను' స్థాపించడానికి ఈ ప్రదర్శన బీజభూతమవుతుంది. తెలుగువారి సంస్కృతి నిరూపించే సాంస్కృతిక కార్యక్రమాలు వారం రోజులపాటు సాగుతవి. తెలుగు ప్రజల సంస్కృతీ సంప్రదాయాలను విశదంచేసే ప్రత్యేక సంచికలు తెలుగు, ఇంగ్లీషు, హిందీ, ఉర్దు భాషలలో విడుదల అవుతాయి. ఈ కార్యక్రమాలలో భాగమే ఈ గ్రంథ ప్రచురణ.

తెలుగు ప్రజలు భాష, సాహిత్యం, చరిత్ర, సంస్కృతి, కళలు మొదలైన వివిధ రంగాలలో సాధించిన ఘనవిజయాలను విశదంచేసే గ్రంథాలు అనేకం ఈ మహాసభల సమయంలో విడుదల అవుతాయి.

ఈ గ్రంథాలను రచించి, సకాలంలో మాకు అందించిన రచయిత లందరకూ నా కృతజ్ఞతలు. ఈ గ్రంథాలను ప్రచురించే భారం వహించడానికి ముందుకువచ్చిన అకాడమీల అధినేతలను అభినందిస్తున్నాను. తెలుగు వారి విశిష్టతలను విశదంచేసే ఈ గ్రంథాలు సహృదయు లందరి ఆదరణ పొందగలవని విశ్వసిస్తున్నాను. అయితే, ఇంత మాత్రం చేత నే ప్రపంచ తెలుగు మహాసభల ఆశయాలు సఫలం కాగలవని నేను అనుకోవడంలేదు. చేయవలసినది ఇంకా ఎంతో ఉంది. ఈ మహాసభల సందర్భంగా నెలకొల్పబడనున్న 'అంతర్జాతీయ తెలుగు విజ్ఞాన సంస్థ' మహాసభల ఆశయ సాధనకు పూనుకొనడమే కాక జాతీయ, అంతర్జాతీయ సాంస్కృతిక సంబంధాలను దృఢతరం చేయగలదని నమ్ముతున్నాను.

**జలగం వెంగళరావు**

అధ్యక్షులు,

ప్రపంచ తెలుగు మహాసభలు

# ఆంధ్రుల సంగీతకళ

## అవతారిక

సంగీతకళకు తెనుగువారు చేసిన సేవను గురించి తెలుసుకొనుటకు ప్రయత్నించునప్పుడు కొంత ఆశ్చర్యానందములు కలుగుట సహజము. ఈ విషయమును కొన్ని వివరములతో క్లుప్తముగా ఇంత వరకు లభ్యములైన కొన్ని పరిశోధనా ఫలితములతో జతపరచి చెప్ప కొందము.

సంగీతమునకు సాధారణముగా కొన్ని శాఖలుండును. ఇది ఒక శాస్త్రము గనుక, 1. శాస్త్రగ్రంథములు రచించిన గ్రంథకర్తలు, వారు వివరించిన విషయములు. 2. వాగ్గేయకారులు - ప్రాచీనులు, ఆధునికులు, 3. విద్యాప్రచారమును చేసిన విద్వద్గురులు, సంస్థాన ములు, సంస్థలు, 4. వాద్యములు-వాని యందలి పరిణామములు, ఇవి ముఖ్యములగు శాఖలు. ఇందు ఒక్కొక్కటి ఒక్కొక్క మహా సముద్రమువంటి విషయము. ఈ మహాసముద్రములను తీరముల నుండేయైనను చూచినగాని, ఒకజాతి సంస్కృతిని, కళా కౌశలమును తెలుసుకొనుట అసాధ్యము. నేడు జరుగుచున్నవి రేపటికి ఆచార ములుగను, మరికొన్ని దినములకు సంప్రదాయములుగను, మరి కొంత కాలమునకు చారిత్రికములుగను నిలిచి యుండును. ఈ విషయ మును గుర్తెరిగినవారు కొంత అరుదుగా నుండుటవలన చారిత్రక

పరిశోధకులకు కొంత కష్టమే యగుచున్నది. ఏలననగా గ్రంథ కర్తలు తమ గ్రంథముల యందు విషయమును చెప్పుట యందు చూపిన శ్రద్ధ, ఆనాటి దేశకాల పరిస్థితులను చెప్పుటయందు చూప కుండుటయు, సమకాలీనులగు కళాకారుల పేర్లైనను తలచకుండు టయు, తరచుగ జరుగుచున్నది. శ్రవ్యప్రధానమగు సంగీత విద్య వ్రాయుటకు ప్రయత్నించుటయే కష్టము. గ్రంథరూపమున శాస్త్ర విషయములను చెప్పుటకు, వారి కాలమందుండిన భాష, పద్ధతి, మొదలగునవియు కొంత ఈ పనిని క్లిష్ట తరముగా జేసినవి.

ఒకప్పుడు భారతదేశమునందంతటను సంస్కృతము తెలిసిన భాషగా నుండెడిది. గనుక అన్ని ప్రాంతముల వారును తెలుసు కొని ఆనందించుటకు అనువుగా నుండవలెనని గ్రంథములను దేవ భాషయందే వ్రాయుట జరుగు చుండెడిది. ప్రాంతీయ భాషల యందును గ్రంథములు వ్రాసెడివారు కారని కాదు. కాని అట్టి ప్రాంతీయ భాషాగ్రంథములకు పరిమితమగు ప్రచారము మాత్రము ఉండెడిది. దేశభాషలందు గల గ్రంథములయందు సులభమగు రీతిని శ్లోకముల రూపముననను, ప్రాంతీయ భాషలయందుండెడి గ్రంథముల యందు ఛందోబద్ధములైన పద్యముల రూపముననను సాధారణ ముగా గ్రంథములను వ్రాయుచుండెడి వారని తోచుచున్నది. ఇట్లు చెప్పుట వలన వారి కాలము వారికి, ఎట్లు అర్థమగు చుండెడిదో తెలి యుటలేదు. కాని, రాను రాను టీకా. తాత్పర్యముల సహాయము లేకుండ తెలుసుకొనుట కష్టసాధ్యమైపోయినది. టీకా, తాత్పర్యము లను వివరించెడి వారి యందును అభిప్రాయభేదములు ప్రారంభమై వంద సంవత్సరముల క్రిందటి విషయము లను కూడ ఇదమిద్ధమని నిర్ణ యించుకొనుటకు వీలుపడని దుస్థితి నేడేర్పడినది.

దక్షిణాపథమును ఒకప్పుడనేక రాజవంశములు పాలించినవి. వీరియందు బౌద్ధము, శైవము, వైష్ణవము, మొదలగు మతముల

వారును, వేరు వేరు మాతృభాషలుకల వారును యుండెడివారు. వీరి మధ్య, ప్రాంతము, మతము, మొదలగు విషయములయందు ఘర్షణ లెన్నియున్నను, సంగీతము, సాహిత్యమువంటి కళలయందు మాత్రము ఆదరాభిమానములు అకుంఠితముగా నుండెడివి. గనుకనే శిల్పకళా సౌందర్యమును చాటుచు వారి కాలమునాటి చారిత్రిక విషయములను కొన్నిటినైనను తెలియజేయుచు, గుహామందిరములు, దేవాలయములు, ఉద్గ్రంథములు మొదలగునవి కొంతవరకైనను నిలిచి యున్నవి.

## గానయోగ్యములైన భాషలు

నాద విద్యయగు సంగీతమునందు అనాది నుండియు భాషయు నొక ప్రధానమగు స్థానమును పొందియుండుట అందరకును విదితమే కదా ! మహానుభావులగు వాగ్గేయ కారులు వారి వారి మాతృ భాష లలో కృతిరత్నములను చెప్పినను, సంస్కృతాంధ్రములలో కొన్ని రచనలైనను చేయుట పరిపాటియై ఎంతకాలమైనదో ఊహించుట కష్టము. శాస్త్రీయమగు పరిభాషయందు వాగ్గేయ కారులనినచో రాగతాళ నియమాదులను పాటించిన వారని అనుకొనవచ్చును. కాని భక్తిని,ఆర్తిని భగవంతునికి నివేదించుకొనుటకుసామాన్యములగు చిన్న చిన్న వరుసలలో తత్త్వములు, భజన కీర్తనలు, మొదలగువవి పాడు కొనిన వారును వాగ్గేయ కారులే యౌదురు గదా ! ఇట్టి పాటలు, రచయితల పేర్లైన తెలియనివి, ప్రాచీనములైనవి ఎన్నియో తెనుగు నందు గలవు. సంస్కృతమునందును, తెనుగు భాషయందును, గాన మునకు ఒప్పిదములైన కొన్ని విశేషములు కనబడుచున్నవి. వాక్య ముల విరుపులయందు సౌలభ్యమును, అ, ఇ, ఎ, ఒ, ఔ, అను స్వరము మొదలగునవి వాక్యాంతముల యందుండుటవలనను, రెండు మూడక్షరములనుకలిపి ఒకేసారి పలుకవలసిన వాక్యములు తక్కువగా నుండుటవలనను బహుశః ఈ భాషలను సంగీత యోగ్యములైనవిగా

కళాభిమానులు, కళాకోవిదులు తలచి యుండవచ్చును. సంస్కృతము నందుగల మహాప్రాణములు తెనుగునందు కూడ అట్లే వచ్చుచుండుటయు, దేవతాస్తుతిపరమైన రచనలు ఎక్కువగా నుండుటవలనను, ఈ రెండు భాషలును, గానయోగ్యములని ఆమోదింపబడి యుండినవేమో యని అనుకొనినను అనుకొనవచ్చును.

కర్నాటక సంగీతమునందు భక్తిరస పూరితములగు రచనలను, తాము వ్రాసియో, ఇతర వాగ్గేయ కారులు, భక్తులు చెప్పినవియో పాడుకొనుచు, గాయకులు తాము ఆనందించుచు శ్రోతల నానందింప జేయుట యనునది ముఖ్యోద్దేశ్యముగా నుండినట్లు తోచుచున్నది. ఇట్లు ప్రారంభమైన గానమునకు శాస్త్ర మేర్పడి, రాజసభలు, రసిక జనకూటములు, మొదలైనవి పోషక స్థానమును వహించుట జరిగి, కొంత శాస్త్ర ప్రదర్శన ప్రధానమై, శృంగారాది రసములకు చోటు నిచ్చినదియై పెంపొందినది. భక్తి వైరాగ్యములను ప్రబోధించు రచనలు కొంత తరువాతివిగను, ఇప్పటికి మనకు లభ్యములగుచున్న రచనల యందు కనబడుచుండుట గమనార్హము. ఒకప్పుడు మత ప్రచారమునకు కూడ సంగీతము సాధనముగా నుండెడిది. దీనికి శైవ, వైష్ణవ, శాక్తేయాది మతపరమైన వాఙ్మయమే నిదర్శనము.

## గీతము—లక్షణములు

గీతమును ఛందోబద్ధముగా నుంచుటయు యతి ప్రాసాదులను పాటించుటయును కొంతవరకు ప్రాచీన కాలము నుండియు జరుగు చున్నదేయైనను, సంగీతమునందలి రాగ తాళములను పోషించుకొనుటకు కొన్ని నియమోల్లంఘనములును జరుగుచుండెడివి కాబోలు. అందువలననే భక్తాగ్రేసరులును, పద కవితా పితామహులును, హరికీర్తనాచార్యులును అగు తాళ్ళపాక అన్నమాచార్యులు సంకీర్తన లక్షణములను సంస్కృతమున వ్రాసి యున్నారు. ఆయన మనుమడు చిన తిరుమలయ్య దానిని ఆంధ్రీకరించినారు. 15, 16

శతాబ్దముల దక్షిణాపథమున కొంచె మించు మించు కటకము నుండి కన్యాకుమారివరకుగల దేశమునందంతటనుగల కర్ణాటక సంగీతము నందు అప్పటికే వాడుకలోనున్న వాటికి మెరుగులుదిద్ది తరు వాతితరముల వాగ్గేయకారులకు మార్గదర్శకులై ఈ తాళ్ళపాక వారు ఆంధ్రుల ఇలవేల్పగు శ్రీ వెంకటేశ్వరస్వామి సన్నిధిని విలసిల్లినారు. తాళ్ళపాకవారి శృంగార సంకీర్తనములు, ఆధ్యాత్మ సంకీర్తనములు మొదలగునవి నాటినుండి నేటివరకును తెనుగు వాగ్గేయకారుల రచనలకేకాక దక్షిణదేశమునందలి అన్నిభాషల వారి గేయరచనలకును మార్గదర్శకములుగానే నిలచియున్నవి, అను కొనవచ్చును. భక్తులకు దేశ, భాషలను ఎల్లలు లేవు గనుక తిరుపతి వెంకటనాథుని భక్తుడును, చెలికాడునునగు తాళ్ళపాక అన్నమయ్య చెప్పిన సంకీర్తన లక్షణములను ఆ తరువాతి భక్త కవులందరును పాటించినట్లు తోచుచున్నది.

గీతమునందలి సాహిత్యమునకు లక్షణములను చెప్పుచు, వృత్త పదము, నిబంధపదము, చూర్ణపదము అను మూడు విధములగు పద ముల లక్షణములను, పల్లవి, శిఖాపదములకును, పదమాలిక, శరభము అను అష్టపది, దరువులు, అందు జక్కుల రేకులు, ఏలలు, గొబ్బిళ్ళు, చందమామపదములు, అర్ధచంద్రికలు, తుమ్మెదపదములు, తందనాన పదములు, ఇట్లే ఊతపదము నూది సాగెడి గేయరీతులెన్నియో తాళ్ళపాకవారు చెప్పియున్నారు. మాత్రా ఛందస్సులపై రచనలు, పద్యములవలెనే చెప్పబడినవైనను త్రిశ్ర, చతురశ్ర, ఖండ, మిశ్ర, సంకీర్ణగతులకు ఒదుగుచు, రెండు సమఖండములుగల రెండు పంక్తుల చరణములతో నుండెడి వృత్తములు సంస్కృతమున నుండినట్లే తెనుగునందును అష్టపదులు, షట్పదులు, చతుష్ప దులు, ద్విపదలు అని పాడుకొనుటకు అనువుగా రచింపబడు

చుండెడివి. గానయోగ్యములైన ఇట్టి రచనలు ఒక నిర్ణీతమగు పద్ధతికి ఒదుగుట బహుశః 15, 16 శతాబ్దములలో జరిగి యుండును. అంతకుముందు గానము చేయబడుచున్న గేయముల స్వరూపములు స్పష్టముగా తెలియకుండుటవలనను, కొంతవరకైనను నిలచియున్న సంగీత సాహిత్య రూపములు, ఈ శతాబ్దములలోనివే యగుటవలనను ఇట్లు తలచవలసివచ్చినది.

భరతాదులందరును సంగీతమనగా గీతము, వాద్యము, నృత్యము, కలసిన ఒక త్రివేణీ సంగమ స్వరూపమని చెప్పియున్నారు. కాని కాలక్రమమున యీ మూడు శాఖలయందును స్వతంత్ర ప్రతిపత్తులు ఏర్పరచుకొన్న స్వరూపములు బయలుదేరినవి. ఐనను కొలదిపాటి సంబంధ బాంధవ్యములుండక తప్పలేదు. పాడుటకు రాగము, తానము, స్వరమువంటి ప్రత్యేకములగు నాదస్వరూపములున్నను, లయబద్ధమైన గీతమును గానము చేయనిచో సంపూర్ణమైన ఆనందము కలుగుట కష్టమైనది. అట్లే సాహిత్య స్వరూపములగు వృత్తములయందు సంగీతావసరములైన రాగ విస్తరణము, తాళము అను వాటికి తావు లేకున్నను పద్యములు వచనమువలె చదువుటకన్న శ్రావ్యముగా రాగ ధోరణియందు చదువుటయే ఆకర్షణీయముగనున్నది. ఇంతేకాదు, మత్తకోకిల మొదలగు కొన్ని వృత్తములు లయబద్ధములై పాటలవలె పాడబడుచునే యున్నవి. నాద స్వరూపమైన అక్షరములతో రూపొందిన పదములు వాక్యములుగా నేర్పడి అర్థమును సూచించుచూ ఏ విధముగా మహా కావ్యములై ఒప్పుచున్నవో అట్లే స్వర లయాదులతో సంగీతమునూ శోభించుచున్నది. భావములను అభివ్యక్తీకరించుటకు; సౌందర్య పూర్ణమగు మరియొక భాష, అభినయము. వివిధములగు రసములను వ్యక్తీకరించుటకు నృత్యము, నృత్తము, లాస్యము, అభినయమువంటి పేర్లతో పిలువబడు నాట్యవేదము పుట్టినది.

సంగీతమునందు ధాతుమాతువులనబడు స్వరసాహిత్యములు గలిగి గీతము, పదము, వర్ణము మొదలగు పేర్లతో పిలువబడు రచనా విశేషములుండును. ఇది ఏకధాతుక, ద్విధాతుక, త్రిధాతుక అను రూపములతో నుండవలెనని అన్నమాచార్యులు చెప్పియున్నారు. వారికి పూర్వముగల రచనా విశేషములయందు ధాతు స్వరూపములు అంత స్పష్టముగా తెలియవచ్చుటలేదు. కనుక అవి యెట్లుండినవో తెలిసికొను నవకాశమును కనుబడుటలేదు. అన్నమయ్య చెప్పిన విధముగనే పూర్వుల రచన లుండెడివని యనుకొన్నను, తిరిగి లక్షణములను లక్ష్యసమన్వితములుగా చెప్పవలసిన అవుసరము వారికి ఉండదు గదా! అందువలన 15, 16 శతాబ్దములనాటికి గల గీతరచనా పద్ధతులయందు ఒక నిర్ణీతమగు వ్యవస్థ లేదనియు, దానిని ఒక మార్గమునకు తెచ్చుటకు అన్నమయ్య ప్రయత్నించి యుందురని యనుకొనక తప్పదు. గీతమును ధాతుమాతువులతో లిపి బద్ధముచేసి యుంచుటయందలి ఆవశ్యకత ఒకప్పుడు అంతగా విద్వాంసులు గుర్తించినట్లు కానబడదు. కనుకనే ధాతు స్వరూపములతో కొంతవరకైనను నిలిచి యున్న గీతములు మనకు 17 వ శతాబ్దము తరువాతివి మాత్రము కొలదిగా మిగిలి యున్నవి. వాని యందలి రాగ, తాళ, ఛందోరీతులను పరిశీలించి, పూర్వులనుసరించిన మార్గము బహుశః ఇట్లుండి యుండునని అనుకొనుట తప్ప వేరు మార్గములేదు. వేదమువలె గానము కూడ గురుశిష్య పరంపరయందు చెప్పుకొనవలసి యుండుట సంగీతమును లిపి బద్ధము చేయకుండుటకు ఒక కారణమైనను కావచ్చును. అట్లే ధాతుస్వరూపమును స్పష్టముగా అనుస్వరములతో వివరింపక మాతువును మాత్రము శిష్యులకు చెప్పెడి పద్ధతియు కొంతవరకు గీతము తన రూపమును కోల్పోవుటకు కారణమై యుండవచ్చును. కాని అన్నమయ్యకు సమకాలికులై, వయసునందు ఆయన కన్న చిన్నవారైనను, అనేక వేల రచనలను అన్నమయ్యవలెనే,

కన్నడమున రచించిన పురందరదాసుల గేయములయందు ఇప్పటికినీ మనముచెప్పుకొనుచున్న పిళ్లయారిగీతములుచూచినచో స్వరబద్ధముగా గీతమును శిష్యులకు చెప్పెడి పద్ధతిని కొంతవరకు వీరు అమలు పరచినారని తోచుచున్నది. గీతమును పాడెడి విధానమునకు స్థిరమగు రూపమును ఇచ్చుట యందలి యవుసరమును గుర్తించిన వారిలో తాళ్లపాక వంశస్థులు మొదటి వారనుకొనవచ్చును. వీరి కాలమున దాసకూటములు ఆయావేళలయందు దైవసన్నిధిని పాడవలసిన పాటలు పాడువారిని నియమించెడి పద్ధతియును, అట్టివారికి స్థిరవసతుల నిప్పించి వంశపారంపర్యముగా దైవసన్నిధిని గాన కైంకర్యమును జేసెడి ఏర్పాట్లును ఉండియుండవచ్చును. తిరుపతి నుండి రాగిరేకులపై వ్రాసి ముఖ్యములగు సేవలయందు గానము చేయవలసిన గీతములను ఇతర దేవాలయములకు పంపుచుండుటయు జరుగుచుండెడిదట. పాడెడు వారును బహుశః ఆ యా స్థలములకు పోయి అచ్చటి వారికి చెప్పుచుండిరని అనుకొనవచ్చును.ముఖ్యముగా వైష్ణవదేవాలయములయందు ప్రధానములగు అహోబలము, సింహాచలము, శ్రీరంగము, శ్రీకూర్మము మున్నగు దేవాలయముల మధ్య ఇట్టి యేర్పాట్లుండి యుండవచ్చును.

ఇట్లు కేవలము మత ప్రచారమునకేగాక సంగీత సాహిత్యములను తమ తరువాతి తరములవారికి అందించు ప్రయత్నమును తాళ్ళపాకవారీవిధముగా చేయుచుండ, కర్నాటక సంగీతమునకు పితామహులవంటి వారగు పురందరదాసులు సరళీ, జంట, అలంకారములు, పిళ్లారి గీతములు సూళాదులు ఇట్టి గేయకల్పనలుచేసి స్వరబద్ధముగా సంగీతమును శిష్యులకు చెప్పెడు విధానమును రూపొందించి, ధాతు మాతువులతో కూడిన గీతమునకు స్థిరమగు రూపము నిలిచియుండునట్లు చేయప్రయత్నించిరి. గీతమునకు ఛందోనియమములవంటివి

తాళ్ళపాక వారు ఏర్పరుపగా వానిని దక్షిణాపథము నందలి సంగీత లోకమెల్లా మోదించి పాడించుచున్నదో, అట్లే పురందరదాసులు ఏర్పరచిన సంగీత విద్యాబోధన పద్ధతియు, దక్షిణాపథమున ఆమోదింపబడి, నాటినుండి నేటివరకు అనుసరింపబడుచున్నది. ఈ ఇరువురు భక్తాగ్రేసరులైన వాగ్గేయకారులు ఏర్పరచిన విధానములు, ఆనాటికే వాడుకలోనుండి వీరిచే స్థిరపరుపబడినవైనను కానవచ్చును, లేదా వారి ప్రతిభవలన అమరించబడినవైనను కావచ్చును. ఏమైనను వయసు నందు పెద్ద వారగు అన్నమయ్య వారేర్పరచిన పద్ధతికి మెరుగులు దిద్ది పురందర దాసులు ఇప్పుడున్న పద్ధతిని ప్రచారమునందుంచినా రనుటలో అతిశయోక్తి లేదు.

## శృంగార సంకీర్తనములు

అన్నమయ్య చెప్పిన సంకీర్తన లక్షణములయందు శృంగార, సంకీర్తన పద్ధతి మధురభక్తి భావోద్దీపనముగా నుండి యుండుటచేతను అప్పుడే కొంత కొంత దూరముగా త్రోయబడుచున్న నాట్య విద్య యందలి అత్యున్నతస్థాయి యగు అభినయమునకు తావుండుట వలనను, రాజాస్థానములయందు రసిక ప్రభువులు పోషించుటవల నను, ఐహికాముష్మికానందములకు తోడ్పడునది యగుటచేతను కొంత యెక్కువ ప్రచారమునకు వచ్చి యుండవలెను. కనుకనే, తమ కాలము నాటికి "పదము" అని వ్యవహరింపబడుచున్న శృంగార కీర్తనములతో అభినయమును జోడించి క్షేత్రజ్ఞులు ఆ రచనా పద్ధతిని అత్యున్నతస్థాయికి గొనివచ్చిరి.

పదమునందు పల్లవి, అనుపల్లవి, మూడు చరణములు ఉండుట సాధారణము. విలంబ కాలములో పాడబడు పదము అనుపల్లవితో ప్రారంభింపబడి పల్లవియందు విశ్రమించి, తిరిగి చరణముతో ప్రారంభమై అంత్యము వరకు సాగిపోవును. పదములయందు

పల్లవి, అనుపల్లవి, చరణముఅను మూడుధాతు స్వరూపములుండును. ఇందుచరణమునందలి రెండవఖండమును కూడఅనుపల్లవివలెనేపాడుట కలదు. ఇట్టి పదములను రచించిన వాగ్గేయకారులలో క్షేత్రజ్ఞులు అగ్రగణ్యులు. 4200 పదములను వీరు జెప్పినట్లు వారిదే యగు మేరువు పదమునందు గలదు. వీరి పదములు సంగీత సాహిత్యముల యందనన్య సామాన్యములై అభినయమునకు అనువైనవియై యొప్పుచున్నవి. వీరికి కొంచెము వెనుకముందిండిన వారనేకులు పదములను చెప్పి యున్నారు. కాని ఘనం శీనయ్య మంత్రి చెప్పిన 'శివదీక్షా పరురాలనురా' అను కురంజి పదము ఇప్పటికినీ ధాతు మాతువులతో ప్రచారమునందున్నది. తారాశశాంక విజయమను శృంగార ప్రబంధమును కృతిగొన్న యీ శీనయ మంత్రి విజయ రంగ చొక్కనాథుడను మధురపాండ్య ప్రభువునకు అమాత్యులుగా నుండిరట. క్రీ.శ. 1600-1680 మధ్యనుండిన క్షేత్రజ్ఞునకు పూర్వము వీరుండినవారని చరిత్రకారులు చెప్పుచుండుటవలన, 'శివదీక్షా పరురాలనురా' అను పదము సుమారు 450 ఏండ్ల ప్రాచీనత కలదేమో నని అనుకొనవలసియున్నది. అనగా కురంజి రాగమునగల సంచార సందర్భములన్నియు తరువాతి రచయితలు దీని నాధారము చేసుకొనియే చెప్పినారేమో యనుకొనుటలో ఆశ్చర్యము లేదు. ఘనము శీనయమంత్రి తమ కాలమునాటికి కొంచెమైనను ప్రచారములోనున్న తాళ్లపాకవారి రచనలయందలి సంగీత సాహిత్య ధోరణుల పునాదుల పైననేకదా తాను పాడియుండును! కనుక, ఇంకను అముద్రితములై తంజావూరు సరస్వతీమహాల్ పుస్తక భాండాగారమున వివిధ భాషలలో లిఖింపబడి, నిద్రించుచున్న గ్రంథములను పరిశీలించినచో రాగ తాళ నామములతో స్వరసహితములుగానున్న రచనలు కొన్నియైన దొరికె, తాళ్లపాకవారి గాన సాంప్రదాయములు స్పష్టముగా తెలుసుకొనుటకును, వారికిని, క్షేత్రజ్ఞులకును మధ్యగల మరి

కొందరు ఆంధ్ర వాగ్గేయకారులను గురించిన వివరములు కనుగొనుట కును అవకాశములున్న వేమోననిపించుచున్నది. ఇప్పుడు క్షేత్రజ్ఞుల పదములు సుమారు 150కి ధాతు మాతువులు లభ్యమగుచుండుట వలన, వీరి తదనంతరపు రచయితల పరిశ్రమను కొంతవరకైనను తెలుసుకొనుటకు వీలగుచున్నది.

## సంగీతమునందు జానపదము, శాస్త్రీయము

సంగీత పరిణామమునందు గమనించవలసిన మరియొక ముఖ్య విషయమును ఇచ్చట ముచ్చటించు కొందము. జానపదులు పాడు కొను పాటలయందుగల కొన్ని స్వరసందర్భములను, వరుసలను గమ నించినచో, అతి ప్రాచీనములగు కొన్ని రాగస్వరూపములు ఏర్పడిన విధము ఊహా మాత్రముగ గోచరించుచున్నది. ఛందో బద్ధములగు ఏకధాతు ద్విధాతుస్వరూపములగు కొన్ని పాటలయందుగల చిన్న చిన్న వరుసలను గూడ రాగములుగా నామోదించి, వానిని విస్తరించుకొని పెద్ద రాగములుగా తరువాత కొంతకాలమునకు రూపొందించుకొని నారేమోరనియుతోచుచున్నది. ఇట్లుజానపదుల గానమునుండి వచ్చిన వనియనుకొన దగిన రాగములును, వానికి విస్తృతములగు రూపము లును కొన్నిటిని గమనింతము. కురంజి, నవరోజు అనురాగములు శంకరాభరణ మేళమునకును; పున్నాగవరాళి, ఘంట, యనునవి తోడి మేళమునకును; సైంధవి ఖరహరప్రియ మేళమునకును; చంద్రి కాభైరవి, భైరవి మేళమునకును; ఝుంఝూటి హరికాంభోజి మేళ మునకును; నాదనామక్రియ, మాయామాళవ గౌళ మేళమునకును, మూలములయిన వనుకొనుటకు ఆక్షేపణ యుండకూడదు. మేళకర్త లకు పూర్వము, స్థాయియందలి ఏడు స్వరములను ఉపయోగించుకొన కయే, కొన్నింటిని మాత్రమే చేర్చుకొని పాటలుగా పాడుకొని వానియందలి మాధుర్యమును గమనించి మేధావులు అట్టివానిని వృద్ధి

పరచి రాగములకు విస్తృత స్వరూపముల నిచ్చియుందురనుకొన వచ్చును. ఇది యెట్లనగా, భాష, పదభావములను వ్యక్తపరచుకొను టకు వాడుకలోనికి వచ్చిన తరువాతనే కదా వ్యాకరణము, ఛంద స్సులు మొదలగునవి అవతరించినవి! ఇట్లు జరిగిన కొంత కాలమునకు సాధారణముగా మాట్లాడుకొను భాషయు, గ్రంథములయందు వ్రాయబడు భాషయు ఎట్లు వేరగుచున్నదో, అట్లే జానపద సంగీ తము, శాస్త్రీయ సంగీతము అను నామములతో సంగీతము నందును రెండు శాఖలు విడివడి యుండవచ్చును. శిష్టవ్యవహారమగు భాష కొంతవరకు గ్రంథస్థమై ఎట్లు నిలచినదో అట్లే కొన్ని జానపద సంగీత ఫణతులును శాస్త్రామోదములై నిలచినవేమో యనుకొనవచ్చును. ఇట్లు నాగరక, జానపద సంస్కృతుల మధ్య బాంధవ్యములు కొన సాగుచు వచ్చుచుండుట యనునది అన్ని విద్యలయందును జరుగు చునేయుండును.

పదసాహిత్యమునందుగల భాషయందును కొంతవరకు ఇట్టి పోకడలు కనబడుచున్నవి. శిష్టవ్యవహారికము వాడుచూ వచ్చేని, పొయ్యాని, చల్లనాయ, గిలిగింత లయ్యాని, వంటి సామాన్యవ్యావ హారిక రూపములగు మాటలను సైతము యథాసందర్భముగ నిందు వాడుకొని యున్నారు. కొందరు పదకర్తలు జానపదుల వాడుక భాషయందే పదములను చెప్పియున్నారు. ఇట్లు చెప్పినవేయైనను, ఛందోనియమములు, గీత రచనా విధానము, తాళము, రాగము మొదలగునవి మాత్రము యథాశాస్త్రీయముగనే పాటించినారు. ఇంకను, జానపద సంగీతమునందలి రీతులు, సంగీత సాహిత్యముల యందు ఎన్ని ఎట్లెట్లు మిళితములై, శాస్త్రీయ సంగీత, సాహిత్య రూపములుగా ఆమోదింపబడినవో పరిశోధించి తెలుసుకొనవలసి యున్నది.

## సంగీతమునందు కర్నాటకము - హిందూస్థానీ

వేరు వేరు జాతులవారు అన్యదేశములనుండి భారత దేశమునకు వలసవచ్చి ఇచటి వారితో కలిసి మెలసి యుండెడి కాలమున వారి సంస్కృతి ననుసరించి వికసించిన సంగీత సాహిత్యాది కళలను ఇచటి వారియందు ప్రచారము చేయుటయు, ఇచట గల కళాస్వరూపము లను వారు తమ దేశములయందు ప్రచారము చేయుటయు జరుగు చుండెడిది. ఇట్టి ఇచ్చిపుచ్చుకొను సహృదయతవలన కొన్ని అంతకు మున్నెన్నడు కానరాని విచిత్రప్రక్రియలు కళలయందు ద్యోతకము లగుటయు, జరుగుచుండెడిది. ఇట్టి పరిణామములలో నొకటి యను కొనదగినది భారతీయ సంగీతమునందు 15, 16 శతాబ్దముల ప్రాంత మున జరిగియుండును. ఉత్తర భారతమునందు మహమ్మదీయుల రాకతో అప్పటికిగల ప్రాచీన సంగీత పద్ధతులయందు పర్షియన్ సంగీత పద్ధతులు కలిసి ఒక క్రొత్త రూపమును సంతరించుకొని ప్రత్యేక మార్గమున వికసించుట జరిగినది. సుమారు పదెనిమిది వందల సంవత్సరముల నుండియు నిరాటంకముగా కలగలుపులేని పద్ధతిని సాగు చున్న దక్షిణ ప్రాంతపు సంగీతమునకు కర్నాటక సంగీతమని పేరు స్థిరపడుటయు, ఆ కాలముననే జరిగియుండవచ్చును. ఇట్లే ఆంగ్లేయుల రాకతో వారి సంగీతమునందలి పోకడలు ఉత్తర, దక్షిణ భారత సంగీ తపు పద్ధతుల యందు చోటుచేసుకొనినవి. వాయులీనమను పాశ్చా త్యుల వాద్యము భారతీయ వాద్యములందు స్థిరముగా నిలిచిపోయినది. ఇట్లే వాద్యసమ్మేళనములో చిన్న చిన్న గీతములను పాడుచుండెడి లలిత సంగీతమని నేడు చెప్పుకొనుచున్న యొక పరిణామమును, మన దేశమునందు చోటుచేసుకొనినది. ఇందు నేడు మన ముపయోగించు అనేక వాద్యములు ఇతర దేశములనుండి వచ్చినవే! ఇట్లే కర్నాటక

హిందూస్తానీ పద్ధతులలో సంగీత విద్యను అభ్యసించుచున్న పాశ్చాత్యులగు కళాకారు లెందరో కలరు.

### పదకర్తలు

క్షేత్రజ్ఞుల తరువాత తెనుగున శృంగార పదరచనా సంప్రదాయమును కొనసాగించిన వారిలో గోవింద సామయ్యా, వారి సోదరులు కూవన సామయ్యా, ఆనయ్యా, శంకరాభరణ రాగమును పాడుటయందు ప్రసిద్ధులై ఆ రాగనామమే ఇంటి పేరుగ నిలబెట్టుకున్న నర్సయ్యా, కుప్పుసామయ్యా, సారంగపాణి, మెరటూరు వెంకట రామశాస్త్రిలు సొరకాడు వెంకట సుబ్బయ్యా కుమారుడు కవి మాతృభూతయ్యా, ఘటపల్లి వారు, బొల్లపురము వారు, జటపల్లి వారు, శోభనగిరి వారు, ఇనుకొండ వారు, శివరామ పురము వారు, వేణంగిపురము, మల్లికార్జున ముద్రవారు, కస్తూరిరంగ ముద్రవారు, యువరంగ ముద్రవారు, మధ్యార్జునం సభాపతి అయ్యర్, సుమారు నాలుగైదు వందల సంవత్సరములనుండి తమ రచనా రత్నములతో సంగీత సరస్వతిని అలంకరించినారని చారిత్రక పరిశోధకులు చెప్పగా తెలియుచున్నది. ఇందు క్షేత్రజ్ఞులవియు, సారంగపాణివియు తప్ప తక్కిన రచయితల పదములు అతి తక్కువ సంఖ్యలో దొరకుచున్నవి. ఆ దొరకిన వాటికైనను ధాతురచన సరిగా తెలియవచ్చుటలేదు.

విలంబ కాలమునగాని, మధ్యమకాలమునగాని పాడవలసి వచ్చుటయును, మాటలయందు కొంత అభినయ యోగ్యములైన భావములు ఉండవలసి యుండుటవలనను, రాగ, తాళ విన్యాసములు కష్టసాధ్యమగుట వలనను క్రమముగా మధుర భక్తియుత మగు శృంగా

రమునందు ఒక్క శృంగారమే 'పుగిలి పోవుటవలనను గాయకులు అభినయ సహాయము' లేకుండగనే పాడుకొనుటకు వీలుగానుండి, లౌకిక శృంగారపు పాలు కొంచెము అధికముగా నుండెడి జావళులు ఈ శతాబ్దపు ప్రారంభమునుండి ప్రచారమునకు రాసాగినవి. దీనికి కార్వేటి నగర వాసులైన సారంగపాణి కొంత దారి చూపినారేమో! సంగీత సాహిత్యములయందు తెనుగు వారు తెచ్చుకున్న మార్పులు చేర్పులు దక్షిణాపథమందంతటను ప్రచారమునకు వచ్చుచుండుటవలన ఆ యా భాషలయందును సమకాలీనులగు వాగ్గేయ కారులిట్టి రచనలను చేయుచుండెడి వారు. ఇంతియేకాదు. మళయాళ, తమిళ కర్నాటక భాషలు మాతృభాషగాగల వారిలో చాలమంది సంస్కృతాంధ్రములయందు పాండిత్యమును సాధించి తమ రచనలను ఆ రెండు భాషలయందును చెప్పుకొని వెల్లడి పరచుకొన్నట్లు తెలియుచున్నది. అనగా రాజకీయ, మత, సాంఘిక హద్దులకు సంబంధము లేకుండ తెనుగు, కర్నాటక సంగీతమునందు ఎంత మహత్త్వ పూర్ణమైన స్థానమును సంపాదించుకొన్నదో వేరుగా చెప్పవలెనా? మన తరమునకు కొంచెము వెనుకటి వారును, మహానుభావులును తాళ్లపాక వారి సాహిత్యవైభవమును వెలుగునకు తెచ్చిన వారును అగు కీ. శే. బ్రహ్మశ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు క్షేత్రజ్ఞుల పదములను వినుచు అశ్రుపూరిత నయనములతో "నా తెనుగు తియ్యనిదని తెలుసు. అది ఇంత తియ్యనిదని అనుకొనలేదయ్యా!" అని యొక సందర్భమున ఆనందించిరి. తెనుగు నందలి తీపి తెలిసి ఆనందించు వారింకను దక్షిణాపథము నందంతటను కలరుగనుకనే ధాతుమాతు స్వరూపములు కొంతవరకైనను నిలుపుకొనిన తెనుగు రచనలు మనకు దొరకు

చున్నవి. ధాతు లక్షణములు తెలియని సంగీత రచనలు జీవకళను కోల్పోయిన చిత్రముల వంటివే యగును.

ప్రాంతీయ కుల మత భాషాతత్త్వములను సంకుచిత బుద్ధులు లేని కాలమున సంగీత సాహిత్యములు అత్యున్నత పథములయందు ప్రయాణము చేసినవి. కళను పోషించెడి వారు ఎచట నుండిన, నచటికి కళాకారులు వలసపోయి వారి విద్యలను ప్రదర్శించి ఆదరణ పొందుచుండెడి వారు. కనుకనే కృష్ణాతీర వాసులగు క్షేత్రజ్ఞుల పదములు, భద్రాచల వాసియగు రామదాసు కీర్తనలు, ఇంకను నారాయణ తీర్థుల వారు, సిద్ధేంద్రయోగి ఆదిగాగల మహానుభావుల రచనా విశేషములు మనకు దక్షిణ దేశమునందలి మారుమూలల యందును వినబడుచున్నవి. ఎందరో తెనుగు వారు 5, 6, వందల ఏండ్ల నుండి తంజావూరు మధుర, తిరువయ్యారు, శ్రీ రంగము మొదలగు నగరముల యందును వాటి పరిసరములయందును స్థిరనివాసము లేర్పరచుకొని సంస్కృతాంధ్రములను సాధించి గీత, కీర్తన, పదవర్ణాదులను రచించి, శిష్యులకు విద్యాదానముచేసి, అలౌకిక మగు భక్తి తత్పరత వలన నేటికిని పూజ నీయులై ఉత్సవములను జరిపించుకొనుచున్నారు. ఇట్టి మహానుభావుల రచనలను, జీవిత విశేషములను సేకరించి ప్రచురించి తెనుగు వారి కళాకౌశలమును, సేవను లోకమునకు వెల్లడి పరచవలసి యున్నది. ఇప్పుడున్న సంకుచిత దృష్టి నాడుండినచో అనేక మంది మహానుభావుల పేర్లయినను మనకు నేడు తెలిసియుండెడివికావు.

**ధాతువు - మాతువు**

ధాతు అనగా స్వరరూపమగు పాటమట్టు. మాతు అనగా సాహిత్యరూపమగు గీతము. ఇందు స్వర మొక్కటియు నుండినను,

సాహిత్య మొక్కటియు నుండినను అది పాడుటకు వలను పడదు. ఏకధాతు అనునది పల్లవి మొదలు అన్ని చరణములును ఒకేరీతియగు వరుసయందు పాడుకొనునది. ద్విధాతు అనునది పల్లవికి ఒక వరుసయు, తక్కిన చరణములకు ఇంకొక వరుసయు నుండి పాడుకొనునది. త్రిధాతుక యందు పల్లవి, అనుపల్లవి, చరణము అను మూడింటికిని వేరు వేరు స్వర రచనలుండును. చతుర్ధాతుకయందు పల్లవి, అనుపల్లవి, చరణము చరణాంత్యమునందు మధ్యమకాల సాహిత్యముగల మిశ్ర మనునదియు నుండును. ఇట్లే ధాతుస్వరూపము అనగా స్వర రచన మారుచుండుటవలన గీత స్వరూపములు కూడ మారుచుండును. పల్లవి, అనుపల్లవి, చరణము, అను పేర్లు వాడుకలోనికి వచ్చుటకు ముందు ఉద్గ్రాహ, ధృవ, అభోగములను పేర్లు వాడుకయందుండియుండును. చతుర్ధాతుకయందు మేళాపకమను మరియొక అంగము పేరును కూడ లక్షణకారులు చెప్పియున్నారు. దానినే నేడు మిశ్రమని చెప్పుకొనుచున్నామేమో ! పేర్లు యేవైనను ధాతుస్వరూపము మాత్రమిట్లుండును.

## వైరాగ్య సంకీర్తనములు

అన్నమయ్య చెప్పిన వైరాగ్య సంకీర్తనములు ఏకధాతు ద్విధాతు లక్షణములు కలిగినవియై, తత్త్వములు, వేదాంత కీర్తనలు, మొదలగు రచనల రూపమున చెదురు మదురుగా దేశమునందంతటను వినవచ్చుచునే యున్నవి. ఇట్టి రచనలు చేయువారు తమ నామము నైనను చెప్పుకొనుటకు ఇష్టపడక పోవుటవలనను పాడెడివారు ఆధ్యాత్మిక చింతనా పరులైన వారై భాషావిషయమునను, సంగీత విషయమునను పరిశ్రమ అంతగా చేసిన వారు కాకుండుట వలనను వారికి ఆధ్యాత్మిక తత్త్వమును బోధించుచూ గురువులు వినిపించిన పాటలను పాడుకొనుచు వానియందలి తత్త్వరహస్యముల నాకళించుకొను వారు మాత్రమే యగుటచేతను ఇట్టి గేయ కల్పనలు చేసిన వారి

చరిత్ర కనుగొనుట కసాధ్యమగుచున్నది. పోతులూరి వీరబ్రహ్మం, దూదేకుల సిద్ధప్ప, వేములకొండ కోనయ్య, మంతెన వెంకటదాసు, శరగోపదాసు, పిల్లపాపయ్య, ఉప్పల రామయ్య, తరికొండ నరహరి, గోర్తి రామదాసులు, శేషచలపతి, చామర్తి లక్ష్మీనరసమాంబ, ఆది నారాయణదాసు, మహాలక్ష్మి, బలిజేపల్లి రామదాసు, నిట్టల ప్రకాశ దాసు, హరిభోగలింగకవి, ప్రయాగ రంగదాసులు, వెంకట విఠల దాసు, వెంకట రమణదాసు, పెద్దదాసరి, బోధేంద్ర సద్గురుస్వామి, మున్నగు మహానుభావు లెందరో నిగూఢములైన తత్త్వరహస్యముల నిమిడ్చి పాడుకొనిన పాటలు అక్కడక్కడ దొరకుచున్నవి. వీర లుండిన కాలము, దేశము ఇత్యాది వివరములు తెలుసుకొనుటకు ప్రయత్నములు జరుగవలసియున్నది. ఇట్టి రచనలు దొరికినంతవరకు సేకరించి కాలక్రమమున దొరలిన తప్పులను సవరించి స్వరసహితముగా ముద్రించినచో ఆధ్యాత్మిక చింతనాపరులైన వారికిని, ప్రాచీన సంగీత సాహిత్య సంస్కృతులను తెలుసుకొనగోరు వారికిని, జానపద, శాస్త్రీయ సంగీతముల మధ్యగల అనుబంధ బాంధవ్యములను పరిశీ లింప గోరువారికిని ఎంతైన నుపకరించును.

## కృతి — కీర్తన

అన్నమయ్య చెప్పిన భక్తి సంకీర్తనల వరవడిలో కీర్తనలను, కృతులను, సంగీత సంప్రదాయములలో చెప్పిన వారు గడచిన నాలు గైదు వందల సంవత్సరముల నుండియు మన దేశమునం దెందరో గలరు. వీరిలో భద్రాచల రామదాసులు ప్రాచీనులు. ఏకధాతు, ద్విధాతు రూపములను సంగీత స్వరూపములలో భజన సంప్రదాయ మున కనువగు రచనలనెన్నియో వీరు చెప్పియున్నారు. వీరి రచనల యందు స్తుతి, వినతి, శరణాగతి, కైంకర్యము మొదలగు విషయ ములు వారి ఆరాధ్యదైవమగు భద్రగిరీశుని పరముగా నుండి రాగ తాళములకును, భాషకును, ప్రాధాన్యత యుండి, భక్తిరస

పూరితములై యుండుట గమనార్హము. వీరికి సమకాలీనులగు మద్దిరాల వెంకటరాయశాస్త్రి తరువాతి వారగు తూము నరసింహదాసులు వెంకటాద్రిస్వామి వారు, యెడ్ల రామదాసు వంటి భక్తులును తమ తమ భక్తి సంప్రదాయి గేయములయందు మనకు ఇట్లే సాక్షాత్కరింతురు. వీరభద్రయ్య, పైడాల గురుమూర్తిశాస్త్రి, మేరటూరు వెంకట్రామశాస్త్రి, దొర సామయ్య, మూకనల్లూరు సభాపతయ్య, ఆనయ్య, పల్లవి గోపాలయ్య, పల్లవి శేషయ్య, మాతృభూతయ్య, కాశీనాథయ్య, మధుర శ్రీనివాసయ్య, గిరిరాజకవి, గోవింద సామయ్య, కూవన సామయ్య, పచ్చిమిరియం ఆదిఅప్పయ్య, ఇనుపసెనిగల వేంకట రామయ్య, శొంఠి వెంకట సుబ్బయ్య, చౌకం సీనయ్య మొదలగు వాగ్గేయ కారులు మాత్రము త్రిధాతు స్వరూపములగు రచనలను అంబ, విష్ణు, శివ ఆది దేవతలపై చెప్పియున్నారు. వీరి రచనల యందలి సంగీత సాహిత్య స్వరూపములను గమనించినచో ఇప్పుడు మనము వినుచున్న కర్నాటక సంగీత స్వరూపమునకు కొంత భిన్నముగనే తోచక మానదు.

కీర్తన మనగా తన ఆరాధ్య దైవమునో, తాము కొలిచెడి ప్రభువునో కీర్తించుచు, వారి గుణ గణములను, వైభవములను, వర్ణించుచు చెప్పినది. 'సుజన జీవనా' అను త్యాగరాజస్వామి వారి రచన దీని కుదాహరణము. ఇట్లే కృతి యనగా ఏదేని యొక విషయమును చెప్పి దానిని దేవునికో, ప్రభువులకో అంకిత మిచ్చుట. ఇది కావ్యము కావచ్చును, లేదా ఒక చిన్న రచన యైనను కావచ్చును. 'క్షీరసాగరశయన', 'నగుమోముగనలేని', 'శాంతములేక' మొదలగు త్యాగరాజస్వామి వారి కృతులిట్టి వాని కుదాహరణములు. తెనుగు వాగ్గేయకారులలో అనేకులు ఇట్టివేగాక సంగీత సౌందర్యములకు ముత్యాల పతకములవంటివగు వర్ణములు, స్వరజతులు, స్వరపల్లవులు, గీతములు, దరువులు మొధలగున వెన్నియో రచించి యున్నారు.

## త్రిమూర్తులు - వారి శిష్యులు

తెనుగు వారగు వాగ్గేయకారులు కొందరు సంస్కృతమునందును గేయకల్పనలు చేసి ఖ్యాతి వహించిరనుట అతిశయోక్తికాదు. వీరి రచనలయందు మణిప్రవాళములు కూడ గలవు. మణిప్రవాళమనగా తెనుగు, తమిళ, కన్నడ, మళయాళ, ఓఢ్ర, కాశ్మీర, సంస్కృతాదిగాగల భాషలలో కొన్నిటిని మిళితముజేసి కవితలను రచించుట. ఇట్టి వారియందు మార్గదర్శి శేషయ్యంగారు, వైకుంఠ శాస్త్రిలు, కులశేఖర పెరుమాళ్, స్వయంప్రకాశ యతీంద్రులు, శివరామాశ్రములు, తచ్చూరు సింగరాచార్యులు, విజయగోపాలుడు, ముద్దుస్వామి దీక్షితులు, మొదలగు వారు ముఖ్యులు. ఇందు కర్నాటక సంగీత త్రిమూర్తులలో నొకరగు దీక్షితులవారి రచనలు అత్యంత మనోహరములై సంగీత సంప్రదాయములకు ఉదాహరణ రూపములై యొప్పుచుండును. పల్లవి, ఒక చరణము, చరణాంత్యమునందింకొక మిశ్రముగలిగి త్రిధాతు రూపమున కొన్నియు, పల్లవి, అనుపల్లవి, మిశ్రము, చరణ, చరణాంత్యమునందింకొక మిశ్రము యుండి, పంచధాతు స్వరూపములుగలవి కొన్నియు, మణిప్రవాళములును, వీరి కీర్తనములయందు కనబడుచున్నవి. వీరి తండ్రిగారు రామస్వామి దీక్షితులవారే హంసధ్వని రాగమును సృష్టించిరి. వారివి తెనుగు రచన లెన్నియోగలవు. ముద్దుస్వామి దీక్షితులవారి పౌత్రుడు సుబ్బరామ దీక్షితులవారే సుమారు రెండు మూడు వందల సంవత్సరముల నుండి వచ్చుచున్న సంగీత సంప్రదాయములను పరిరక్షించి లక్ష్యలక్షణములను సమన్వయించుచు, 'సంగీత సంప్రదాయ ప్రదర్శిని' అను గ్రంథమును ఈ శతాబ్దపు ప్రారంభమున అచ్చొత్తించినారు. అందు సుబ్బరామ దీక్షితుల వారి మనోజ్ఞములగు తెనుగు రచనలెన్నియో కలవు. తంబియప్ప, వడివేలు, పొన్నయ్య, చిన్నయ్య, వేటనూరు సుబ్బరాయలు (వీరు వైణికులు) ఎట్టయాపురం త్యాగయ్య మొద

లగు వారు దీక్షితుల వారి శిష్య పరంపరలోని వారు. సుబ్బరామ దీక్షితుల వారి మిత్రులు కృష్ణ స్వామయ్య అనువారు రచించిన కీర్తనము లనేకములకు వీరు ధాతువుల నేర్పరచినారు. శ్రీకులశేఖర పెరుమాళ్ అను నామాంతరముగల స్వాతి తిరునాళ్ మహారాజా వారు సంస్కృతాంధ్ర మళయాళాది బాషలందేగాక, మణిప్రవాళ రచనలు, తెలుగు సాహిత్యములుగల వర్ణములును అనేకములు రచించియున్నారు.

త్యాగరాజస్వామి సమకాలీనుడు, బంగారు కామాక్షికి ప్రియమైన భక్తుడు స్వచ్ఛమగు తెనుగునందు అమ్మవారిపై అత్యంత మనోజ్ఞములైన రచనలను చెప్పి కర్నాటక సంగీత సామ్రాజ్యమును పాలించిన త్రిమూర్తులలో నొకరగు శ్యామశాస్త్రిల వారి కుమారులైన పంజుశాస్త్రి (గాయకులు) సుబ్బరాయ శాస్త్రిల వారును సమర్థులైన వాగ్గేయ కారులై చక్కని తెనుగునందు అంబపై కీర్తనలు, స్వరజతులు చెప్పియున్నారు. వీరి అన్న కుమారులగు అణ్ణాసామి శాస్త్రిలును ఫిడేలు వాద్యమునందు నిపుణులై కీర్తనములు, దరువులు, తానవర్ణములు, మొదలగునవి రచించి ప్రసిద్ధులైనారు. పెరంబూరు కృష్ణయ్య, ఉలూన్నరు కృష్ణయ్య, కంచి కాచి శాస్త్రిలు చంద్రగిరి రంగాచార్యులు, తిరుజ్ఞాన మొదలియార్, చిమటా రాఘవులు చెట్టి, వాయులీన విద్వాంసుడు బాలు, నాదస్వర విద్వాంసులు దాసరి మున్నగు వారు శ్యామశాస్త్రిల వారి శిష్య పరంపరలో ప్రసిద్ధులు. శ్యామశాస్త్రిలవారి పూర్వీకులు కర్నూలు ప్రాంతము నుండి దక్షిణ దేశమునకు వలస వెళ్ళిరని పరిశోధకులు చెప్పుచున్నారు. ఏమయినను శాస్త్రిల వారు, వారి కుమారులు, శిష్యులు రచించిన కృతికీర్తనాదులయందు మాత్రము అత్యంత మనోజ్ఞమును, సరళమునునగు తెనుగు భాష కనబడుచున్నది.

వాగ్గేయ కారులలో త్యాగరాజస్వామి అవతరించు నప్పటికి సంగీతమునందు సాహిత్య భాగము కొంత యధికముగా నుండి భక్తి రస ప్రధానములగు భజన కీర్తనలను మాత్రము పాడుకొనుచు, తాము తరించి శ్రోతలను తరింపజేయు వారొకవర్గము గను, రాజాస్థానముల యందు గాన విద్యాప్రౌఢిమను ప్రదర్శించుచు, వారిచ్చు భోగభాగ్యములనందుకొని ఆనందించెడి వారొకవర్గముగను నుండి యుండవలెను. త్యాగరాజస్వామికి శ్రీరామ సాక్షాత్కారమైనదనియు, సాక్షాత్ నారదులవారు స్వరార్ణవమను గ్రంథమును ఇచ్చినారనియు ప్రతీతి. నేటికిని దక్షిణా పథమునందంతటను త్యాగ బ్రహ్మమని చెప్పుకొన బడు వీరు, అసంఖ్యాకములగు తమ రచనలతో సంగీత సరస్వతిని ఆరాధించి తరించిరి. వీరి రచనల యందు అనేక నూతన రాగములు కన బడుచున్నవి. కొన్ని ప్రాచీన రాగములు కూడ కలవు. ఇప్పుడు సుమారు 700 రచనలు మాత్రము వీరివి దొరుకుచున్నవి. ఇందు దివ్యనామ సంకీర్తనము లనబడునవి ఏకధాతు, ద్విధాతు రూపము లలో నుండును. కీర్తన, కృతి యనునవి త్రిధాతు స్వరూపములుకల విగా నున్నవి. సంస్కృతాంధ్రములు కలసిన మణిప్రవాళ రచనలును గలవు. కర్ణాటక సంగీతమునకు నేడు మనము చెప్పుకొనుచున్న త్రిమూర్తులలో వీరగ్ర గణ్యులు. నౌకాచరిత్రము, ప్రహ్లాద భక్త విజయము అను యక్షగానములను కూడ వీరు రచించిరి. మధ్యమ కాల విలంబ కాలములలో పరమాత్ముని లీలలను చెప్పునవియు, లోక వృత్తమును వివరించునవియు, ఇంకను అనేక విధములగు రచనా విశేషములను వీరు చెప్పియున్నారు.

త్యాగరాజస్వామి వారికి శిష్యులై కర్ణాటక సంగీతమును తమ కృతిరత్నములతో నలంకరించిన వారును, స్వామివారి రచనలను తరువాతి తరముల వారి కందించిన వారునునగు కొందరు వాగ్గేయ కారులలో వైణిక శ్రేష్ఠులును, తాన, వర్ణ, గీత, కీర్తనాదులనెన్ని

టినో స్వయముగా వెలయించిన వారును అగు వీణ కుప్పయ్యగారు, వీరి పుత్రులు తిరువత్తియూర్ త్యాగయ్యగారును, గురుభక్తి పరాయణులు, భక్తవరులు, త్యాగరాజస్వామి వారి కీర్తనలను బహు శిష్యులకు చెప్పి ప్రచారమును చేసిన వారునునగు వాలాజీపేట వెంకటరమణ భాగవతులు, అయ్యాభాగవతులు, సుబ్బరామ భాగవతులు, తిల్లస్థానం రామయ్యంగారు, ఉమాపురం కృష్ణభాగవతులు, సుందర భాగవతులు, గణేశయ్య, సోజిరి సీతారామయ్య, అమృతలింగపిళ్ళె, మానంబుచావడి వెంకటసుబ్బయ్య (వాయులీన విద్వాంసులు, వీరికి అనేక మంది శిష్యులుండినట్లు చెప్పుదురు) నీలకంఠయ్య, తంజావూరు రామారావు మొదలగు వారు త్యాగరాజస్వామి వారి కీర్తనలు సంగీత లోకమునందు నిలిచి యున్నంతవరకు తలచుకొనవలసిన విద్వత్ శిరోమణులు.

## ఇతర వాగ్గేయకారులు

కర్నాటక సంగీతమును తమ రచనలతో పునీతము గావించిన త్రిమూర్తులు, వారి శిష్యపరంపరలలో వెలసిన విద్వచ్ఛిరోమణులును గాక, మరికొందరు వాగ్గేయ కారులు, గాయకులు, వాద్య నిపుణులు, దక్షిణ దేశమునను, ఆంధ్రదేశమునను వెలసి తమ విద్యావైభవములచే చిరస్థాయియగు కీర్తిని నిలబెట్టుకున్నారు. క్షేత్రజ్ఞులకు ముందు వెలసిన పదకర్తలవలెనే, సంగీత త్రిమూర్తులకు కొంచెము వెనుక ముందుగా వాగ్గేయ కారులనేకులు సంస్కృతాంధ్రములలో రచనలు చేసి, తమ కాలముల నాడు ప్రసిద్ధులై ఉండియుండిరి. అట్టి వారిలో చెయ్యూరు మరుపెద్ది చెంగల్వ రాయశాస్త్రి, పుదుక్కోట శేషాచలము, దంపూరి సుబ్బరామయ్య, పరమేశ్వర భాగవతుల శిష్యులు కోయంబత్తూరు రాఘవయ్య, కుంద్రకుక్కుడి కృష్ణయ్య ముఖ్యులు.

గర్భ పురిముద్రతో సాహిత్యములను చెప్పిన కరూరు దక్షిణా మూర్తిశాస్త్రి, వారి సాహిత్యములకు స్వర రచనలు చేసిన కరూరు చినసామయ్యా వారిసోదరులు పెదదేవుడు, చినదేవుడు, వారి తండ్రి గారగు నరసింహయ్యా, వెంకటేశశాస్త్రులు, నంజన్‌కోడు విద్వాన్ సుబ్బాశాస్త్రులు, వెంకట సరస్వతి శేష శాస్త్రులు, శేషగిరిశాస్త్రులు అరుణాచలశాస్త్రి, చిన్నకృష్ణదాసు, వైకుంఠశాస్త్రులు, ఇంకను పట్నం సుబ్రహ్మణ్యయ్యా, మైసూరు సదాశివరావు, పులియూర్ దొర సామయ్యా, మీచుకృష్ణయ్యా, ఊత్తుకాడు వెంకటసుబ్బయ్యా, జెయ్యూరు స్వామి, మైసూరు వాసుదేవాచారి, మహావైద్యనాథయ్యా, రామ నాథపురం శ్రీనివాసయ్యా, పొన్నయ్యాపిళ్ళ, తచ్చూరు సింగరాచా ర్యులు, వారికేశనల్లూరు ముత్తయ్య భాగవతార్, జి. ఎస్. బాల సుబ్రహ్మణ్యయ్యా, తిరువతినారాయణస్వామి, మున్నగువారు దక్షిణ దేశమునందుండి తెలుగు సంస్కృతములలో గేయకల్పనలుచేసినవారు. అట్లే ఆంధ్రదేశమునందు గురువాచార్యులు—వైణికులు, వర్ణములు స్వరజతులు, శబ్ద పల్లవులు, గీతములు రచించినవారు. వీరిశిష్యులు దూర్వాసుల సూర్యనారాయణ సోమయాజులు, దూర్వాసుల దక్షిణామూర్తిశాస్త్రి వీరుకూడ కొన్ని కీర్తనలను రచించిరి. సాలూరు వాస్తవ్యులు పట్రాయని నరసింహశాస్త్రులు, వారి పుత్రులు సీతారామశాస్త్రి రచించిన కృతులు కూడ వాడుకలో నున్నవి. సీతారామ శాస్త్రిగారి శిష్యులే ప్రఖ్యాత గాయకులు ఘంట సాల వెంకటేశ్వరరావు. ధర్మపురి సుబ్బారావు, పట్టాభిరామయ్యా ఎన్నియో జావళులు చెప్పిరి. మా గురువులు పేరిరామ్మూర్తి శాస్త్రులు రచించిన కృతులెన్నియో గలవు. హరినరసింహశాస్త్రి, హరినాగభూషణం, నల్లాన్ చక్రవర్తుల నారాయణాచార్యులు, పాపట్ల కాంతయ్యా, గబ్బిట యజ్ఞన్న శాస్త్రి, పురాణం కనకయ్యా శాస్త్రి, గురుముద్ర, కృష్ణముద్ర, వారణాసి రామసుబ్బయ్యా, కాశీ నాథుని భైరవమూర్తి కొమ్మెర్ల కోటరామరాజు, విష్ణు కృష్ణమూర్తి

ఇంకను మనమధ్య తిరుగుచు, ఆశీర్వదించుచున్న ఓగిరాల వీరరాఘవ శర్మ, డాక్టర్ శ్రీరామమూర్తి, చిరంజీవి మంగళంపల్లి బాలమురళీ కృష్ణ మొదలగువారు ఎన్నియో నూతన రాగములలో అత్యంత మధురములును, విచిత్రములును అగు గేయ కల్పనలు చేయుచు న్నారు.

## కొందరు ప్రసిద్ధులగు గాయకులు

గొర్తిలక్ష్మీనారాయణ, చల్లపల్లి సుబ్బయ్య, ధేనుకొండ చిన్నయ్య, నారుమంచి జానకిరామయ్య, ప్రయాగ తిరుమలయ్య, అఠాణా అప్పయ్య, పారుపల్లి రామకృష్ణయ్యపంతులు, సింహాచల భాగవతార్, శృంగారం అళఘశింగరాచార్యులు, రేగెళ్ళ దుండేశ్వరుడు, రేగెళ్ళ జగన్నాథం, నందిగామ వెంకన్న, కట్టుసూరన్న, పప్పుఅప్పయ్య, ద్వివేదుల లక్ష్మణశాస్త్రి (వీరికి షట్కాల భరతాచార్యులని బిరుదుండెడిదట) వారణాసి రామసుబ్బయ్య, వారి శిష్యులు తాడిగడప శేషయ్య, మండా సూర్యనారాయణ (వీణా గాత్రములయందు నిపుణులు) మొదలగు గాత్రపాటకులు యీదేశము నందెందరో సంగీత విద్యయందు తాము ప్రతిభాశాలురై, శిష్యులనేకులకు విద్యాదానము చేసి, ఆంధ్రుల సంగీత కళాకౌశలమును కాపాడుచు వచ్చుచునే యున్నారు.

## గురువులు-గురుకులములు

కొందరు మహానుభావులగు విద్వాంసులు తమయిండ్లనే గురుకులములుగా మార్చి తమకు కలిగినదానిలో విద్యార్థులకు వసతి, భోజనాదులను కల్పించుచు విద్యనుగరపి జీవనోపాధిని కలిగించిరని వారిశిష్యులు యీనాటికిని చెప్పుకొని సంస్మరించు కొందురు. అట్టి

వారిలో సుసర్ల దక్షిణామూర్తి శాస్త్రిగారు, వారి ప్రియశిష్యులు పారుపల్లి రామకృష్ణయ్య పంతులుగారు, పిరాట్ల శంకరశాస్త్రిగారు, దుడ్డు సీతారామయ్యగారు (వీరు సంగీతాష్టావధానము చేసెడివారట) వీరికుమారులు దుడ్డు సీతారామయ్యగారు మునుగంటి శ్రీరాములు గారు, మునుగంటి పానకాలరావుగారు, మునుగంటి వెంకటరావు గారు, పట్రాయని నరసింహశాస్త్రిగారు, వారికుమారులు సీతారామ శాస్త్రిగారు, ప్రయాగ రంగ శర్మగారు, కొచ్చెర్లకోట రామరాజు గారు, నోరివెంకట రత్నముగారు, పాపట్ల కాంతయ్యగారు, వారి సోదరులు పాపట్ల రామయ్యగారు, మొదలగు మహానుభావులు బందరు, విజయవాడ, కాకినాడ, సాలూరు, వంటి స్థలములలో శిష్యులకు విద్యాదానము చేసియుండుట వలన యీనాడు దేశము నలుమూలల యందును వారిశిష్యులు సుఖజీవనము చేయుచు, సంగీత ప్రచారమునకు పాటుపడుచు జాతికీర్తిని ఇనుమడింప జేయుచున్నారు.

## సంస్థానములు - సంగీతపోషణ

విజయనగర సంస్థానాధీశులు సంగీత కళాశాలను ప్రత్యేకముగా నిలిపి, విద్యార్థులకు అన్న సత్రము వంటి వసతులను ఏర్పరచి కళాశాలయందు దిగ్దంతులవంటి విద్వాంసులను నియుక్తులను జేసి, సంగీత ప్రచారము జేయుటకును, ఆసక్తిగలవారు నేర్చుకొనుటకును, అవకాశము కల్పించి, శాశ్వత యశస్కులైనారు ఇచ్చట పలూరునందు శ్రీ దాసు శ్రీరాములు గారిచే నిర్వహింప బడుచుండెడి గాన పాఠశాలను గురించియు కొంచెము చెప్పకొందము. వీరు మహావైణికులైన తుమరాడ సంగమేశ్వరశాస్త్రి గారికి సమకాలికులు, వారితో మైత్రి, గోష్ఠి భాగ్యములను పొందిన వారును, నాట్యాభినయ నాటకాదులయం దభినివేశము గలవారును, అగుట వలన కృతులు, జావళులు, స్వర జతులు మొదలగు రచనలుచేసి, కూచిపూడి వారు

మున్నగు కళాకారులకు శిక్షణ నిచ్చి పద, స్వరజత్యాదులను అభిన యింప జేయుచుండెడి వారట.

బొబ్బిలి, పిఠాపురం, మాడుగుల, కశింకోట, తుని, ఉర్లాం, పర్లాకిమిడి, నూజివీడు, ముక్త్యాల, వెంకటగిరి, కార్వేటి నగరము, యాదగిరి, ఉయ్యూరు, దొండి, మైలవరము, దొడ్డంపేట, చల్లపల్లి, కపిలేశ్వరము, గద్వాల మొదలగు జమీందారులు వారి వారి స్థితిగతు లకు తగిన విధముగా విద్వాంసులను ప్రోత్సహించుచు వచ్చిరి. అందు వలన ఇట్టి స్థలములయందు మెప్పు పొందుటకును, ధనవస్తువాహనా దులను సంపాదించుటకును స్పర్ధతో విద్యాకృషిని విద్వాంసులు చేయు చుండెడి వారు.

## చెన్నపట్నము

సుమారు 100, 150 సంవత్సరములనుండి చెన్నపట్నము ఆంధ్ర, తమిళ, కన్నడ, మళయాళ దేశస్థులగు సంగీత విద్వాంసులకు కూడలి స్థానముగానుండి, కళాకారులను గౌరవించి, పోషించెడి యభి మానులతో నిండియుండుటవలన, అచట స్థిరనివాసము లేర్పరచుకొని ఎందరో కళాకారులుండుట తటస్థించినది. వీరిలో శ్రీమతి బెంగు ళూరు నాగరత్నమ్మ, శ్రీమతి వీణ ధనమ్మ వంటి వారు నేటికిని సంగీతాభిమానుల మనోవీధులలో మెదలుచునే యున్నారు. ఇంకను మైసూరు, బెంగుళూరు ప్రాంతములో స్థిరపడిన శ్రీ చింతలపల్లి వెంకట రావు మొదలగు వారును ఎంతయో ప్రసిద్ధులు.

'భూలోక చాపచుట్టి, బొబ్బిలి కేశవయ్య, షట్కాల వీణావా దన దురంధరులు వీణ రమణయ్య, ఇంకను ఎందరెందరో విద్వాంసులు మదరాసునందు "ఇచట నుండెడి వారు, ఈ సభలయందు కచ్చేరీలు చేసిరి" అని యెందరో తెనుగు నాటి విద్వాంసులను గురించి వయో

వృద్ధులు చెప్పుకొనుటయు, కొన్ని గ్రంథములయందు పేర్కొను చుండుటయు గమనించిన, తెనుగు వారమైన మనకు ఒడలు పులకరింపక మానదు.

**యక్షగానము**

యక్షగానమను నృత్యగాన రూపము ప్రాచీన కాలము నుండియు దృశ్య శ్రవణ భేదములతో వాడుకలోనున్నది. ఇది పద్య గద్యాత్మకమై పాత్రలు వేషధారణము చేసుకొని నటించు ఒక నాటక రూపమే. ఇందు సంగీతము, సాహిత్యము, నృత్యము, అభినయము అనునవి సందర్భాను సారముగా కలసిమెలసి యుండును. ఇందుగల సంగీతము సందర్భాను సారములగు రాగతాళములతో కూడినదియైనను, కర్నాటక సంప్రదాయములకు అనుగుణముగనే యుండి సంప్రదాయములను నిలబెట్టుచు అవి నిలిచియున్నవి. ఇట్టి యక్షగానములయందు మణిపూసవంటిది, నారాయణ తీర్థుల వారి శ్రీకృష్ణ లీలాతరఙ్గిణి. తీర్థుల వారు తెనుగువారై యుండి కృష్ణా తీరమునుండి దక్షిణాపథమునకు తరలివెడలిన కూచిపూడి భాగవతుల సంప్రదాయము వారని విజ్ఞుల అభిప్రాయము. సంస్కృతమున శ్రీకృష్ణ లీలాతరఙ్గిణియను యక్షగానమును, వీరు రచించిన సుమారు నూరు నూటయేబదికి పైగా గేయరూపములు అనన్య సామాన్యములైన రాగ తాళయుక్తములై ఇప్పటికిని, ధాతు స్వరూపములతో కొంతలో కొంత నిలిచియున్నవి. శ్రీకృష్ణ ప్రాదుర్భావము మొదలు రుక్మిణీ కల్యాణమువరకును గల భాగవత కథ యిందు చిత్రితమైనది. రుక్మిణీ కృష్ణుల కల్యాణ ఘట్టమున తీర్థులవారు తెనుగునాటి సంప్రదాయముల నెన్నిటినో చెప్పియున్నారు. వరహూరు సమీపమునగల తిరుపూందురుత్తి గ్రామమున, వీరి జీవసమాధి వద్ద ఇప్పటికిని ప్రతి

యేట ఉత్సవములు జరుగుచుండును. ఈ వసహూహనక ప్రాచీన నామము భూపతి రాజపురము.

ఈనాడు కూచిపూడి వారి అభినయ ప్రదర్శనములయందు భామకలాపము, గొల్లకలాపము, పారిజాతములను భాగవత కథా రూపములగు యక్షగానములను సిద్ధేంద్రయోగి రచించిరని వాడుక. కృష్ణాతీరమున కూచిపూడి గ్రామమునందలి బ్రాహ్మణ కుటుంబముల వారికి ఈ యక్షగానములను వారే బోధించి, అభినయింపవలసిన పద్ధతులను చెప్పిరట. ఈ యక్షగానములు భరతుని నాట్య సంప్రదాయములు చెడకుండ అభినయించెడివారు, దేశమునందంతటను ఉండెడివారు. ఈ యక్షగానములకు మంగు జగన్నాథ పండితుడు, వెంకట శాస్త్రి, వీరేశ లింగము, భాగవతుల రామయ్య, తరికొండ వెంకమాంబ, ఆత్రేయ పురపు వెంకటదాసు, తమ్మన్న మున్నగు వారు మార్పులు, చేర్పులుచేసి క్రొత్త మెరుగులు దిద్దిరని విజ్ఞుల యభిప్రాయము.

నారాయణ తీర్థులవారును పారిజాతకథను రచించిరనియు అదిపూర్తిగా లభ్యముకాలేదనియు ఒక వాడుక. సిద్ధేంద్రయోగి రచించిన భామకలాపాదుల ననుసరించుచు ఎందరెందరో కవులు రచించిన యక్షగానములు కలవట, పారిజాతమను పేరు సవతుల కయ్యమునకు నామాంతరముగా గ్రహించి గంగాపార్వతుల కయ్యములను చెప్పెడి కథలకు శివపారిజాతములని, కొందరు యక్షగాన కర్తలు పేర్లు పెట్టుకొనిరట. ఏమైనను సిద్ధేంద్రులు, తీర్థులవారు యక్షగానమును వైభవోపేతముగ నాల్గు స్తంభములపై సంగీత, సాహిత్య, నాట్యాభినయములను నిర్మించి సరస్వతీ దేవాలయముగ తీర్చి దిద్దిరనుటలో ఆశ్చర్యములేదు.

భరత విద్యయందు ప్రవీణులైనవారు వేదాంతం లక్ష్మీనారాయణ శాస్త్రి, కొల్లూరి వెంకయ్య, చెనుకూరి నాగరాజపండితుడు, పుల్లాతంతుల చలమన్న, చింతా వెంకట నారాయణ, వెంపటి వెంకటనారాయణ, పురిగెళ్ళ వెంకటసుబ్బారాయుడు, చీమలపాటి సాంబయ్య, భళ్ళమూడి అప్పన్నభుక్త, చామర్తిసత్యం, తంపెళ్ళ సత్యనారాయణ, వరదా ఆదినారాయణ బొంతలకోటి జగన్నాథం, అధికార్ల అప్పలస్వామి, మొదలగువారెందరో వుండెడివారు. సాతాని కాంతం, కాలుగుంటి వెంకటస్వామి, అనువారు మహాపండితులైన భామవేషగాండ్రట. ఇంకను దుగ్గిరాలవారు, కోనేవారు, పెండ్యాలవారు, వువ్వులవారు, ఇట్టి ఇంటిపేర్లుగల కళావంతులు భామకలాపమును ప్రదర్శించుటయందు ప్రతిభావంతులై యుండిరట. పెండ్యాల సత్యభామ సార్థక నామధేయురాలట. పువ్వుల మహాలక్ష్మి మారంపల్లి పెదరత్నమ్మ, చినరత్నమ్మ, మొదలగు స్త్రీరత్నములు అనన్యసామాన్యములగు పాండిత్య ప్రకర్షతో భామకలాపమును ప్రదర్శించెడి వారని ఇప్పటికిని వయోవృద్ధులు చెప్పుకొందురు. ఈ యక్షగానములను పాడెడువారును, ఆడెడువారును, పోషకులులేక యీనాడు కరువగుచున్నారు. కొలదికాలము క్రిందటివరకు నిడమర్తిరామయ్య, నిడమర్తి రాజశేఖరుడు మున్నగువారు మృత్యుంజయ విలాసమును, తీర్థులవారి తరంగములను, అధ్యాత్మ రామాయణ కీర్తనలను దేవుని ఉత్సవములలో గానముచేయుటయందు ప్రసిద్ధులనియు, వీరిలో రాజశేఖరుడుగారిని లయ బ్రహ్మయని చెప్పుకొనెడి వారట.

తెనుగునందు ఐదారు వందల ఏండ్లకు ముందటివైన కొన్ని యక్షగాన రూపములు ముద్రితాముద్రితములైనవి దొరకుచుండుట వలన నివి సుమారు మరి యొకటి రెండు శతాబ్దములకు ముందటి నుండి ప్రచారములో నుండి రూపురేఖలు దిద్దుకొని యుండి యుండ వచ్చునని తోచుచున్నది. యక్షగానమనునది యొకప్పుడు జనాదరణ

పొందినదియు, ముఖ్య ప్రచార సాధనమయినదియు, సంగీత సాహిత్యాది విద్యలయం దభిరుచిగలిగి వానిని సాధించిన కళాకారులకు ప్రదర్శనానుకూలమగు వేదికయునై యొప్పుచుండెడిది. ఈ యక్షగానములయందు రాగ తాళములతో కూడిన దరువులు, ద్విపదలు, పద్యములు పాడుచుండెడివారు వేషధారణము వలన, నృత్యాభినయమునకును తావుండుటవలన ఈ ప్రక్రియ జనాదరణమును పొంది యుండవచ్చును. తంజావూరు ప్రభువుల కాలమున యక్షగానములు స్వర్ణయుగము ననుభవించినవని చెప్పుకొనవచ్చును. ప్రభువులు స్వయముగా యక్షగానములు వ్రాసి తమ పర్యవేక్షణయందే ప్రదర్శింపజేసెడివారు. కనుకనే విద్యావంతులగు వారెందరో యక్షగానములను రచించుట, ప్రదర్శించుట జరిగియుండును. స్థాలీపులాక న్యాయముగా కొన్ని యక్షగానములను ప్రస్తావించుకొందము. దొరకినంతలో ప్రాచీనము లనుకొనదగినవి ప్రోలుగంటి చెన్నశౌరి విరచిత సౌభరి చరితము, చక్రపురి రాఘవాచార్యుని విప్రనారాయణ చరిత్ర, కందుకూరి రుద్రకవి సుగ్రీవ విజయము, బాలపాపాంబ రచించిన అక్కమహాదేవి చరిత్ర, పరమానందతీర్థయతి వ్రాసిన ముక్తి కాంతా పరిణయము, సిద్ధేంద్రయోగి భామ కలాపము, ఇంకను అనేకులచే రచింపబడినగొల్ల కలాపము, పారిజాతాపహరణము మొదలగునవి ఎన్నియో గలవు. ఇందు సాహిత్య భాగమధికమై నృత్య సంగీతములకు ప్రాధాన్యత కొంత కొరవడి యుండునవి కొన్నియు, దరువులు, రేకులు, పలలు, జోలలువంటి గీతములతో నిండి నృత్య గీతములకు ప్రాధాన్యత గలిగినవి కొన్నియు నుండెడివని తోచుచున్నది. రెండును సమపాళ్ళలో గలవి బహుశః 18, 19వ శతాబ్దములలో ఎక్కువగా తంజావూరు ప్రభువుల ప్రాపకమున నుద్భవించి యుండును. ఇందు ఎన్నిటికో స్వరసాహిత్యములు పాడుకొనుట కనువుగా తంజపురి

సరస్వతీమహాలు ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారమున వెదకినచో దొరకవచ్చునేమో!

ఇట్లే ఆంధ్ర, తెలంగాణపు జిల్లాలయందు ఎన్నియో యక్షగానములు అతి ప్రాచీనములు కాకపోయినను ఒక శతాబ్దపు వెనుకటివైనను, వృద్ధులైనవారి జ్ఞాపకములలో మెదలుచు, పాడెడి విధానమును పోగొట్టుకొనకుండ దొరకుట కవకాశములున్నవి. సింహాచల క్షేత్ర పరిసరముల వారగు గోకులపాటి కూర్మనాధకవి-మృత్యుంజయ విలాసము రచించిరి. వీరు తెనుగువారి వైవాహిక ఆచారములను పార్వతీ పరమేశ్వరుల కల్యాణ ఘట్టమున చక్కగా వర్ణించియున్నారు. ఈ యక్షగానము ననుకరించియు, మక్కికి మక్కిగా ననుసరించియు అనేక యక్షగానములు రచింపబడినవని పరిశోధకులు చెప్పుచున్నారు.

ఇట్లే తెలంగాణపు జిల్లాల యందుండెడివారని చెప్పుకొనబడుచున్న ధర్మపురి రామాయణకర్త ధర్మపురి శేషాచలకవి, యామునుజాల శేషాచలకవి రామాయణము, ముద్దయకవి మంథెన రామాయణము, మొదలగునవి దొరకవచ్చునేమో! సమర్థులైనవారు ఇట్టి యక్షగానములను పాడెడి విధానమును తెలుసుకొని స్వరపరచి, భద్రపరచినచో నాయా ప్రాంతములయందలి సంగీత ఫణతులను కొంతవరకు పరిశోధించి నిలుపుకొనుటకును, ఇప్పటికే క్షీణించిపోవుచున్న ఈ శాఖను కొంతవరకు పునరుద్ధరించుకొనుట కవకాశముండును.

సిద్ధేంద్రుల వారి భామాకలాపము, గొల్లకలాపము, ఇంకను ఇతర మహానుభావుల యక్షగానములను మేలట్టూర్ మొదలగు దక్షిణ

ప్రాంతములలోను, నెల్లూరు మండలమునందును సర్కారు జిల్లా యందును, ప్రాచీన సంప్రదాయములతో పాడెడి వారు వయోవృద్ధులు గలరని వినుచున్నాము. ఈ యక్షగానములయందు ఆధునికత పూర్తిగా అలుముకొనక మునుపే ప్రాచీన రీతులను కాపాడు ప్రయత్నము జరిగినచో కొంతవరకైనను ఈ ప్రక్రియ యందలి విశిష్టత నిలువగలదు.

యక్షగానములతోపాటు కథాగాన రూపములు మరికొన్ని కూడ వెలసినట్లు తోచుచున్నది. మునిపల్లె సుబ్రహ్మణ్యకవి రచించిన అధ్యాత్మ రామాయణ కీర్తనలు, ఒంగోలు గంగాధరకవి రచించిన కృష్ణ, యశోద, గోపికల సంవాద రూపమునగల కందార్థ దరువులు, రేగాగ్రహార వాస్తవ్యులు కందాళ వేంకటచయనకవిచే రచింపబడిన శ్రీరామతరఙ్గః అను రామలీలా తరంగిణియు, రామచంద్రకవి రచించిన దధిమథన విలాసనాటకము (అముద్రితము) అనునవి గేయములు, పద్యములు, సంధివచనములు, కందార్థదరువులు గలవి. కొన్ని మాత్రము గేయములుగలవి, కొన్నియైనను తెనుగువారిండ్లలో వయోవృద్ధులచే గానము చేయబడుచుండిన సంగీత సాహిత్య రూపములు కనబడుచున్నవి. వీనిని ధాతుమాతువులతో లిపి బద్ధముచేయు ప్రయత్నము జరిగినచో జాతి సంస్కృతిని మన తరువాతి తరముల వారికి అందించిన వారమగుదుము.

**హరికథ**

హరికథా కాలక్షేపమను పద్ధతియు ముఖ్యముగా ఆంధ్రదేశమునందు ప్రాధాన్యత వహించినది. ఇందు పద్య, గద్య, కీర్తనాదులు కథాసందర్భము ననుసరించి గాయకులు వినిపించుచుందురు. వీరిని హరిదాసులనుట పరిపాటి. ఇట్టివారిలో తాళ్లూరి నారాయణకవి,

సింగిరిదాసు, నరసింహదాసు, సంగడి నాగదాసు, తిరుక్కడై యూర్ కృష్ణదాసు, ఎల్లనూరు నరసింహకవి, నల్లమిల్లి బసిమిరెడ్డి, మున్నగువారు హరికథలు వ్రాసి, చెప్పి దేశమునందంతటను యీ ప్రక్రియను ప్రచారముచేసిరి ఇట్టి హరిదాసులలో యుగపురుషు డనదగిన వారు ఆటపాటలమేటి అజ్జాడ ఆదిభట్ల నారాయణదాసు గారు. వీరు అసంఖ్యాకములగు హరికథలను వ్రాసి ఎందరో శిష్యులకు గురుకల్ప తరువై, పాఠములు చెప్పి, ప్రదర్శనములిచ్చి, కథా కాల క్షేపము ప్రదర్శనా పద్ధతికి సభా గౌరవమును చేకూర్చినవారు. ఈ శతాబ్దమున ఆంధ్ర దేశమున దాసుగారనిన నారాయణదాసే! వీరి తరువాత బాగేపల్లి అనంతరామాచార్యులు, బాలాజీదాసు, తిరు నగరి శేషుదాసు, అయ్యగారి వీరభద్రయ్య, కోసూరి భోగలింగ దాసు, కొమ్మూరిబాల బ్రహ్మానందదాసు, పరిమి సుబ్రహ్మణ్య దాసు, పెంటపాటి సర్వేశ్వరరావు భాగవతార్, ములుకుట్ల పున్నయ్యశాస్త్రి, పెద్దింటి దీక్షితులు, తిరుమల నల్లాన్ చక్రవర్తుల సంపత్కుమార తిరువెంగళాచారి, నేతి లక్ష్మీనారాయణ భాగ వతార్, వాజపెయ్యాజుల సుబ్బయ్యశాస్త్రి, మండ వెంకటదాసు, చొప్పల్లి సూర్యనారాయణ భాగవతార్, (వీరు ఆదిభట్లవారి ప్రియ శిష్యులు) మొదలగువారు. వీరిలో కొందరు మనోజ్ఞములగు కథలను రచించినవారును, విద్వత్ శిరోమణులును, తమ వాక్చాతుర్యముతో శ్రోతల నానందింపజేసి, భక్తి వైరాగ్యముల నుద్బోధించుచుండిరి. కథా కాలక్షేపములయందు మనము విను కీర్తనలు, పల్లవి, అను పల్లవి లేక చరణము, మిశ్రము అను ధాతు రచనలు కలిగి, ఆనాడు అన్నమయ్య చెప్పిన గేయ ఫణతులనే నేటికిని అనుసరించుచున్నా మను అనుభూతిని కలిగించుచున్నవి.

యక్షగానమును, హరికథయు ఒకదానినొకటి పోలి యుండుట వలన యీ రెండింటిని ఒకటిగా చెప్పుటయు జరిగినది. ఇట్లు చెప్పిన

వారు మహానుభావులగు కళాద్రష్టలు, వారి వాదమును కాదన జాలము గాని, దృశ్య, శ్రవ్య సంబంధములను చిన్న చిన్న పరివర్త నములతో హరికథలను యక్షగానముగను, యక్షగానమును హరికథ గను చెప్పియుందురు. సంగీతమునందు పదము, జావళి, కృతి, కీర్తన మొదలగు ద్వంద్వ రూపములున్నవి కదా! వీని మధ్యగల హద్దు లతిసున్నితములు, గనుక వాదించుకొనెడివారి బలము ననుస రించి అటునిటు జరుగుచుండును. యక్షగానమున సూత్రధారుడు పాత్రలను పలుకరించి వారి కథను వారిచేతనే చెప్పించును. హరికథ యందు హరిదాసే సూత్రధారియై కథనంతను చెప్పుచుండును. కథ ననుసరించి తగుమాత్రపు టభినయము, నృత్యము, హరిదాసులు చేయుట పరిపాటి. వేషధారణ తప్ప తక్కిన విషయములలో రెండిటి కిని పోలిక లెక్కువగ నుండుటచే వీనిని ఒకే కళారూపముగ కొందరు భావించిరేమో!

హరికథ, యక్షగానములను పోలి యుండునదియు, శ్రవ్య దృశ్యాత్మకమైనదియును అయిన మరియొక ప్రక్రియ బొమ్మలాట. ఇదియు అతి ప్రాచీనమైన కళా ప్రదర్శనములలో నొక రూపము. ఇందు తోలుతో బొమ్మలనుచేసి వానికి రంగులువేసి, తెరపై కట్టి ఆడించుచూ ఆయా పాత్రలు చెప్పుచున్నట్లు బొమ్మలాడించువారు నేపథ్యము నుండి మాట్లాడుట పాడుట చేయుదురు. సూత్రధారు డొకడు తెర వెనుక నుండి బొమ్మలకు కట్టిన సూత్రములను కద లించుచు బొమ్మల నాడించును. ఈ విద్య యెంత ప్రాచీనమైనదో తెలియదుగాని, దీని నాధారముగా జేసికొని భగవంతునకు నటన సూత్రధారియను నామకరణమును భక్తులు చేసుకొన్నట్లు తోచు చున్నది. జావా, సుమత్రా మొదలగు దేశములందు భారత, భాగవత రామాయణ గాథలను బొమ్మలాటలుగా ప్రదర్శించెడు వాడుక

ఘాకను కలదట. తెనుగు దేశమునందు చరిత్ర ప్రసిద్ధమైన బొమ్మ లాట సిద్దయ్య, అతని కుమారుడు సాంబయ్య మొదలగువారు వంశ పారంపర్యముగా బొమ్మలాటల నాడించుచు, ఆటకనువగు కథలను వారే సృష్టించుకొనుచు, లేదా ఇతరులు వ్రాసినవి వర్ణించుకొను చుండెడివారట. ఈ ఆటయందలి సూత్రధారుడు మంచి ఉచ్చారణ గలిగి, సంస్కృతాంధ్రములనేకాక, ఇతర భాషలను కూడ చదివిన వాడై, చతుర వక్రోక్తిపరుడై, నిష్ఠ నియమములు గలిగిన తగు సూత్రపు మంత్రశాస్త్రవేత్తయై యుండవలెననియు, పెద్దలు చెప్పు దురు. ఇప్పుడు తోలుబొమ్మలాటయను పేరు సహితము తెలియని వారి సంఖ్యయే అధికము. తెనుగు దేశమున మూల మూలలయందలి పల్లెలను గాలించినచో ఈ కథా రూపము కొంతవరకైన దొరుకగల దేమో ప్రయత్నించవలసియున్నది. నేటి కాలమాన పరిస్థితుల ననుస రించి ఇట్టి ప్రక్రియల ప్రయోజనము తక్కువగనే తోచవచ్చు. కాని పూర్వ సంప్రదాయములను కాపాడుకొని ఒకప్పుడిట్టి సంప్రదా యములుండెడివనుట కాధారము లుండవలెనుగదా!

**సంగీత వాద్యములు: వీణ**

వాద్యములు నాదమును క్రమ బద్ధముగా, శ్రవణ యోగ్య ముగా నుద్భవింపజేయుటకు రూపొందింపబడుచుండునవి. ఇట్టి వాద్యములలో ముఖ్యములైనవి మూడు విధములు. తంత్రీ వాద్య ములు, గాలిపోసి ఊదబడు సుషిరవాద్యములు, చర్మముతో కప్పబడి లయకనుగుణములగు ధ్వనుల నుత్పత్తి చేయునవియునగు తాళ వాద్యములు. ఈ మూడు విభాగములయందును తిరిగి స్వరూప స్వభావ ధ్వని విశేషములలో మార్పులు చూపగల అనేక వాద్యము లుత్పత్తియగుచున్నవి. ఇందు నేడు మన ముపయోగించుకొనుచున్న కొన్ని వాద్యములను గురించి చెప్పుకొందము.

సంగీతమునకు, నాట్యమునకు ఎట్టివిధముగను సంబంధములేని కావ్యము, అందును వీరశైవ మతమును ప్రబోధించు మతగ్రంథమును వ్రాయుచు పాల్కురికి సోమనాథుడు యథాలాపముగ చెప్పిన కాలదిపాటి సంగీత విషయములను పరిశీలించినచో ఆ నాడు సంగీతమున కెట్టి ప్రాధాన్యతగలదో, నిత్యజీవితమునకు ఎంత సన్నిహితత్వము గలదోనను విషయమేగాక- సంగీతాభ్యాసమునకు నాగరకులు, జానపదులు అను భేదముకూడ అంతగా యున్నట్లు కనిపించదు. భక్తితో గానముచేయుట, అట్టి గానమును నేర్చుట అనునవి ఆ నాడు ఉత్తమ జీవన విధానమునకు ఒక ఆవశ్యకమగు విషయమై యుండియుండునని తోచుచున్నది. పాల్కురికి సోమనాథుడు పండ్రెండవ శతాబ్దము వాడని చరిత్రకారు లూహించుచున్నారు. ఏమైనను తమకు అతి పరిచయములైనవి, అప్పటికే దేశమునందు ప్రచారములోనుండి సంప్రదాయములని ఆమోదింపబడిన విషయములనే కదా కవులు స్వీకరించి తమ తమ గ్రంథములయం దుదహరించుకొందురు! కనుక, పాల్కురికి చెప్పిన విషయములు ఆతని కాలమునకు ముందు ఒకటి లేక రెండు వందలయేండ్ల నుండియు వాడుకయందుండి యుండవలెననుటకు సందేహములేదు. పాల్కురికి తన కావ్యము నందుదహరించిన వీణలయందు కొన్ని మాత్రమే ఇప్పుడు మనకు వాడుకయందు కనబడుచున్నవి. సోమన చెప్పిన వీణల పేర్లను పరిశీలించినచో కొంతవరకు కొన్నిటి స్వరూపముల నూహించుకొనవచ్చునని తోచుచున్నది.

1. బ్రహ్మవీణ : ఈ వీణను గురించి నారదుని సంగీత మకరందమునందును, అహోబలుని సంగీత పారిజాతమునందును, పదునాల్గవ శతాబ్దపు ప్రాంతపు వాడయిన హరిపాలదేవుని సంగీత సుధాకరమందును, విద్యారణ్యుల వారిదని యనుకొనబడుచున్న సంగీత సార సంగ్రహమునందును ఉదహరించియున్నారు. కాని ఈ పలు

గురు గ్రంథకర్తలును యీ వీణా స్వరూపమును వేరు వేరు విధము ములుగా చెప్పియుండుటవలన విషయము కొంత గజిబిజి యయినను, హరిపాలదేవులు మాత్రము ఈ వీణయందు ఇరువది నాలుగు గృహా ములున్నవని చెప్పుటచే, సారికలను వీణయందమర్చుట యనునది పదునాల్గవ శతాబ్దమునందే ప్రారంభమై యుండుననియు, అంతకు కొంచెము పూర్వమే ఈ విషయమునందు పరిశోధనలు జరుగుచున్న వేమోనని అనుకొనవలసి యున్నది. 2. సారంగవీణ : ఇది బహుశః నేటి సారంగీ అయియుండవచ్చును. 3. కూర్మవీణ:కచ్ఛపి అనిపిలువ బడుచున్న వీణ ఇదియేనేమో ! కొంతవరకు వాయులీనమును పోలి యుండును. గుర్రపు వెంట్రుకలతో కట్టబడిన సాధనముతో దీనిని వాయించెడి వారట. ఫిలిప్పైన్స్ దీవులలో కుడ్యాపి అను పేరుతో నున్నదట. 4. ఆకాశవీణ : స్వరమండలివంటినాద విశేషముగలది. 5. పినాకవీణ: ఇది యిప్పటి దిలురుబావంటిదేయగు ప్రాచీన వాద్యము కావచ్చును. గుర్రపు వెంట్రుకలు కట్టిన విల్లువంటి సాధనముతో వాయించెడివారట. రాలా అనే రష్యాన్ వింటియందలి గుర్రపు వెంట్రుకలను వాయుదురట. 6. బాణవీణ : బాణశబ్దమువలన నిది ప్రాచీన వాద్యమగు యాళ్ వంటిదేమోనని అనుకొనవచ్చును. లేదా బాణము వంటి అర్ధ చంద్రాకారము వంపుగల రూపముండి, తంత్రుల నిడివిని క్రమముగా తగ్గించుకొనుటకు అవకాశముండి, ఇప్పటి స్వరమండలి వంటి నాదవిశేషమును ఉత్పత్తిచేయు వాద్యమయి యుండవచ్చును. 7. స్వయంభువీణ: స్థిరవీణయని రత్నాకరకారులు చెప్పిన వీణ ఇదియే అయివుండవచ్చును. 8. భుజంగవీణ: పడగవిప్పిన పాముతలవలె చెక్కబడి యుండునాగవీణ ఇదియే కావచ్చును. క్రీ॥ శ॥ 1117లో విష్ణువర్ధనుడు బేలూరులో నిర్మించిన చెన్నకేశవుని ఆలయమునగల శిల్పముల యందిట్టిది చెక్కబడియున్నది. 9. కిన్నెరవీణ: లోహము లేక దంతముతో చెక్కబడిన సారికలుండి, గాలిపటమువంటి ఆకారముగల చివరిభాగము

గలిగి, మధ్యతుంబ పెద్దదిగా మూడుతుంబలుండి యుండును అని చెప్పి యున్నారు. హరిపాలుడు, ఈ వీణకు నాలుగు ముఖ్యతంత్రులు, మూడు ప్రక్కతంత్రులు ఉండి జరుపుకొనుటకు అనువైన సారికెలు పదునాలుగునుండి పదునెనిమిదివరకు ఉండునని చెప్పియున్నారు. ఇదియే యిప్పుడు మనము చూచుచున్న సితార్ కావచ్చును. కిన్నరి యందు బృహత్, మధ్య, లఘురూపములు కలిగినవి యుండుననియు హరిపాలదేవుడు చెప్పియున్నారు. రత్నాకర కారులును కిన్నరిని గూర్చి చెప్పియున్నారు. 10. త్రిసరి వీణ: బహుశః మూడుతంత్రులు గలవీణ కావచ్చును. శార్ఙ్గదేవులు చెప్పిన వీణయును నిదియే కావచ్చును. 11. సరధిగణ నాథవీణ: ఇది సరోద్ కావచ్చునేమో. 12. సకినెవీణ: ఏకతార అను వాద్యము కావచ్చును. శార్ఙ్గదేవులు చెప్పిన ఏకతంత్రి వీణయు కావచ్చును. 13. విచిత్రకవీణ: ఇది ఈ నాడు మనము చూచుచున్న విచిత్రవీణయేనేమో! 14. నటవీణ: ఇది మహా నాటకవీణయను పేరుగల గోటువాద్యమయినను కావచ్చును. 15. స్వరమండలము: ఇది ఇప్పుడు మనము చూచుచున్న స్వరమండలి, సంతూర్, హార్ప్ అనువాద్యముల వంటిదేయై యుండునేమో! 16. విపంచి: దీనిని భరతుడు నాట్యశాస్త్రమున తొమ్మిది తంత్రులు కలదిగా చెప్పి, ఒక కఱ్ఱముక్కను తీగెలపై జార్చుచు స్వరములను పలికింతురనియు చెప్పియున్నారు. 17. కోలాప్టివీణ: ఇది స్వరములన్నిటికిని వేరు వేరు తంత్రులు కలిగి కోలాటపు కఱ్ఱలవంటి వానితో వాయించబడు వాద్యమయినను కావచ్చును. 18. ఘోషవతి: శ్రీహర్షుని స్వప్నవాసవదత్తయను సంస్కృత నాటకమునందు అడవి ఏనుగులను వశపరచుకొనుటకు ఉదయనుడు ఈ వీణ వాయించినట్లు చెప్పబడినది. 19. ఔదుంబరివీణ: మేడిపండువంటి ఆకారముకలదియో, లేక మేడిమ్రానితో చేసినదియో కావచ్చును 20. తంత్రి సాగరవీణ: ఇది నూట ఎనిమిది తంత్రులుగల మహతియను నారదుని

వీణ వంటిదేమో ! ఇదియే కాత్యాయన మునిచెప్పిన నూరుతీగెలుగల కాత్యాయని వీణ కావచ్చును. 21. దిపిరివీణ: ఇట్టి పేరుగల ఒకవీణను గురించి తాళ్ళపాక వారి రచన యందు కలదు. 22. కైలాసవీణ, 23. రావణ వీణ, 24. గౌరివీణ, 25. గాంధర్వవీణ, 26. కాశ్యప వీణ. 27. భోజవీణ, 28. సరస్వతీవీణ, 29. మొల్లవీణ, 30. మనో రథవీణ, 31. కౌమారవీణ, 32. యణివీణ, 33 రావణ హస్తంబు వీణ, 34. వళివీణ, 35. సాగరిక, 36. గుంభిక, 37. సరవీణ, 38. నరవాదివీణ, 39. మల్లరివీణ, 40. అంబుజవీణ.

ఇవిగాక శార్ఙ్గదేవులు తన రత్నాకరమునందు 1. నకులము వేదమంత్ర పఠనమునకు ప్రక్క వాద్యముగా నుపయోగించెడి వారట. 2. నిశ్శంకవీణ. 3. ఆలాపిని: ఆలాపనకు ఉపయోగించెడి వీణ. 4. పినాకిని. 5. మత్తకోకిల-ఇరువదియొక్క తంత్రులు గలది, మంద్ర మధ్యమ తారస్థాయిలలో శృతి చేయుదురట. 6. కంద వీణ. 7. వల్లకి-యాళ్ వంటి ప్రాచీన వాద్యము వంటిదేమో! 8. కళా వతి ఇదియే కళావతియను తుంబురుని వీణయని చెప్పుదురు. ఇప్పుడు వాడుకలోగల శృతి వాద్యము తంబుర. దేశమునందంతటను వాడు కలోగలదు. ఇవన్నియు శార్ఙ్గదేవులు తమ సంగీత రత్నాకరమునందు చెప్పియున్నారు. ఇవి బహుశః పాల్కురికి వారి కాలమునకు వాడుక యందుండెడివో లేక వేరు నామములతో పిలువబడుచుండెడివో లేక అప్పటికే అంతరించిపోయిన ప్రాచీన వీణా స్వరూపములో తెలుసు కొనవలసి యున్నది. సంగీతసారసంగ్రహము నందు చెప్పబడిన బ్రహ్మవీణ, విష్ణువీణ అనునవి మేళములను గుణించుకొనుటకు మాత్ర ముపయోగపడునని తోచుచున్నది. రుద్రవీణయని ఈ గ్రంథ కర్తచెప్పిన మూడవవీణాస్వరూపము ఇప్పుడున్న వీణవలెనే యున్నది. ఈ గ్రంథకర్త విద్యారణ్యులవారేయైనచో కొంత పరిశోధన జరిపినగాని,

తరువాతి వారగు పెద్దనామాత్యులు మనుచరిత్రయందు పేర్కొనిన నాట, దేశాక్షి రాగములకు వేరు వేరుగా శృతులు చేసుకొనవలసి వచ్చెడి వీణకు, రామామాత్య, సోమనాథుల వీణలకుగల, సమయ సందర్భాది విషయములు విపులముగా విమర్శనాత్మకముగా నిర్ణయించుటకు వలనుకాదు. వేదకాలము నుండియు వీణా ప్రశంస కనబడుచునేయున్నది. అప్పటి వీణా స్వరూపమెట్లుండెడిదో, ఊహించుట తప్ప స్పష్టముగా అతి ప్రాచీనమైన వీణ రూపమును చెప్పుట కష్టమే! యోగశాస్త్రమున వీణను మానవ శరీరముతో పోల్చి చెప్పుటయు కలదు. యాజ్ఞవల్క్యఋషి 'వీణా వాదన తత్వజ్ఞః శృతి జాతి విశారదః తాళజ్ఞ శ్చాప్రయాసేన మోక్ష మార్గం సగచ్ఛతిః;' అని చెప్పినది గమనించినచో శృతి, జాతులనగా ఒకప్పుడు జాతులని పిలువబడుచుండెడి రాగములను స్వరముల యంతరములయందు వినబడు శృతులను సహితము తెలుసుకొని, లయబద్ధమగు సంగీతమును వీణయందు పలికించెడు వీలుండెడిదని తోచుచున్నది. ఈ శృతులు, జాతులు అనునవి నేడు మనము చూచుచున్న వీణయందుగల సారికలవంటి వానిపై పలికించుచుండిరా, లేక వేరొక మార్గమున నెట్టి ధ్వని విశేషములను పలికించుచుండిరా యనునది పరిశోధించవలసిన విషయము.

ఎనిమిదవ శతాబ్దపునాటివని పరిశోధకులు చెప్పుచున్న ఎల్లోరా గుహలయందుగల చిత్రములలో, రెండు తుంబల పైదండి నుంచి రూపొందించిన వీణా స్వరూపమును, సారికలు లేని మేండొలిన్ వంటి దగు వీణా స్వరూపమును, పదియవ శతాబ్దమునాటివని చెప్పబడుచున్న తిరుగుడల (మైసూర్)యందును, అజంతా గుహాలలో (ఉదయగిరి)గల చిత్రములలోను కనబడుచున్నవి. కొలదిమాత్రపు సారికలుగల వీణా రూపములు బేలూరు శిల్పములయందు కనబడుచున్నవి.

నారదులు, అహోబలులు, విద్యారణ్యులు, హరిపాల దేవులు తమ తమ గ్రంథములయం దుదహరించిన వీణలను గమనించినచో హరిపాల దేవునినాటికి, వీణయందు సారికల నుంచుటకు కొన్ని ప్రయత్నములు జరిగినవో లేక జరుగుచున్నవోనని తోచుచున్నది. ఈతని తరువాత వారయిన రామామాత్యులు, సోమనాథుడు, గోవిందదీక్షితులు వీణకు సారికెల నమరించి స్థిరమగు స్వరస్థానములను ఒకే తంత్రియందు పలికించుటయందుగల సౌలభ్యమును గుర్తించి, తమ తమ పరిశోధనలను రూపొందించిరి. వాటి ఫలితమే సుమారు రెండు మూడు వందల ఏండ్లకు పూర్వము నుండియుగల వీణ, ఈనాడు ఇరువదినాలుగు సారికలతో స్థిరమగు, నాద సౌందర్యమును ప్రసాదించుచు రూపొందినది.

రామామాత్యులు చెప్పిన ఏకరాగ మేళవీణ కర్నాటక సంగీతము నుండి దూరమునకు జరిగి, సప్త తంత్రిణి వీణయై, కాల క్రమమున సాత్ తార్‌గను, సితార్‌గను మార్పు చెంది యుండ వచ్చును. ఇప్పుడున్న సితార్‌నందు సారికలు, రాగానుగణముగా జరుపుకొనుటకు వీలుగా దండిపై కట్టియుంచుట గమనింపదగును. ఇట్టి వీణను కిన్నెరయందలి యొక రూపమని హరిపాలదేవులు చెప్పి ఇందు పదునాలుగు, పదునారు, పదునెనిమిది సారికలు వారి వారి ఇష్టానుసారముగ కట్టుకొనుట పరిపాటి యని యున్నారు. ఇప్పటికిని ఇట్లే జరుగుచున్నది.

వీణకు యీనాటి స్వరూపము వచ్చుటకు మరియొక కారణము తోచుచున్నది. ప్రాచీనులు చెప్పిన వీణలయందు తంత్రులు హెచ్చుగా నుండునవియు లేదా తక్కువ తంత్రులుండునవియునై శ్రుతిపక్వతను సాధించుట కష్టతరముగా నుండుటయు గాత్ర సంగీతమును తిరిగి అట్లే పలికించుటకు కావలసిన అవకాశము లేనివియై

యుండును. పదిహేడవ శతాబ్దము నుండి కర్నాటక సంగీతమునందు వాద్య సంగీతమనునది ప్రత్యేకముగా నుండక, గీతవర్ణ ప్రబంధాదులు వీణయందు కూడ పాడుచున్నట్లే వాయించు పద్ధతి ప్రారంభమగుటయు, అంతకు కొలది కాలమునకు పూర్వమునుండియు వాడుకలోనున్న మహానాటక వీణయందు ధారావాహికమగు ధ్వనియున్నను పొడవగు దండిపై తంత్రియందు స్వరస్థానములు నిర్దుష్టముగా సాధించుట కష్టసాధ్యమగుటయు మొదలైన కారణములవలన స్థాయియందు పండ్రెండు స్వరస్థానముల చొప్పున రెండు స్థాయిలకు సారికలను కదలకుండునట్లు దండియందు బిగించి మంద్ర షడ్జమము, మంద్ర పంచమము, అనుమంద్ర షడ్జమము, అనుమంద్ర పంచమము అను నాలుగు తంత్రులపై మూడున్నర స్థాయిలను పలికించుకొనుటకు వీలుకలుగునట్లుగా వీణను రూపొందించుకొనవలసిన ఆవశ్యకత ఏర్పడి యుండవచ్చును. ఇట్టి సర్వాంగసుందరమగు వీణరూపొందిన తరువాత తక్కిన వీణా స్వరూపము లన్నియు క్రమముగా మరుగున పడిపోయినవనియు భావించుకొనవలసి వచ్చుచున్నది.

ప్రాచీనులు చెప్పిన వీణా స్వరూపములలో కొన్ని ఉత్తర భారతమునందిప్పటికిని నిలచియున్నవి. విచిత్రవీణ, సరస్వతీవీణ, ఏనుగు ముఖమువంటి ఆకారముగల సరోద్, సితార్, మొదలగు వాద్యములయందు, ప్రత్యేకమగు వాద్యానుగుణములైన సంగీత విషయములను తక్క, వేరు విధములగు పోకడలను పలికించుటకు సౌలభ్యము తక్కువగనే యున్నది. అందువలననే ఈ వాద్యములయందు రాగాలాపనతప్ప తక్కినవన్నియు గాత్ర సంగీతమునకు సంబంధము లేనివిగనే యుండును. గడచిన రెండు మూడు శతాబ్దముల నుండియు కర్నాటక సంగీతమునందు, గాయకులు గానముచేయు విషయములను యథాతథముగ ఏ వాద్యములయందు పలికించుటకు అవకాశము లున్నవో, అట్టి వాద్యములు మాత్రము ఇచట నిలచియున్నవి.

ముఖ్యముగా ఆలాపన, తానము, కృతి, నెరవు, కల్పన స్వరము అను ఐదు అంగములు ప్రధానములైనవిగా కర్నాటక సంగీతమున నిలిచి పోయినవి. ఇందు కృతి, కీర్తన అనునవి మహానుభావులైన వాగ్గేయ కారుల స్వర సాహిత్యములు గలవియై పాడినను, వాద్యముల యందు వాయించినను ఒకే విధమగు రూపుకలిగి యుండవలెనే యుండును. ఇట్లుంచుటవలననే సుమారు నాలుగు వందల సంవత్సరముల క్రిందటివియగు అపురూపములగు సంగీత రచనలు ధాతు మాతు స్వరూపములు కొంతవరకైనను నిలచియున్నవి. ఇది యిట్లు జరుగుటకు, వీణకు ఈనాటి స్వరూపమును ప్రసాదించిన మహాను భావులే కారణమని చెప్పుకొనిన అతిశయోక్తి కాదు.

రామామాత్యులు స్వరమేళ కళానిధియను ఉద్గ్రంథములో నుదహరించిన రెండవ వీణ అచ్యుతరాజేంద్ర మేళ వీణయను స్వర రాగ మేళవీణయందు సారెకలను చలనము లేకుండునట్లు నిలుపుటను చెప్పియున్నారు. వీరికి సమకాలికులైన సోమేశ్వర పండితులు తమ రాగ విబోధమునందు స్పష్టముగా సారిక లమర్చిన వీణను రూపొందించి చెప్పియున్నారు. వీరిరువురు తెనుగువారే.

వీరికి తరువాతి వారైన వెంకటమఖి తన చతుర్దండి ప్రకాశిక యను సంగీత గ్రంథమునందు ఇప్పటి వీణకు పూర్తి మెరుగులు దిద్ది యున్నారు. వీణయందు స్వరముల మధ్యగల యంతరములను, వాని యందలి శృతులను ధారావాహికముగ పలికించుటను, పన్నెండు ముఖ్యములగు స్వరస్థానములను నిశ్చయముగా నిలిపి యుంచుటకును అవకాశ మేర్పడినందువలన గమక వరికాదులతో రాగములను స్వరూప స్వభావములు చెడకుండునట్లుగా పలికించుకొనుటకును కష్ట సాధ్యములైన ఏకశృతి, ద్విశృతి, త్రిశృతి, చతుశ్రుత్యాదులుగల స్వరములను సారికలపై ఈడ్చిపట్టుటకు వీలుండుటవలనను, గాత్రాను

కూలమగు త్రిస్థాయిలయందు సంచరించుటకును అవకాశముండుట వలనను కర్నాటక సంగీత స్వరూపము నిశ్చయములగు కొన్ని నిర్ణీత పద్ధతులపై వికసించుచు సాగుచున్నది. దీనికి ఉదాహరణమేమనగా బరువులు, ఒదుగులు, స్వరములయందుగల హెచ్చు తగ్గులు చెడకుండునట్లు ఒక రాగమునందలి రచనలు గురుశిష్య పరంపరయందు మూడు నాలుగు వందల సంవత్సరముల నుండి ఒకే విధముగా ప్రచారమునందుండుంటయే. అనగా శంకరాభరణమునందలి క్షేత్రజ్ఞులవారి పదము, రామదాసులవారి కీర్తన, నారాయణతీర్థులవారి తరంగము, ముత్తుస్వామిదీక్షితులవారి కృతి, త్యాగరాజస్వామివారి రచన, ఎట్టి గమక స్వర సంచార విధానములు గలిగి రాగ స్వరూప బోధనములుగా పాడబడుచున్నవో, అట్లే ఇప్పటి రచయితల రచనలయందును విద్వాంసుల విద్యా ప్రదర్శనములయందును మనకు వినబడుచున్నవి. ఇట్టి విచిత్రమగు పరంపరానుగత సంగీత రూపము ప్రపంచ సంగీత చరిత్రయందే కానవచ్చుట అరుదు.

ఇచ్చట రామామాత్యులకు పూర్వముండిన వీణల స్వరూపములను కొంచెము గమనింతము. శృతి, స్వర నిర్ణయమునకు వీణలను ఉదహరించుచు తమ గ్రంథములయందు పేర్కొనిన గ్రంథకర్తలందరును వారు చెప్పుకొన్న వీణలకు తంత్రులను మాత్రమే చెప్పుచుండుట గమనార్హము. ఇన్నవ తంత్రియందు ఈ స్వరము లేక ఈ శృతి పుట్టుచున్నదని వారు చెప్పుచుండుటవలనను మనకు తెలియవచ్చుచున్న విషయమేమనగా వీణలయందు సారికల నమర్చు విధానము ప్రారంభమై సుమారు నాలుగైదువందల సంవత్సరములు మాత్రమేయై యుండునని తోచుచున్నది. అంతకు పూర్వముండిన లక్షణకారులందరును శృతుల విభాగములయందే ఒకరినొకరు ఖండించుకొనుచు వారు చెప్పినది సరి, వీరు చెప్పినది సరికాదు అన్న

తర్క వితర్కములతో గ్రంథములను నింపుకొనుచు వచ్చిరేగాని, పంద్రెండు సారికలపై పదునారు లేక ఇరువదిరెండు శృతులను పలికించుటలో సౌలభ్యమును గుర్తించిన వారుకారు.

శుద్ధ, వికృత స్వర నిర్ణయవిధానమున గూడ వాదోపవాదము లున్నవి. ఇవి యన్నియు తప్పించుకొని క్షేత్రజ్ఞుల వారికి కొంచెము వెనుకముందుగల సంగీత రచయితలు రాగ స్వరూపములను వ్యక్త పరచుచు చెప్పిన రచనలు ఎట్లో దేశమునందు కొలదిమంది విద్వాంసులకైనను పాఠమున మిగిలి యుండుటవలన మనకు యీనాడు పరిష్కృతములై ప్రచారమునందున్న కొలది రాగములైనను ప్రాచీనములని చెప్పుకొనుటకు మిగిలి యున్నవి. వీనియందలి స్వరములలో ఏవి వికృతములు, ఏవి శుద్ధములు అను విమర్శ వదలుచున్నాను. ఏలననగా శంకరాభరణ రాగమునందు పలికెడు స్వరములకు పేర్లేవైనను రాగ స్వరూపమును తెలియజేయునవి అవియే స్వరములై యుండవలెనుకదా! శ్రవ్యప్రధానమైన సంగీత విద్యకు ప్రమాణము శ్రవణేంద్రియము. గనుక నిసరిగమ-మగమపదని అనునప్పుడు పలికెడు స్వరములు గమక వరికాదుల సరియగు సంప్రదాయమును తెలిసిన వారివలననేగదా తెలిసికొనవలసి యుండును. ఆయా స్వరములకు ఉండవలసిన బరువులు గమకములు ఉండిననే, దానిని వినుటకు అలవాటు పడినవారికి 'అది శంకరాభరణము' అని తెలియును. ఇట్టి నిశ్చిత రూపములు కలిగించుటకును, ప్రచారము నందుంచుటకును తోడ్పడిన వాద్యములలో కర్నాటక సంగీత ప్రపంచమునందు ఈనాడు నిలచియున్న వీణయే కారణము.

ఇత్తడి, కంచు మొదలగు లోహములతో మెట్లు తయారు చేయుట, లోహపుతంత్రులను వీణలకు వేయుట, ఇవి నాద సౌందర్యమును వృద్ధిచేయుటకు ఎంతగానో తోడ్పడినవి. ఒకప్పుడు దండి

పై భాగమున గల కర్రపలకయందే సారికలు చెక్కుటయు జరుగుచుండెడిది. ఇట్లు చేయబడిన వీణ సుమారు నలభై ఏభై సంవత్సరముల వరకు విజయనగరమువారి కోటయందుండెడిదని చెప్పుకొందురు. దంతము, కొమ్ము వంటి వానితో సారికలను చేసి వానికి రెండు కొనలయందును రంధ్రములుంచి వానియందు బలమగు సూత్రము వంటిదానితో దండి క్రింద భాగమున కట్టియుంచుట జరిగెడిది. లోహపు తంత్రుల నుపయోగించుట ప్రారంభమైన నాటినుండియు కర్ర, కొమ్ము, దంతము మొదలగు వానితో చేయబడిన సారికలు తరచుగ అరిగిపోవుచుండుటవలన ఇత్తడి, ఇనుము, కంచు వంటి లోహములతో మెట్లు చేసెడి పద్ధతి ప్రారంభమై యుండును. మెట్లను స్థిరముగ నిలుపుటకు చేసిన ప్రయత్నములయందును కొన్ని గమనించ దగు విషయములు కనబడుచున్నవి. మహా వైణికులని పేరుపొందిన వీణ వెంకటరమణ దాసుగారు వీణకు మెట్లను దండి పై భాగమున సీలలతో బిగించి యుంచెడివారట. అట్లు చేయుటవలన తంత్రి, సారిక, దండి యీ మూడిటి మధ్య బలమైన సంబంధమేర్పడి నాదము పెంపొంది యుండెడిదని పెద్దలు చెప్పుచుందురు. కాని యీ విధముగ సారికలను నిలుపుట కష్ట సాధ్యము. సారికలు స్థిరముగ నిలుపుకొనుట యెంత ఆవశ్యకమో, అవుసరమగునప్పుడు వానిని అటు నిటు జరుపుకొనుటకవకాశము కూడ అంత ఆవశ్యకమే యగుచున్నది. ఏలనన తంత్రుల మందములో గలుగు భేదముల వలన, వాతావరణమునందలి మార్పులవలన శృతి హెచ్చుట, తగ్గుట జరిగి స్వరముల స్థానములయందు కొలది హెచ్చు తగ్గులు వచ్చుచుండుట వైణికులకు అనుభవమే కదా! ఒకసారి కర్రయందు చెక్కినవో లేక సీలలతో బిగించినవియో అయినచో సారికలు సద్దుకొనుటకు వీలుపడదుకదా! అందువలన మైనమును, వస్త్రకాళితము చేసిన గుగ్గిలము, సాంబ్రాణి, బొగ్గుపొడి వీనిని కలిపి ఉడికించి

చల్లార్చిన ముద్దతో దండి అంచున గోడలుగా నిర్మించుకొని మెట్లు స్థాపించుకొను విధానము రూపొంది యుండును. ఇట్లు నిర్మించుకొనిన మేళమునందు మార్పులు చేసికొనవలసినచో కొంచెముసేపు ఎండలోనుంచి మెట్లను సర్దుకొందురు. ఈ విధముగ వీణకు మేళము చేయుట బహు నైపుణ్యముతో కూడిన పని.

**ఇప్పటి వీణయందు వచ్చిన కొన్ని మార్పులు :**

ఇప్పటి కాలానుగుణముగను సంగీతమునందు వచ్చుచున్న మార్పులకు అనుగుణముగను వీణయందు ముఖ్యముగా చెప్పుకొనదగిన పరిశోధనా ప్రయత్నములను కొన్నిటిని ఇచట నుదహరించుకొందము. వీణయందు ఒక మీటునకును, రెండవ మీటునకును మధ్య, ధ్వనిని వీలగునంత ఎక్కువ సమయము నిలుపుట యీనాటి సంగీతమునందు అవసరమగుచున్నది. దీనిని సాధించుటకు సితార్ అను వాద్యమునందువలె అనుకంపన తంత్రులు వీణయందుకూడ అమర్చుకొనుట యవసరమగుచున్నది. ఇట్లు చేయుటవలన సారిక యందు స్వరము పలికించి, ఆ స్వరమునుండి వేరొక స్వరమునకు వ్రేళ్ళను జార్చుకొనినను, వెనుకటి స్వరము కొలదికాలము పలుకుచు అనుసరించి వచ్చుచుండును. ఇది ధ్వని వర్ధక యంత్రము నందు మనోజ్ఞముగా వినబడుచున్నది. తాన ప్రక్రియ యందు తంత్రుల నన్నింటిని ఒకేసారి మీటుటకు దక్షిణ హస్తమును వర్తులముగా ఎత్తి మీటవలసి వచ్చుచుండుటయు అందువలన కొంత నాదపుష్టి కొరవడుటయు, కాలప్రమాణమున మార్పు వచ్చుచుండుటయు జరుగుటవలన ప్రక్క తంత్రులు లేక తాళతంత్రులు అను వాని యందు మూడింటిని అధికముగా చేర్చుకొని ఆ ఆరు తంత్రులను తాళ తంత్రులుగా నమర్చుకొనుటయు ఆవశ్యకమైనది. ఇట్లు చేర్చుకొనిన ఆరు తంత్రులను అనుమంద్ర, మంద్ర, మధ్య, తార స్థాయిల యందలి షడ్జ పంచమ స్వరములకు శృతి కూర్చుటవలన తంత్రు లన్ని

టిని చేర్చి మీటినప్పుడు కలిగెడి నాద విశేషముత్పన్న మగుచున్నది. ఇట్లు ప్రక్క తంత్రులను శృతికూర్చుటకు మారుగా కొన్ని రాగముల యందలి స్వరములను వీనియందు శృతిగూర్చి కొందరు విద్వాంసులు వాయించుచున్నారు.

మేళమును స్థిరపరచినపిమ్మట వీణ యందు ప, స, ప, స అను విధముగా శృతి గూర్చుటయు పరిపాటియై యుండవచ్చును. స, ప, స, ప అను శృతులయందు వీణను మేళవించి ఐదవ సారెక యందు శుద్ధ మధ్యమము అనుకొనవలసిన స్థానమునందు మధ్యషడ్జమమును నిశ్చయించుకొని వాయించుటవలన మంద్ర, అనుమంద్ర స్థాయిలును, మధ్యస్థాయికి తదుపరి తార స్థాయియందు పంచమము వరకును వుండి మూడున్నర స్థాయిలు పలుకుటకు వీణయందు సౌలభ్యము కలుగుచున్నది. ఇట్లు శృతి గూర్చుకొనుట వలన భారతీయ సంగీతమునందు ప్రధానములగు రెండు పద్ధతులయందును గల ప్రత్యేకతలను ప్రదర్శించుట కనుగుణముగా వీణ అమరుచున్నది. దక్షిణదేశమునందు ప్రచలితముగ నున్న సరస్వతీ వీణయందు కర్నాటక సంగీతమును మాత్రమే వాయించుట కొలది కాలము వరకు జరుగుచుండినను, వాద్యమునందలి వైశిష్ట్యము, నాదపుష్టిని, పురస్కరించుకొని ఈ వాద్యమునందు ఏ సంగీతపు బాణీల నైనను పలికించ గల యవకాశము కలిగించుటయే పై నుదహరించిన మార్పులను చేయుటకు కారణము. సంప్రదాయములను పాటించుచు నూతన ప్రయోగములను చేయుటయందు ఆంధ్రులు అగ్రతాంబూలమును అందుకొనుచునే యున్నారు.

**వీణ - నిర్మాణ విశేషములు**

జరుగుచున్నది. వీణలను తయారుచేయుటయందు ఆంధ్రులు సిద్ధహస్తులు. బొబ్బిలి, పిఠాపురము, నూజివీడు, బందరు మొదలగు ప్రాంతములయందు ఇప్పటికినీ వంశపారంపర్యముగా వీణలు నిర్మించెడి పనివారి కుటుంబములు ఎన్నియో కలవు. వీణయందు కుండ, దండి, సింహాసము అనుమూడు భాగములుండును. వీటిని విడివిడిగా తయారుచేసి ఒకదాని కొకటి అతికింతురు. ఇట్లుగాక వీణనంతటిని ఒకే ప్రూని యందు మలచి ఏకాండ వీణలను నిర్మించెడి వాడుక కూడ కలదు. ఎడమవైపున నుంచబడెడి సొరకాయ తుంబలను కూడ ప్రత్యేక శ్రద్ధతో పండించి, రూపొందించుటయు ఆంధ్రులకే యలవాటు ఏలయన, తమిళ, కన్నడ, మళయాళ దేశీయులు రేకు తుంబలను గాని, కాగితపుగుజ్జు తుంబలను గాని ఉపయోగింతురు. ఆంధ్ర దేశమునందివి కానరావు.

వీణా నిర్మాణమునకు పొడవు, ఎత్తు, కుండ మధ్య కొలత మున్నగునవి శాస్త్రీయపద్ధతులపై నిర్ణయింపబడి, ఈ కొలతలు గల వీణను ఈ శృతియందుంచుకొనవలెను అను శాస్త్ర నిర్ణయమైనను, పరిశోధింపబడలేదు. కాని వీణలను చేయు పనివారు వారి పూర్వీకుల వరవడి ననుసరించుచునే వీణలను నిర్మించుచున్నారు. ఇప్పుడు ఆధునిక యంత్ర పరికరములతో నిర్దుష్టమగు పరిశోధనలు జరిపి ప్రాచీన వాద్యమగు దీనియందెంతయో క్రొత్తదనము తెచ్చుట కవకాశము లెన్నియో గలవు. ఏలననగా శాస్త్రీయ దృక్పథముగల అన్యదేశీయులు ఈ వాద్యము నుపయోగించుటయందు కుతూహలము కనబరుచుచుండుట అందరకు తెలిసిన విషయమే.

వీణకు మేళము చేయునప్పుడు సారికలను షడ్జ పంచమ భావములతో నమర్చుకొనినచో శృతి శుద్ధమగు నాద సౌందర్యము కలు

గును ఈ పద్ధతి నిచ్చట కొంత వివరించెదను. షడ్జమమునకు పంచమను, పంచమమునకు పంచమను, ఇదియే చతుశ్రుతి రిషభము. దీనికి పంచమము చతుశ్రుతి ధైవతము. షడ్జమమునందలి అంతర్ధ్వని యగు గాంధారము స్థాపించి, దానికి పంచమముగా కాకలి నిషాదమును, దానికి పంచమముగా ప్రతిమధ్యమము, దానికి పంచమముగా శుద్ధ రిషభమును, దానికి పంచమముగా శుద్ధ ధైవతమును అమర్చుకొనవలెను ఇట్లు చేయుటలో చతుశ్రుతి ధైవతమునకును, అంతర గాంధారమునకును పొత్తు కుదరదు. చతుశ్రుతి ధైవతము ఒక శృతి హెచ్చుగా పలుకుచుండును. పంచమమునకు పంచమమయిన చతుశ్రుతి రిషభమునకు పంచమ మగుటవలనను, షడ్జమమున అంతర్లీనముగా వినవచ్చు అంతరగాంధారము హెచ్చించినచో శృతి శుద్ధత యేర్పడకపోవుటవలనను ఇట్లుండును. అందువలన రిషభ ధైవతములను ఈ విధముగాను, తక్కిన అన్ని స్వరములను అంతర గాంధారము ననుసరించియు నిర్ణయించుకొనవలసియుండును. అట్లు చేయనిచో అన్ని స్వరములయందును ఒకశృతి హెచ్చు పలుకును. శుద్ధమధ్యమము మాత్రము షడ్జమధ్యమ భావముతోనే అమర్చుకొని దానికి మధ్యమముగా కైశికి నిషాదము దానికి క్రింది షడ్జముగా సాధారణ గాంధారమును ఉంచి, దానికి శుద్ధ ధైవతము మధ్యమముగా కలిపి, తక్కిన స్వరములన్నిటితోను పొత్తు కుదిరి మేళము సుస్వరముగా నుండును. వీణలు సుమారు నలువది లేక నలువదియారు అంగుళములు పొడవుండి, ఒడియందు నిలువబెట్టుకొని వాయించుటకు వీలుగా ఒకప్పుడు తయారుచేయుచుండిరి కాని ఇప్పుడు పొడవునకు హద్దులు లేక వారి వారి అభిరుచి ననుసరించి చేయించుకొనుచు, కుడివైపు కుండయు, ఎడమవైపు తుంబయు వచ్చునట్లు పండుకొనబెట్టి స్త్రీ పురుషు లందరు ఒకే విధ

ముగ వీణలను వాయించుచున్నారు. ఆంధ్రదేశమునందు విద్వాంసులు మొన్న మొన్నటివరకు వీణను నిలువబెట్టియే వాయించుచుండెడి వారు.

## సంగీత సాధన

శారీరమున గానము నభ్యసించువారు వీణావాదనమున కూడ కొంత పరిశ్రమ చేసినగాని, సంగీత స్వరూపమును తెలుసుకొనుశక్తి చక్కగా సిద్ధించదనియు, వీణను ప్రక్క వాద్యముగా నుపయోగించుకొనుచు, గాత్ర సంగీతజ్ఞులు పాడవలెనవియు కొన్ని పద్ధతులు కొంత కాలము క్రిందటి వరకు నుండెడివని పెద్దలు చెప్పుచుందురు. ఇప్పుడు వీణను అభ్యసించు వారు కొంతవరకు గాత్ర సంగీతమును తెలుసుకున్న వారైనను, గాత్రమున పాడెడి వారికి ప్రక్క వాద్యముగా వాయించు సంప్రదాయము మాత్రము వాడుకలో లేదనియే చెప్పవచ్చును. ఇంతియే కాదు, గాత్రసంగీతజ్ఞుడు ఏదైన నొక వాద్యమునందు కొంతవరకైనను నిపుణత సంపాదించుకొను నలవాటును క్రమ క్రమముగా దూరమగుచున్నది. దీనికి కారణములే పైనను కావచ్చును. ముఖ్యముగా ఈనాటి జీవన విధానమునందలి త్వరిత గమన మొకటియని యనుకొనవచ్చును. వీణావాద్యమునందెందరో మహానుభావులు 200 సంవత్సరముల నుండి తెనుగుదేశమునందు పుట్టిన వారైనను దేశమునందంతటను పేరు ప్రఖ్యాతులు గడించి, కొన్ని విశిష్టములగు సంగీత పద్ధతులకు మార్గదర్శకులుగా సంగీత చరిత్ర యందు నిలచి యున్నారు. వీరిలో కొందరు వంశపారంపర్యముగా వీణా వాదన ప్రక్రియల యందు పేరెన్నిక గలవారు. మరికొందరు తాము తమ శిష్య ప్రశిష్యుల మూలమున చెప్పుకొన దగిన కీర్తిని నిలబెట్టుకొన్నవారు. ఏమైనను ఆంధ్రదేశమునందు వీణాగానము ఒక విశిష్ట విన్యాసముతో అవిచ్ఛిన్నముగ

సుమారు రెండు, మూడు వందల సంవత్సరముల నుండి వైనను సాగుచునే యున్నది. ఇందు వంశపారంపర్యముగా వచ్చుచున్న కుటుంబములలో గురురాయాచార్యులవారు, వాసావారు, ఈమని వారు, పొడుగువారు, శిష్టువారు ప్రసిద్ధులు. ఈ కుటుంబములయందు తరమున కొకరిద్దరైనను మహావిద్వాంసులగు వైణికులుద్భవించు చునే యున్నారు.

## ప్రసిద్ధ వైణికులు

దక్షిణభారతమునందు పేరెన్నిక గన్న వైణికులెందరోగలరు. వీణ స్వరూపమును తీర్చిదిద్ది, గ్రంథములను వ్రాసిన వాగ్గేయకారులైన వారిని గురించి యటుంచుదము. త్యాగరాజ స్వామివారి శిష్యులు వీణ కుప్పయ్య; వీరికి ఇంటి పేరే వీణ యైనది. ఈ మహా విద్వాంసుల శిష్యపరంపరలు తెలుసుకొనవలసి యున్నది. వీణ కాళహస్తయ్య, వారి కుమారులు పెరుమాళ్ళయ్య, వీణ నారాయణ సామయ్య, కొండయ్య. వీరు తంజావూరు ప్రభువులచే మన్నన లందిన ఆస్థాన విద్వాంసులు. సంగీత సంస్కృతాంధ్రములలో పండితులయిన వెంకటేశ్వరశాస్త్రిల వారు గొప్ప వైణికులని పేరు పొందినవారు. పచ్చిమిరియం, ఆది అప్పయ్య వైణిక విద్వాంసులు. ప్రసిద్ధమగు వీరి రచనలలో భైరవి రాగమున గల విరిబోణి వర్ణము నేటికిని వర్ణముల యందు మహారాజ్ఞియై యొప్పుచున్నది. వీరి కుమారులు వీణ కృష్ణయ్య, వీరి కుమారులు సుబ్బుకుట్టియ్య, శిష్యులు పల్లవి గోపాలయ్య, పుత్రులు ఆది మూర్తి అయ్య, అప్పయ్యగారి వలెనే మహావిద్వాంసులైన వైణికులు. వీణ సాంబమూర్తిశాస్త్రి, త్యాగరాజ స్వామివారికి సమకాలికులైన మహా వైణికులు. వీరు గోలకొండ నవాబును దర్శించినట్లు ఒక ఐతిహ్యము మున్నది. వీరికుమారులు వీణకుప్పయ్య త్యాగరాజస్వామివారికి ప్రియ

శిష్యులు. వీరికుమారులు తిరువత్తియూరు త్యాగయ్యగారు రచించిన వర్ణములు, కీర్తనలు ఇప్పటికిని వాడుకలోనున్నవి. మహావైణికులగు వీణ శేషన్నగారు జావళులు, తిల్లానలు చెప్పినవారు. విధ్యాధరి, వీణ ధనమ్మగారు వీణకామాక్షమ్మగారి శిష్యురాలు. ప్రత్యేకములగు గమక వరికాదులతో వీణ వాయించుట యందును, కష్టసాధ్యము లైన క్షేత్రజ్ఞులు, సారంగపాణి మున్నగువారి పదములు పాడుట యందును అసమాన ప్రజ్ఞగలవారు. మైగరు వరదాచార్యులవారి సోదరులు వీణ కృష్ణమాచార్యులవారు, తచ్చూరు సింగరాచార్యుల వారి శిష్యులు. అనంతపురం గోవిందపెరుమాళ్‌గారు, వారిశిష్యులు పట్నాల వైణిక ప్రవీణ తిరుకొండ్రం రామయ్య.

సుమారు రెండువందల సంవత్సరముల నుండి తెనుగు దేశము నందు ప్రసిద్ధి కెక్కిన వైణిక కుటుంబము లెన్నియో యుండెడివని చెప్పుకొన్నాము కదా! దొరికినంత వరకు ఈ కుటుంబముల యందలి విద్వాంసులు, వారి శిష్యపరంపరలను గురించి ముచ్చటించుకొందము. గురురాయాచార్యులవారు వీణయందు పట్నాలములను వాయించ గల మహావైణికులు, గీత, దరు, స్వరజతి, వర్ణకీర్తనాదులను రచించి విజయనగర సంస్థానమునం దాస్థాన విద్వాంసులై యుండెడి వారట. వీరి కుమారులు సీతారామప్ప, వారి కుమారులు చిన గురు రాయాచార్యులు. వీరి శిష్యులు రామాచారి, నాగభూషణం, గురు రాయాచార్యులవారి మనుమలు వీణ రమణయ్యదాసుగారు. వీరు దేశమునందలి పెక్కు సంస్థానముల యందతి వైభవముగా గౌరవింప బడినవారు. సుమారు నలువది పండ్ల క్రిందటి వరకు నుండెడివారు. గురురాయాచార్యులవారి శిష్యులే దూర్వాసుల సూర్యనారాయణ సోమయాజులుగారు, దూర్వాసుల దక్షిణామూర్తి శాస్త్రిలగారలు. వీరిరువురును ఎన్నియో సంగీత రచనలను చేయుటయేగాక ఎందరో శిష్యులకు విద్యాదానమును సైతము చేసినవారు.

తరువాత చెప్పుకొనవలసిన వారు వాసావారి కుటుంబము వారు. వాసా పెదజగ్గన్నగారు మహావైణికులు. స్వరపల్లవులు, గీతములు, జక్కిణి దరువులు, వర్ణములువంటి సంగీత రచనలెన్నియో చేసినవారు. వీరి కుమారులు వాసా రామదాసు, దాసన్న. వీరిరువురును త్యాగరాజస్వామికి సమకాలికులై వారికి తమ గానమును వినిపించి ప్రశంసలనంది అనేక సంస్థానముల యందు తమ పాండిత్య ప్రదర్శనములు చేసినవారట. ఇందు దాసన్నగారికి బొబ్బిలి కేశవయ్య అను నామాంతరము గలదనియు, ఘన సాంప్రదాయముననను, పల్లవి పాడుటయందును వీరు మహా ప్రతిభావంతులనియు, వీరికి 'భూలోక చాప చుట్టి' అను బిరుదు గలదనియు, తంజావూరు ప్రభువుల ఆస్థానమునందు శ్యామశాస్త్రిలవారితో జరిగిన విద్వద్గోష్ఠి యందు శరభనందనమను విచిత్రమగు తాళమునందు పల్లవిని పాడి మెప్పు పొందిరనియు, ఘనం కృష్ణయ్య, మొదలగు విద్వాంసులు వీరివద్ద ఘన సంప్రదాయమును అభ్యసించిరనియు ప్రతీతి. కాని దక్షిణాదిని ఈ బొబ్బిలి కేశవయ్యగారు చాత్తాద వైష్ణవులని చెప్పుకొందురు. ఈ విషయమును పరిశోధించవలసి యున్నది. వీరి వంశములోనివారే వీణ వరదయ్యగారు.

వాసా దాసన్నగారి కుమారులు చిన జగ్గన్న. వీరు తాతగారి వలెనే వాగ్గేయకారులు, వైణికులు. రెండవ కుమారులు పెద కామయ్య. వీరు విజయరామ గజపతిపై కొన్ని గీతములు, ఆనంద గజపతిపై కొన్ని పదములు రచించిరి. వీరి కుమారులు సర్వయ్య, అప్పయ్య, చిన కామయ్య, సాంబయ్య, కృష్ణమూర్తి. వీరిలో సర్వయ్యగారు అనర్గళముగా గీతములు గానము చేయుటయందు ప్రసిద్ధులట. శిష్యవాత్సల్యమునందద్వితీయులును, సంస్కృతాంధ్ర భాషల యందు పండితులును, బహుకీర్తనాదులను రచించిన వారును, కర్ణాటక సంగీతమును చాలమంది శిష్యులకు బోధించి, ప్రచారముచేసిన

కులపతి యగు గురుదేవులుగా వాసా అప్పయ్యగారిని ఇప్పటికిని చెప్పుకొందురు. చిన కామయ్యగారికి స్వరకేసరి యను బిరుదు, తాళ ప్రకరణమునందు కృషి చేసిన ఘనతయు కలదు. వీరు స్వరపల్లవులు, జక్కిణ దరువులు అనేకములు రచించిరి. స్వరప్రస్తారమున వీరి మనో ధర్మము అసాధారణమని చెప్పుకొందురు. సాంబయ్యగారు వాగ్గేయ కారులును, గొప్ప భక్తులును అయి, ఎన్నియో స్వరజతులను కూడ రచించిరి. అధ్యాత్మ రామాయణ కీర్తనలను వీరు స్వరపరచిరి. కృష్ణ మూర్తిగారు వీణా వాద్యమునందు ప్రజ్ఞాశాలురు, గమక వరికాదు లను అత్యంత నైపుణ్యముతో క్రొత్త మార్గములలో ప్రవర్తించెడి వారనియు, షట్కాలములను వాయించగలవారనియు, వాయు లీనమునందు కూడ సమర్థులనియు, చెప్పుకొందురు. ఆంధ్ర దేశమున జైత్ర యాత్రచేసి, తమ గాత్ర మాధుర్యముతో శ్రోతలను ముగ్ధు లను చేసెడివారనియు, చౌకకాల పల్లవులు రచించినవారనియు, వైణికులనియు నరసింహముగారికి ఖ్యాతిగలదు. సంగీతాభిరుచి ఎక్కు వగా నుండి పెక్కుమంది విద్వాంసులనుఆదరించెడివారనిజగన్నాథము గారికి పేరు. విజయరామ గజపతివారు నెలకొల్పిన గాన పాఠశాల యందు ప్రథమ వైణికాచార్యులుగా నియమితులైన వెంకటరావు గారు తమ శిష్యులకు భోజనాది సౌకర్యములు కల్పించి, విద్యా దానము చేసిన సద్గురువులు. వీరి శిష్య పరంపర నేటికిని ఆంధ్ర దేశ మున కొనసాగుచున్నది ఇటీవలనే కీర్తిశేషులైన వైణిక శిరోమణి వాసా కృష్ణమూర్తి వీరి కుమారులే. వాసా వెంకటరావుగారి శిష్య పరంపరయందు చెప్పుకొనదగిన కొందరు వైణిక విద్వాంసులు మండ సూర్యనారాయణ, సుదర్శనం అప్పలాచార్యులు, చల్లపల్లి రామ మూర్తి, పెనుమర్తి రామశర్మ, మేడేపల్లి నరసింహం, గోపాలశర్మ, కామేశ్వరశర్మ (వీరిని శర్మ సోదరులు అనెడివారు) ఉల్లంరాజు

బాలం, ఆకుండి నారాయణ, రామానుజం, వెంకటగిరియప్ప, అయ్యగారి సోమేశ్వరరావు మొదలైనవారు.

వాసా చినజగ్గన్నగారి శిష్యులలో ద్వివేదుల లక్ష్మణరావు, గడ్డిబొద్దు గురన్న, వాసా అప్పయ్యగారి శిష్యులు గుమ్మళూరి వెంకటశాస్త్రి,దూర్వాసులసూర్యనారాయణసోమయాజులు, ఈమని సుబ్బన్న, కలికొట్ల కామరాజు, నందిగామ వెంకన్న, వారి పావ మరిది, శిష్యులు, తన కాలమునందు మహా వైణికులుగా ఖ్యాతి నందెన కుమరాడ సంగమేశ్వరశాస్త్రిగారు. వాసా వారి కుటుంబము, వారి శిష్యపరంపరయు, ఇంకను సంగీత సరస్వతిని యర్చించుచునే యున్నారు. లక్ష్మినారాయణబాబు అనువారు వీణయం దసాధారణులు. పందనపల్లి వీరరాఘవాచార్యులు కూడ గొప్ప వైణికులే. శిష్టుపెద సర్వశాస్త్రిలు, వీరి సోదరులు శిష్టు చలమయ్యాశాస్త్రి, శిష్టు భగవాన్లు, నల్లాన్ చక్రవర్తుల పార్థసారధి (వీరు గ్రంథకర్తలు) శిష్టువారి కుటుంబమునందు కొన్ని తరములనుండియు సంగీత విద్వాంసులుద్భవించుచునే యున్నారు. వీరి శిష్యపరంపరయందును చాల మంది కలరు.

గమక సంప్రదాయమును చక్కగా నెరిగినవారని పేరుగల ఈమని సుబ్బన్నగారి కుమారులు ఈమని అచ్యుతరామశాస్త్రి. వీరిని ద్రాక్షారామ పండితులని చెప్పకొనెడి వారు. వారి కుమారులే మహా మహోపాధ్యాయాది బిరుదాంకితులు ఈమని శంకరశాస్త్రి, వాసా కామయ్యగారి శిష్యులు పప్పు అప్పయ్య, రేచేటి అప్పుడు, ఎర్రి సూరన్న, మద్దెల నారీమణి; వాసా సాంబయ్యగారి శిష్యులు కట్టు సూరన్న, వాహినీపతి ఉపద్రష్ట వరహాలు, హరికథా పితామహులు ఆదిభట్లనారాయణదాసుగారు;వాసా కృష్ణమూర్తిశాస్త్రిగారిశిష్యులు కర్రి జగన్నాథాచార్యులు, వేదనభట్ల నారాయణ, ఇంకను భమిడి

పాటి వెంకన్న పంతులు, పర్లాకిమిడి వాస్తవ్యులు బుచ్చన్నపంతులు.

వీరుగాక పట్టుచెర్లసామి, సేలం వాస్తవ్యులు షట్కాలం నరసయ్య, కట్టు సూరన్నగారి శిష్యులు పొడుగు రామ్మూర్తి, పేరి రామ్మూర్తి, వీరి శిష్యులు. ఆదిరాజు నరసింహమూర్తిం (వీరు మా గురువులు), పిఠాపుర వాస్తవ్యులు రాధామాధవకవి, (వీరు వైణికులే కాక వసుచరిత్రను రాగతాళములతో పాడేశివారట), కవిరాయని లక్ష్మీనారాయణ, వారి కుమారులు కవిరాయని జోగారావు, పాల పర్తి నాగభూషణశాస్త్రి, వీణ సుబ్బరాజు మొదలగు వైణిక విద్వాం సులు చెప్పుకొనదగినవారు. ఇంకను యీ గ్రంథకర్తకు తెలియని వారును, మహావిద్వాంసులని ఎన్నికగన్న వైణికులును, గాయకు లును, భరతశాస్త్ర ప్రవీణులును గాయనీమణులును ఎందరో, విశాల మగు ఆంధ్రదేశమునను, దక్షిణదేశమునను ఉండియుందురు. వీరి సంప్రదాయములు, చరిత్ర, శిష్యపరంపరలు, రచనా విశేషములు, పరిశోధించి సేకరించి తెనుగువారి కళావైభవమును లోకమునకు తెలియజేయుచు, సమగ్రమగు చరిత్రను రూపొందించవలసియున్నది. ఈ పని ఏ ఒకరిద్దరి వ్యక్తులవలనను జరుగునదికాదు. ప్రభుత్వముగాని, ప్రత్యేక సంస్థలుగాని పూనుకొనినచో కొంతవరకైనను జరుగ వచ్చును.

## సంగీత వాద్యములు : వాయులీనము

వాయులీనము మనదేశమునకువచ్చి కర్నాటక సంగీతమునందు ప్రధానమగు ప్రక్కవాద్యముగా స్థిరపడి సుమారు రెండు వందల యేండ్లయి యుండునని తోచుచున్నది. భారతదేశమునకు ఆంగ్లేయులు ప్రెంచివారు, తదితర దేశీయులు వలసవచ్చుటకు ఆరంభించినప్పుడు వారితో గొనివచ్చిన కొన్ని సంగీత వాద్యములలో వాయులీనము, దాని కుటుంబము యొకటి. ఇందువాయులీనము గాయకుల ననుసరించి

సాధారణముగా వారు పాడెడు స్థాయికి ఒకస్థాయి హెచ్చుస్థాయిలో నుండి గమక వరికాదులను ధారాంవాహికముగ, నాదపుష్టితో పలికించెడి యవకాశముండుటచేతను, వివిధములగు కాల ప్రమాణములను సులువుగా పలికించెడు సౌలభ్య ముండుటవలనను, పరిమాణమున చిన్నదియై వాదకులు తమతో కొనిపోవుటకు సుళువై యుండుట వలనను, ఇందు నాలుగు తంత్రులు మాత్రముండి శుద్ధముగా శ్రుతి గూర్చుకొనుటకు వీలుండుటవలనను, ఈ వాద్యము కర్ణాటక సంగీతమునందు సునాయాసముగా చోటును సంపాదించుకొని యుండునని తోచుచున్నది. ఈ వాద్యమునందు సుస్వరముగా సంప్రదాయ సిద్ధములైన గమక వరికాదులను పలికించుటమాత్రము కొంచెము కష్టసాధ్యమైన పనియేనని చెప్పకతప్పదు. వీణయందు సారెకలుండి ఒక స్థాయియందుగల పండ్రెండు స్వరములకు స్థిరమగు రూపములుండి యుండుటవలన గమక వరికాదులతో వాయించగలిగినచో నధికమగు మాధుర్యము నందించగలరు. లేనిచో సాధారణముగానుండి వినుటకు ఇంపు తక్కువగా నుండును. కాని వాయులీనమునందు స్వరస్థానములు అంగుళులకు స్థిరముగా కుదుటపడునంతవరకు వినుటకు కొంచెము కఠోరముగానుండును. అందువలననే వాయులీనము చూచుటకు చిన్నదైనను, సాధించుటకు అతికష్టమైనదని విద్వాంసులందురు. ఇట్టి కష్టసాధ్యమయిన వాద్యమునందు ప్రక్కవాద్యముగనే కాక స్వతంత్రముగ కచ్చేరిలను చేయగల ప్రావీణ్యమును, ప్రతిభను మన వారెందరో సాధించిరి. శ్యామశాస్త్రిల వారి మనుమడు, సుబ్బరాయశాస్త్రిల వారి దత్తపుత్రుడునునగు అన్నాస్వామిశాస్త్రిలవారు వాయులీనమున ప్రతిభాశాలురైన విద్వాంసులు. వీరి శిష్యులు కామాక్షమ్మ, మేళక్కార్ గోవిందన్, అయ్యా భాగవతులు, అనేక రచనలను చేసిన మానాంబుచావడి వెంకటసుబ్బయ్య.

త్యాగరాజస్వామివారి శిష్యకోటిలోని వాయులీన విద్వాంసులు ముత్తుస్వామి దీక్షితులవారి కనిష్ఠ సోదరుడగు బాలస్వామి దీక్షితులవారు. వీరు వాయులీనమున ఒక ఆంగ్లేయ విద్వాంసునివద్ద శిక్షణ పొంది కర్నాటక సంగీతమును సమర్థవంతముగా వాయించెడివారట. కృష్ణస్వామి భాగవతుల పుత్రులు రామకృష్ణ భాగవతులు, బెంగుళూరు నాగరత్నమ్మగారి గురువైన ఫిడేల్ మునుస్వామప్పగారికి గురువులు. తచ్చూరు సింగరాచార్యులవారు, బాలు అనువారు, ప్రసిద్ధ వాయులీన విద్వాంసులు గోవిందస్వామిపిళ్ళెగారి శిష్యులు. పాప వెంకట్రామయ్య, టి. కె. జయరామయ్య, కరూర్ చిన్నస్వామి, కరూర్ సుబ్రహ్మణ్యయ్య, వారి సోదరులు పెద్ద దేవుడు, చిన్న దేవుడు అను వారందరు వాయులీన విద్వాంసులే. మహా భక్తులును, వాగ్గేయకారులును నగు హరినాగభూషణం, వారణాసి సుబ్రహ్మణ్యశాస్త్రి, చల్లపల్లి సుబ్బయ్య, పువ్వుల హనుమాన్లు, సుసర్ల దక్షిణామూర్తిగారి శిష్యులు దుడ్డు సీతారామయ్య, వారణాసి బలరామయ్య, శిష్టు బ్రహ్మయ్యశాస్త్రి, ప్రసిద్ధ వైణికులు పొడుగు రామమూర్తిగారి శిష్యులు బంపాడ రామన్న, వసుమర్తి కృష్ణమూర్తి, వారి శిష్యులు బాలకృష్ణ, చిదంబరం, మానాంబు చావడి వెంకటకృష్ణయ్య, వారి శిష్యులు కాళిదాసు, నారాయణస్వామి, పిఠాపురం వేమన్నదొర, సామినేని సూర్యనారాయణ, కాళహస్తి వెంకటస్వామిరాజు, వారి శిష్యులు తిరుపతి నారాయణసామి (కృతికర్త) గరికపర్తి కోటయ్యదేవర, ఉత్తర సర్కారు జిల్లా వాస్తవ్యులు కామరాజు, సరిదె సుబ్బారావు (పారుపల్లివారి శిష్యులు), నోరి నాగభూషణం, మొదలగువారు వాయులీన విద్వాంసులు. ద్వారం వెంకటస్వామినాయుడుగారు అఖిల భారతదేశమును తమ ప్రదర్శనలతో గాన కళాభిమానులను ఉర్రూతలూగించిన మహా ఘనులైన వాయులీన విద్వాంసులు. మద్దెల సత్యనారాయణ

మూర్తి, కోటిపల్లి గున్నయ్య, మారెళ్ళ కేశవరావు, మొదలగు వారు వీరి శిష్యులు. వర్ధిష్ణు కళాకారులెందరో ఈనాడు తెనుగు దేశమునందేకాక, దక్షిణ దేశమునందు కూడ పేరు ప్రతిష్ఠలు సంపాదించుకున్నారు. ద్వారం నరసింగరావుగారు నాయుడుగారి శిష్యులే. ఈక్కలి వాస్తవ్యులు రాజాజగన్నాథ దేవవర్మ వీరి శిష్యులే పాకుపల్లివారి శిష్యులు అన్నవరపు రామస్వామి, మున్నగువారెందరో పేరుప్రతిష్ఠలుగల వాయులీన విద్వాంసులు కర్నాటక సంగీత సరస్వతిని సేవించిరి, ఇంకను సేవించుకొనుచున్నారు.

వాయులీనము కుటుంబమునందు వయోలా అనునది కొంచెము పెద్దదిగానుండి, తగ్గు శృతులయందు గంభీరమగు నాదమును ధ్వనింపజేయునదియై యుండును. దీనినే స్వతంత్రముగా కచ్చేరీలు చేయుట కుపయోగించుకొనుచున్నారు. చెల్లోయనునది ఇంకను పెద్దదియగు వాయులీన రూపము. అన్నిటికన్న పెద్దదియగు డబుల్ బాస్ అనునదియు వాయులీన కుటుంబమునందలిదే. చెల్లో డబుల్ బాస్ వీటిని నేటి లలిత సంగీత ఫణతులయందు వాద్య సమ్మేళనములలో నుపయోగించుచున్నారు. ఈ వాద్యముల యందును నిపుణులు కొంతమంది కలరు. ఇదిగాక సాధారణముగ వాయులీనమందుండు ఒకటి, రెండు, మూడు తంత్రులకు జంటలను నిర్మించుకొని పదు తీగెల వాయులీనమును తయారుచేసుకొని వాయించెడివారును గలరు. వీరిలో మైసూరు టి. చౌడయ్యగారు ప్రథములని చెప్పుదురు. ఆంధ్ర దేశమున కరూరు చిన్నస్వామిగారి శిష్యులయిన సింహాద్రి అప్పలాచార్యుల వారెట్టి వాయులీనమును వాయించుటయందు ప్రసిద్ధులు.

ఒకప్పుడాంధ్రదేశమున నలుమూలలా అనేకులు వాయులీన

కళాకారులుండెడివారు. వీరియందు చాలమంది జీవనోపాధికై కళావంతుల మేళములవెంట వాయులీనమును ప్రక్క వాద్యముగా వాయించెడివారు. అట్లే యెందరో మార్దంగికులును మేళములయందు మృదంగమును వాయించుచుండెడివారట. ఇట్టివారి యునికి మనుజులను తెలుసుకొనుటయే యిప్పుడసాధ్యము. ఈ మేళములయందు పాడెడివారును చక్కటి గాత్ర సౌలభ్యముగల గాయనీమణులు, విద్వాంసురాండ్రు భరతనాట్య శాస్త్ర కోవిదురాండ్రెందరో యుండెడివారు. ఇప్పుడట్టి మేళములునులేవు, అట్టి కళాకారులును లేరు ! కాని వీరిగాన మాధుర్యమునందలి ఆకర్షణ మూలమున, ఎందరో సంగీత విద్యను సాధించుటకు ప్రయత్నించి సఫలులైనారని చెప్పుట యందతిశయోక్తిలేదు. ఇప్పటికిని మూల మూలలయందుగల వయోవృద్ధురాండ్రగు నాయకురాండ్రవద్ద నెన్నియో పదములు, జావళులు, మొదలగు సంగీత రచనలు వెదికినచో ధాతు మాతు స్వరూపములు కొలది మాత్రముగనైనను మిగిలినవి దొరుకగలవు.

**సంగీత వాద్యములు : మృదంగము**

తాళ వాద్యములలో ప్రధానమైనది మృదంగము. దీనిని మద్దెల అనియు చెప్పుట కలదు. ప్రాచీన కాలము నుండియు నీ వాద్యము ప్రధానమైన సంగీత వాద్యమైనను, దీని నిర్మాణమును గూర్చియు, వాయించెడి విధానమును గూర్చియు గ్రంథస్థములై కనబడుచున్న విషయములు బహుకొలది మాత్రమే. ఇప్పుడు మనకు తెలిసి, బంగాళ దేశమున వాడుకయందుగల మట్టితో చేయబడునది యగు ఖోల్ అనబడు మద్దెల యాకారముగల వాద్యము మాత్రమే మృదంగ మనుటకు తగియున్నది. దేశమునందు వాడుకలోగల తక్కిన మృదంగ రూపములన్నియు మృత్ అనగా మట్టితో గాక

వేరు వేరు విధములుగా చేయబడుచున్నవి, చాల వరకు ఇవి కఱ్ఱతోనే చేయుదురు.

మృదంగము సాధారణముగ మధ్య హెచ్చు కొలత యుండి, రెండు ప్రక్కలను తగ్గించ బడిన ముఖములుగల గుల్లను తయారుచేసి దానికి చర్మముతో మూతలు కట్టి, చర్మపు బద్దెలతో రెండు మూతలను లాగి బిగించి ధ్వని విశేషమును పుట్టించు చున్నారు. సాధారణముగా పనసకర్ర నుపయోగించుదురు. ఇది శ్రేష్ఠమని విద్వాంసుల మతము. ఇంకను వేగిస, తాటి, వేప, బిల్లుడు, సంద్ర మొదలగు కఱ్ఱలతో కూడ మృదంగములు చేయుట కలదు. వీనిని తయారు చేయు పనివారు చాల చోట్ల కలరు. మృదంగమునకు మూతలు కట్టుట యందు అనుభవము, చాకచక్యము కావలసియుండును. మూతల యందు కుడివైపున నుండు మూతయందు కరణి యనునదియుండును. ఈ కరణి వేయుటకు ఇనుము కలసిన చిట్లపు రాతిని అతిమెత్తగా నూరి వస్త్రకాళితముచేసి దానిని నిర్ణీతమైన పాళ్ళలో అన్నముతో కలిపి ఉండలుకట్టి దానిని అమర్చుచు శ్రుతి ననుసరించి పేర్చి, అణచి, పరచి దానిపై నునుపగు బొమ్మరాతితో రుద్ది కరణిగా రూపొందింతురు. ఈ కరణి మృదంగపు కొలత ననుసరించి వేరువేరు శ్రుతులకు వేరు వేరు విధములగు చుట్టు కొలతలు, ఎత్తు పల్లములు కలిగి యుండునట్లు వేయవలసి యుండును. కుడివైపున నుండెడి మూత యందు పాట, రెప్ప, ఒత్తు అను మూడు భాగములు చర్మముతో కుట్టవలసి యుండును. వీనిలో, పాటయనగా ద్వారమును పూర్తిగా మూయుట కుపయోగించు చర్మము. దీనికిగుల్ల ద్వారపు అంచును అంటి, కడియమువలె పాటచర్మమునకు దెబ్బ తగలకుండునట్లు క్రింద నుండునది, అనగా లోపల నుండునది ఒత్తు. పాటచర్మమునకు పై భాగమునందు అంచువలె చుట్టి యుండెడి చర్మమును రెప్ప

అందురు. ఈ రెప్పకు కొంచెము దూరమును వదలి పాట చర్మపు మధ్యభాగమున కరణిని వేయుదురు. ఈ కరణి మధ్య భాగమునందు ఎత్తై, చుట్టును అంచులయందు పలుచబడి యుండును. పాట, ఒత్తు అనునవి మేక చర్మముతోను, రెప్ప ఆవు చర్మముతోను వేయుదురు ఎడమవైపున నుండు మూతకు పాటచర్మమును, రెండు రెప్పలును వేయుదురు. ఇందు మేక చర్మమును పాటవేయుటకును, ఎద్దు, గేదె లేక ఆవు మొదలగు జంతువుల చర్మమును రెప్పలువేయుటకును ఉపయోగింతురు. కుట్టుటకు గేదె చర్మపు కొస నుపయోగింతురు. మృదంగమునందుండు, రెండుమూతలను బిగించి నిలుపుటకు గేదె, లేక ఎద్దు చర్మముతో తయారు చేసిన వారును ఉపయోగింతురు.

మృదంగమునందు కరణి గల మూతను హెచ్చించి, తగ్గించి కావలసిన విధముగా శృతి చేయుదురు. ఎడమవైపునగల మూత యందు అన్నము, కచికలు కలిపిన ముద్దతో గాని, గోధుమ రవ్వను ముద్దగా చేసిగాని, బోనము నుంచుదురు. ఇట్లుంచినబోనముతడియార కుండునట్లు పదును చేయుచు, ఎడమ వైపున పలికెడి మంద్రగంభీర ధ్వనులను ఒడుపుగా పలికింతురు. కుడివైపు మూతపై పలికెడి ధ్వనులలో మీటు, అనగా రెప్పపై చూపుడు వ్రేలితో కొట్టినప్పుడు పలుకు ధ్వని. చాటు-ఇది చేతి నాలుగువ్రేళ్ళతో కొట్టి చిటికెన వ్రేలిని కరణి అంచున నుంచినాదమును నిలిపి యుంచినచో కలుగు చున్న ధ్వని. నాటు-కరణి మధ్యభాగమునందు చూపుడు వ్రేలితో కొట్టిన నాటు అగుచున్నది. అరచాపు-వ్రేళ్ళను అధో ముఖముగా వంచి కరణియందు కొట్టి చిటికెన వ్రేలును పూర్తిగా నిలిపి నాద మును పలికించుటను అరచాపు లేక ఛెల్లు అనియందురు. కరణియందు నాలుగు వ్రేళ్ళను కొట్టి అదుముటను తత్తకార మందురు. వీని యందు దేనితోనైనను ఎడమను జత పరచుకొనవచ్చును. ఇవిగాక

ఎడమయందు ప్రత్యేకముగా పలుకు ముఖ్యమైనది వ్రేళ్ళ కొనలతో బోనమునకు క్రిందుగా కొట్టి అరచేతి పైభాగముతో ఒరపిడిన కలిగించినచో పలికెడి ధ్వనిని గమకము అని అందురు. ఇంకను, అనేక రకములైన వరుసలు, ముక్తాయింపులు, నడకలు మొదలగునవి ఈ వాద్యమునం దనాదినుండియు నిపుణులు ప్రదర్శించుచున్నారు. తాళమునందలి యంగములననుసరించియు రచనలయందలికాలప్రమాణము ననుసరించియు వచ్చెడి గతి భేదములను వాదక, గాయకులతో కలసి పలికించుటకు మృదంగ విద్వాంసులు పరిశ్రమింతురు.

ఆంధ్రదేశమునందు ప్రసిద్ధులగు కొందరు మృదంగ విద్వాంసులను తలచుకొందము. అశ్వధాటి రామమూర్తి. వీరు రకరకములగు గుఱ్ఱపు నడకలను స్ఫురింపచేయు విధముగా మృదంగము వాయించెడి వారనియు అందువలన వీరిని అశ్వధాటివారని పిలిచెడివారనియు పెద్దలు చెప్పుదురు-పొట్లూరి వీర రాఘవయ్యచౌదరి ప్రసిద్ధ మార్దంగిక విద్వాంసులగు కుంభకోణం కోదండరామయ్యగారి శిష్యులు. వారణాసి ఘంటయ్యశాస్త్రి, కూచిభొట్ల వెంకటేశ్వర్లు, చదలవాడ కుమారస్వామి, వువ్వుల రత్తయ్య, మురమళ్ళ గోపాలస్వామి, శింతాడ అప్పన్న, గంపలసోమన్న, ఏలూరి ధర్మవనం, వాల్మీకి ఘంటాలు, గరిమెళ్ళ రామలింగం, పర్లాకిమిడి వాస్తవ్యులు సామినేని రంగనాయకులు (వీరు తబలా వాద్యమునందుకూడ ప్రవీణులు), నగరికటక వాస్తవ్యులు భట్రాజు నరసింహరాజు, చీమలపాటి వెంకటరాయుడు, కామలింగాచారి, చీపురుపల్లి వాస్తవ్యులు ముట్నూరి సాంబయ్య, నరసన్నపేట వాస్తవ్యులు ఉమరవల్లి సుందరరావు, ముళ్ళపూడి లక్ష్మణరావు, ఎల్లా వీరాస్వామి, ఎల్లా వెంకటలింగం, పుల్లేటికుర్తి వెంకన్న, ఎల్లా సోమన్న, కోలంక వెంకటరాజు, ధర్మాల రామమూర్తి (వీరు మృదంగతత్వ మను గ్రంథమును రచించిరి)

మొదలగు విద్వాంసులు వారి శిష్య ప్రశిష్యుల విద్యా వైభవముతో ఇంకను మనదేశమునందన్ని మూలలను నిలచియున్నారు.

**సంగీత వాద్యములు : ఘటము కంజిర**

మృదంగము, ఘటవాద్యము, కంజిర, డప్పు, డోలు, పంబ మొదలగు వాద్యములయందు నిర్మాణ విశేషమున మార్పంతగా వచ్చినట్లు లేదు. ఘటమనగా మట్టికుండను ప్రత్యేకములగు శృతుల యందు పలుకుటకు వీలగు విధమున కుండనుకాల్చి నిర్మింతురు. ఈ కుండ తగుమాత్రముదైన మూతి కలిగి అది మూసి తట్టినప్పుడు, తెరచి తట్టినప్పుడు వేరు వేరు విధములుగా పలుకుచుండును. డప్పు, కంజిర యాకారముననుండి దానికన్న మూడు నాలుగు రెట్లు పెద్దదియై యుండును.

కంజిరయను వాద్యవిశేషము ఎప్పటినుండి యీ దేశమున వాడుకలోనికి వచ్చినదో తెలియదుగాని ఇదే రూపముగల వేరు వేరు వాద్యములు ప్రాచీన శిల్పములయందును ఇతర దేశములయందును కనబడుచున్నవి. పనసకర్రతో గుండ్రముగా తరణిపట్టిన చక్రమునకు ఒకవైపు ఉడుము చర్మముతో కప్పుదురు. ఈకర్ర చక్రము మూడు, మూడున్నర అంగుళముల ఎత్తుండి, చర్మము మూయువైపున 5, 6 అంగుళముల చుట్టుకొలత కలిగి, రెండవవైపున, మూసిన వైపు కన్న అరంగుళము తక్కువ చుట్టుకొలత కలిగి యుండును. కర్ర చక్రమునకు మూడు చోట్ల కొంచెము ఖాళీల నుంచి వానియందు లోహపు రేకుల నమరింతురు. ఎడమచేతి వ్రేళ్ళతో చర్మము నదిమి, బిగించుట యందు హుంకారము వంటి నాదము కంజిరయందుత్పన్న మగును. కుడిచేతి వ్రేళ్ళతో మృదంగము నందు పలికించెడి విధముగా గతులు, తీర్మానములు మొదలగునవి పలికింతురు. సాధారణ ముగా నిది శృతిలేని వాద్యమని అనుకొనుటయు కలదు. కాని ఇందలి

చర్మమును తడిచేసి తగ్గించుట యందును, తడియారిన వెనుక తిరిగి హెచ్చినప్పుడు నిర్ణీతమగు స్థాయియందు నిలుపుటలోనే విద్వాంసుని శృతి జ్ఞానము, చాకచక్యము తెలియనగును. ఈ దేశము నందు వెనుకటి 50, 60 ఏండ్ల క్రిందటి వరకు మహా విద్వాంసులగు మార్దగింకులు, కంజిరకూడ వాయించుచుండిరి. వీరిలో చెప్పుకొనదగిన వారు మంతెన వీరన్న. బెంగుళూరు. హెచ్. పి. రామాచార్ యను కర్నాటక దేశస్థుడగు గొప్ప విద్వాంసుడు ఈవాద్యమునందు అనన్య సామాన్యమగు కృషిచేసి, దీని చరిత్రను, పరిణామములను తెలుసు కొని గ్రంథరూపమున వెలువరించుటకు ప్రయత్నములు చేయు చున్నారు.

తాళ వాద్యములను వర్గీకరించి, వాని నిర్మాణాదులను, వివ రములను సేకరించి శాస్త్రీయములగు పరిశోధనలతో సమగ్రమగు గ్రంథములను వ్రాయించి అచ్చొత్తించ వలసియున్నది.

**సంగీత వాద్యములు : వేణువు**

వేణు వాద్యమునందు రెండు పద్ధతులు గలవు. ఒకటి నిలు వుగా వాయించునదియు, రెండవది అడ్డముగా కుడివైపు త్రిప్పి వాయించునది. మురళిని వేణు దండముతోడనే తయారుచేయుదురు. ఈ వెదురు మన అరణ్యములలో అచ్చటచ్చట దొరకుట కలదు. కాని దక్షిణ దేశమునందు కొన్ని స్థలములలో ఈ జాతి వెదురును ప్రత్యేకముగా పెంచి, ఆ వెదురు గొట్టములను వివిధములగు పద్ధతు లలో కొంత శుభ్రపరచి, బలపరచి వానితో వేణువులు తయారు చేయుదురు. వేణువులయందు రంధ్రములను సరియగు కొలతలలో తయారుచేసుకొనుట, గాలి పోయుచు నూదునప్పుడు రంధ్రములను తెరచుట, మూయుట యను విధానమునందలి చాకచక్యమువలననే ధ్వని విశేషమునందలి అందచందములు, సౌందర్యములు ప్రకా

శించును. ఈ వాద్యమునందు శరభశాస్త్రిలు పల్లడం సంజీవరావు సుసర్ల గంగాధరశాస్త్రి, స్వామినాథపిళ్లై, కుంభకోణం రాజారావు, మహాలింగం మొదలగు విద్వాంసులు ప్రతిభావంతులు. గాలిపోసి వాయించవలసిన ఈ వాద్యమును ఎంత హృద్యంగమము, ఆకర్షణీయమునైనదైనను, ఎక్కువ మంది అభ్యసించుటకు వెనుకాడుచుందురు. ఆరోగ్యవంతులైనవారు నిజమునకు భయపడవలసిన ప్రభావమేమియు నిందులేదని పెద్దలందురు ఆంధ్ర దేశపు పర్వతారణ్య ప్రాంతములయందు నివసించు కోయలు, కొండ దొరలు, వెదురుగొట్టములతో నిర్మించుకొను వివిధములగు వాద్యములు సరియగు పద్ధతులపై నాగరకులు పరిశీలించి, వాని నిర్మాణ విశేషములను లోకమునకు వెల్లడి చేయకనే యుండిపోయిన వెన్నియో కలవని వినుచుందుము.

ప్రాచీన శిల్పములయందు వేణు వాద్య స్వరూపములు కొన్ని కనబడుచున్నవి, కాని ఈ వాద్యమునందు పేరెన్నికగన్న విద్వాంసులను గురించిన వివరములు అంతగా తెలియవచ్చుటలేదు. గాయకులు పాడెడి కృతి, కీర్తన, వర్ణాదులను వాద్యములయందు యథాతథముగ వాయించెడి పద్ధతి ప్రారంభమైన తరువాత ఈ వాద్యమునకు సభా గౌరవమును, స్వతంత్ర ప్రతిపత్తియు కలిగినవి. ఇప్పుడిప్పుడెందరో వర్ధిష్ణు కళాకారు లీవాద్యమునందు పరిశ్రమచేసి కౌశలమును సాధించుచున్నారు.

## సంగీత వాద్యములు: తంబుర

తంబురయను వాద్యమును శృతికొరకై మనముపయోగించుచున్నాము. దీనియందు నాలుగు తంత్రులుండి, మంద్ర షడ్జమము, మధ్య షడ్జమములు రెండు మంద్ర పంచమము యీ నాలుగు స్వరములకు శృతిజేసి మధ్య షడ్జమము నుండి పాడు

కొనుట యలవాటు. గాయకులు లేక వాదకులు దేనిని ఆధార షడ్జ మముగా గ్రహింతురో దానికి ఒక స్థాయి క్రింద నుండునట్లు తంబురను శృతి చేసుకొనుట సంప్రదాయము. ఈ తంబుర పనసకర్రతో తయారు చేయుదురు. ఉత్తర దేశమున కారకాయ తుంబకు పనస, టేకు మొదలగు కొన్ని కఱ్ఱ పలకలనువేసి మూసి తంబురలను తయారు చేసుకొనుటయు కలదు. ఈ వాద్యము అనాది నుండియు వీణా వాద్యమువలెనే ప్రచారమునందున్నది. తంబుర శృతిగూర్చి పాడుట కష్టసాధ్యమయిన విషయమని పెద్దలు చెప్పుదురు.

## సంగీత వాద్యములు: నాగస్వరము

దేశమున సంగీతమునం దభిరుచి పెంపొందించుటకు కారణము లలో నాగస్వరము ఒకటియనినచో నతిశయోక్తిలేదు. మన దేవాల యములు పవిత్ర స్థలములేగాక, భారతీయుల సంస్కృతిని, తరతర ముల వారికిని తెలియచెప్పుచు, విద్యాలకును, కళలకును, విశ్వవిద్యా లయములై యొప్పుచుండెడివి. ఇందు ఆయా వేళలయందు భక్తులు భగవంతునికి జరుపు కైంకర్య సమయములందు గానము చేయు టకు, సపరివారులగు దేవదాసీలును ఉత్సవములయందును, ఉదయ సాయం సంధ్యలయందును, నాగస్వరమును వాయించెడి విద్వాంసు లును, మడి మాన్యములు, దేవాల యాధికారుల నుండి పొంది భగవంతుని సేవించుకొనెడివారట. ఇట్లుండుటవలన ఊరియందుగల జనులందరును ఒకప్పుడైనను నృత్య, గాన ప్రదర్శనములను చూడ గల, వినగల యవకాశములను పొందుచు, బాల్యము నుండియు ఆ విద్యయందలి తరతమ తారతమ్యములను గమనించుచు, అభిరుచిని పెంపొందించుకొనుట కవకాశముండెడిది. ఇప్పటికిని దక్షిణ దేశము నందుగల సంగీత రసికులగు వయోవృద్ధులు తాము తమ చిన్నతనము నందు ఆలయములలో వినిన నాగస్వరమునందలి రాగములను గుర్తు చేసుకొని చెప్పుకొందురు. స్వామివారి ఉత్సవములయందు రథాముున

కొక రాగము చొప్పున రాత్రియంతయు, నాగస్వరము వినవచ్చుచుండెడిదనియు, వద్దనుకొనినను చెవులబడెడి ఆ సంగీతమే తమలో తరువాత సంగీతాభిరుచిని కలిగించినదనియు చెప్పుదురు. ఇట్టి యలవాటు క్రమముగా దక్షిణ దేశమున కూడ తగ్గిపోవుచుండుట విచారకరము. తెనుగు దేశమున యిట్టి యలవాటు లంతరించిపోయి యెంత కాలమైనదో చెప్పజాలము. నేడు గానము, నృత్యము, మొదలైనవి వినవలెనన్నను, చూడవలెనన్నను అభిరుచి యున్నంత మాత్రమున వీలుపడదు. రుసుము చెల్లించనిదే ఇట్టి ప్రదర్శనలు జరుగు స్థలములకు ప్రవేశమే దొరకదు. దేవాలయ మంటపముల యందైనను ఇట్టి కళలను ప్రదర్శించెడు భక్తి గలవారికి అధికారుల యనుమతి పొందవలసిన ఝంఝాటము లెక్కువగా నుండుటవలన అదియును జరుగుటలేదు. కనుకనే క్రమ క్రమముగా శాస్త్రీయములగు కళలయందభిరుచి తగ్గుచు, తేలికతనములయం దభిరుచి వ్యామోహములు ప్రబలుచున్నవి.

నాగస్వరము, ముఖ వీణయనునవి కొంచె మించుమించు ఒకే విధముగా నుండును. ముఖ వీణకు అడుగుముఖముననుండు గంట వంటి ఆకారముగల గొట్టము మూసియుండి చిన్న రంధ్రము మాత్రము తెరువబడి యుండును గనుక యిందు వచ్చు ధ్వని నాగస్వరము వలెగాక ఒక ప్రత్యేకత గలిగి యుండును. నాగస్వరము, ముఖవీణయను నీ వాద్యములు సాధారణముగా సుమారు వంద సంవత్సరముల పైబడిన పాత దూలములను సంపాదించి, ఆ కర్రతో తయారుచేయుదురు. ఈ దూలములయందు మద్ది, టేకు దూలములనుపయోగింతురు. నాగస్వరము చేయుట కుపయోగించెడి కర్రయందు వాతావరణము ననుసరించి సంకోచ వ్యాకోచములు జరుగు స్వభావముండకూడదు. అందువలననే సాధారణముగా పురాతనములగు గృహములు, దేవాలయ మంటపములు మొదలగునవి పునరుద్ధ

రింపబడు సమయములలో అచ్చట అభ్యమగు పాత దూలములను సంపాదించుకొని వాటితో ఈ వాద్యములను తయారుచేసుకొనుచుండెడివారు. ఈ వాద్యములను పూర్వము మంగళగిరి యందు తయారు చేసెడివారట. ఇప్పుడు తంజావూరు జిల్లాయందలి నారసింగిపేటయందు తయారుచేయుచున్నారట.

వీణ, వాయులీనము, వేణువు మొదలగు వాద్యములకుగల ప్రజాదరణ నాగస్వరము ముఖవీణ మొదలగు వాద్యములకు లేకుండుటవలన ఈ వాద్యములు చేసెడి పనివారును, వీనినుపయోగించు కళాకారులును, అంతంత మాత్రముగనే యుండిరి. నాగస్వరమును వాయించుటయందును, విద్యా ప్రచారము చేయుటయందును, నూరేండ్లకు పూర్వము నుండి కొన్ని కుటుంబములు వంశ పారంపర్యముగా కృషి చేయుచున్నవి. అందు పేర్కొనదగినవారు రేగులగడ్డ వాస్తవ్యులు షేక్ హుస్సేన్ సాహెబు, వారి కుమారులు సైదుదుసాహెబు, వారి కుమారులు రేగులగడ్డ సిద్దాసాహెబు, గద్వాల ఆస్థాన విద్వాంసులు కుంకలకుంట పెదలాల్ సాహెబు, వారి కుమారులు షేక్ చినలాల్ సాహెబు, చిలకలూరి పేట పెద నసద్దు సాహెబు, వారి సోదరులు చిన నసర్దిసాహెబు, వీరి తరువాత చిన మౌలా, పెద మౌలాసాహెబులు, కొమ్మూరు పెంటుసాహెబు, కుంకలకుంట సైదుద్ సాహెబు, చినపక్కీరుసాహెబు, మాడుగుల వాస్తవ్యులు రేజేటి అప్పడు, రాజమహేంద్రవరము పైడిస్వామి, దాలిపర్తి పిచ్చహరి సోదరులు మున్నగువారు తమ శిష్య ప్రశిష్యుల విద్యా నైపుణ్యమువలన నేటికిని మన స్మృతిపథమునందు నిలచియున్నారు. ఈ వాద్యమునందు తెనుగు దేశమునందలి మహమ్మదీయుల కుటుంబములవారు ఎక్కువ.

## సంగీత వాద్యములు: డోలు

పనస, మొదలగు కర్రలతో చేయబడిన గుల్లకు రెండు వైపులను చర్మముతో కప్పి డోలు నిర్మింపబడుచున్నది. ఈ డోలు సాధారణముగా నాగస్వరమునకు ప్రక్కవాద్యముగా నుపయోగింతురు. ఇదిగాక ఢుంజ, మురజము మొదలగు కొన్ని వాద్యములు మహారాజుల కోటలలోను, పల్లెలయందలి ముఖ్య స్థలములయందు నుంచుకొని ఏదైన విషయమును ప్రజలకు హెచ్చరిక చేయవలసి వచ్చినప్పుడుపయోగించుచుండెడివారు. ఇప్పుడట్టి యవసరములును లేవు, అట్టి వాద్యములును లేవు.

నాగస్వరమునకు ప్రక్కవాద్యమగు డోలు వాద్యమునందు ప్రసిద్ధులు అమృతలూరు వెంకటేశ్వరులు, బాలకోటయ్య, వేల్పూరు కోటయ్య, వారి కుమారులు వాచయ్య, వెంకటేశ్వరులు, వారి కుమారులు యల్లకుండయ్య, వారి కుమారులు తాళ్ళూరు వీరేశం, పెనుగుద్రపాడు పెదఅంతయ్య, ముళ్ళపాడు రామచంద్రయ్య, కొండపల్లి వెంకయ్య, నేలట్టూరు అమ్మిసెట్టి, గుంటుపల్లి శ్రీరామ్మూర్తి మునిరామయ్య, మద్దిపాటి రాఘవయ్య, ఉప్పలపాటి పెదలంకయ్య, అన్నవరపు బసవయ్య, ఇంకను తమ శిష్య ప్రశిష్యుల విద్యా నైపుణ్యములవలన మన మన్ననలందుచునే యున్నారు. ఈ వాద్యమును దేవాలయములందు వాయించుటకు, జీతము, లేక మాన్యములిచ్చి యుంచెడి వాడుకయుండెడిది. ఇప్పుడది చాలా వరకు తగ్గిపోయినది గనుక యీ వాయిద్యమును వాయించువారు మన యిండ్లయందేవైన శుభకార్య సమయములందు వాయించి మనమిచ్చెడి తృణమో పణమో గైకొనిపోవుటతప్ప వేరొక జీవనోపాధిలేక క్రుగ్గిపోవుచున్నారు.

ఐనను ఆసక్తినిచూపి, కౌశలమును సాధించి, వీరు కర్నాటక సంగీత శోభను తరతరములుగా పెంపొందించుచున్న రీతిని గమనించినచో ఆశ్చర్యానందములు గలుగకమానవు.

## కొన్ని సంగీత గ్రంథములు : గ్రంథకర్తలు

15, 16 శతాబ్దముల నుండి వ్రాసిన గ్రంథకర్తలు గీత, వాద్యములకు ప్రాధాన్యతనిచ్చి, రాగాంగ, ఉపాంగ, భాషాంగాది రాగ వివరణము, గీత కీర్తనాదుల రచనా నియమములు, కొంత విపులముగా చెప్పుట గమనార్హము. శ్రవ్యప్రధానమగు గానవిద్యను లిపిబద్ధము చేయుటకు శ్రమపడి, గడచిన నూరు నూట యేబది యేండ్ల నుండి గ్రంథములను రచియించుచున్నవారు కొందరు ప్రయత్నించుచున్నారు. భావమును వ్యక్తపరచుటకు వాక్యములను వ్రాసిచూపినచో నెట్లుసాధ్యపడుచున్నదో, అట్లేగానమునందలి స్వర గమక వరికాదులను వ్రాసినవి చదివెడు వారు సర్వాంగ సుందరముగా నా రచనను పాడి వినిపింప గలుగునట్లు చేయుటయే ఈ ప్రయత్నమునందలి ముఖ్యోద్దేశ్యము. కాని వాక్యములతో అర్థమును సూచించునంతటి సులభముగా స్వరములతో సంగీతమును సూచించుటకు వలను పడకున్నది. ఐనను కొన్ని గుర్తుల సహాయముతో కొంతవరకైనను రాగ స్వరూపములు తెలియునట్లు మహానుభావులైన పూర్వ వాగ్గేయకారుల ధాతు, మాతు స్వరూపములను తెలియజెప్పుటకు కొంత ప్రయత్నము జరుగుచునే యున్నది. ఇట్టి ప్రయత్నమునందు గడచిన శతాబ్ది మధ్యభాగమున ప్రారంభింపబడి, ఈ శతాబ్ది ప్రారంభమున ప్రచురింపబడిన 'సంగీత సంప్రదాయ ప్రదర్శిని' యను లక్ష్యలక్షణ సమన్వితమగు

గ్రంథము ధృవతార వంటిది. ఇందు ప్రాచీనులగు వాగ్గేయకారుల రచనలనేకములు ధాతు మాతువులతో సమర్థవంతముగా వ్రాయబడినవి.

చెప్పుటకును, వినుటకును కష్టముగనున్నను, చెప్పకొనక తప్పని విషయమొకటున్నది. సంగీత సరస్వతిని తమ రచనలతో నలంకరించి యశః కాయులైన వాగ్గేయకారులును, ప్రతిభావంతముగా తమ కాలము నాటికిగల లక్ష్య లక్షణములను సమన్వయించి, సంస్కృతాంధ్రములలో గ్రంథములు వ్రాసిన వారును, దేశ విదేశములయందాంధ్రుల కళా వైభవములను చాటుచు, పేరెన్నికగన్న వారును, ఎందరెందరో తెనుగు వారున్నను, తమ సంగీతమును పరిరక్షించుకొనుటకు వీరు చేసిన ప్రయత్నములు, చేసిన వారికి యిచ్చుట లభించిన ప్రోత్సాహములు బహు తక్కువ.

ఎట్టయాపుర సంస్థానమునేలిన ప్రభువులు, గాన విద్యా రహస్యములను అంతరించిపోకుండునట్లు చేయు సదుద్దేశ్యముతో 1850-60 ప్రాంతములలో తెనుగు ముద్రణా పరికరములతో ముద్రాక్షరశాలను ఏర్పరచి గమకములను సూచించు గుర్తులను నిర్మింపజేసి, ముద్రణా కార్యములయందు సహాయ పడుటకుగాను, తెనుగు వ్రాయుట, చదువుట మొదలగునవి తెలిసిన వారిని రప్పించి, వారికి స్థిర వసతుల నిచ్చి పోషించుచు, సుమారు 2,000 పుటలుగల 'సంగీత సంప్రదాయ ప్రదర్శిని'యను ఉద్గ్రంథమును అచ్చొత్తించిరి. ఈ పనిని సంగీత త్రిమూర్తులలో నొకరని మనమీనాడు చెప్పకొనుచున్న ముద్దుస్వామి దీక్షితులవారి పౌత్రులగు సుబ్బరామ దీక్షితుల వారికి నప్పగించి సమర్థవంతముగా నిర్వర్తింపజేసిరి. ఇందు వెంకటమఖి రచించిన 'చతుర్దండి ప్రకాశిక'యందలి శాస్త్ర విషయములును, వారి సంప్రదాయము ననుసరించి వెంకటమఖి రచించిన లక్షణ గీత

ములు మున్నగు లక్ష్యములను, రాగాంగ. ఉపాంగ, భాషాంగ రాగములయందు ముద్దుస్వామి దీక్షితులవారును, ఇతర వాగ్గేయకారులును చెప్పిన గీత, వర్ణ కీర్తనాదులును, తాన, రాగ విస్తరణాది స్వరూపములును, స్వరపరచి వ్రాసి సుమారు 200 సంవత్సరముల నుండి ప్రచారమునందున్న కర్నాటక సంగీత స్వరూపమును తెలుసు కొను నవకాశమును తెనుగు వారికి అందించినారు.

1880 సంవత్సర ప్రాంతములయందు తచ్చూరు శింగరాచార్య సోదరులు, గాయక సిద్ధాంజనము మొదలగు కొన్ని ఉత్తమ గ్రంథములు వారికి అందుబాటు నందున్న కొందరి వాగ్గేయకారుల రచనలను స్వరపరచి అచ్చొత్తించినారు. ఇందు శింగరాచార్యుల వారు, ఆనాటికి సుప్రసిద్ధులై దేశము నందంతటను పేరు ప్రఖ్యాతులను సంపాదించుకొనిన విద్వాంసులు కొందరిని గురించియు వారి ప్రతిభా విశేషములను గురించియు, వ్రాసి యున్నారు.

మదరాసు తిరువల్లిక్కేణి వాస్తవ్యులు, మహానుభావులైన పట్నం సుబ్రహ్మణ్యయ్యగారి శిష్యులు C. S. కృష్ణస్వామయ్యగారు శతకీర్తన స్వరావళి యను పేర త్యాగరాజుస్వామివారి కీర్తనలు నూరింటిని స్వరసహితముగా కి. శ. 1911 ప్రాంతమున తెనుగునందు అచ్చొత్తించి నాటికి త్యాగరాజస్వామివారి కీర్తనలు పాడుచుండిన విధమును గ్రంథస్థముచేసి, కర్నాటక సంగీతమునకును, ఆంధ్రులకును మహోపకారమును చేసిరి. తరువాత చెప్పుకొనదగిన వారిలో ముఖ్యులు కె. వి. శ్రీనివాస అయ్యంగారు. వీరు అనేక శ్రమలకోర్చి 1920 ప్రాంతమువరకు దక్షిణా పథమున గానము చేయుచున్న విద్వాంసుల వద్దనుండి సంపాదించ గలిగినన్ని త్యాగరాజ స్వామివారి కీర్తనలు సంపాదించి స్వరపరచి 'త్యాగరాజ హృదయ' మను పేర ప్రతి కీర్తనకు అవతారిక, టీకాతాత్పర్యములతో హరి

కాంభోజి మేళమువరకుగల కీర్తనలలో కొన్నింటిని మేళకర్త క్రమమున మూడు భాగములుగా అచ్చొత్తించిరి. వీరిచేతనే తరువాత రచింపబడిన 'గాన భాస్కరము'నందు కొన్ని త్యాగరాజ స్వామివారివి, ఇతర వాగ్గేయకారులవి రచనలు స్వరబద్ధముగా పొందు పరచినారు. ఇట్టి సంగీత గ్రంథముల నెన్నిటినో అచ్చు వేయుటకు అన్ని విధములగు సహాయమును చేసినవారగు ఆదికేశవులు నాయుడు గారికి కర్నాటక సంగీతాభిమానులును, ప్రత్యేకముగా ఆంధ్రులును ఎంత ఋణపడి యున్నారో చెప్పనవుసరము లేదు. వీరేగాక, ఇంకను అనేకులగు సంగీత విద్యాభిమానులు గ్రంధ రూపమున స్వరసహితముగా ప్రాచీనుల రచనలను అచ్చొత్తించి నిలుపుట వలననేకదా యీనాడు మనకు ప్రాచీనుల గాన వైభవము కొంతయైనను తెలియుచున్నది!

రాజమహేంద్రవరము-గౌతమీ విద్యా పీఠమునందలి సంగీత శాఖయగు ఆంధ్ర గాన కళా పరిషత్తువారి ఆధ్వర్యమున ఆచార్య విస్సా అప్పారావు పంతులుగారు దొరకినంతవరకు త్యాగరాజస్వామి వారి కీర్తనలకు ప్రతి పదార్థ టీకాతాత్పర్యములను కల్లూరి వీరభద్ర శాస్త్రిగారిచే వ్రాయించి అచ్చొత్తించిరి. ఇదియే నేడు మనకగుపడు చున్న సమగ్రమగు త్యాగరాజ కీర్తనల ప్రతి. అప్రచలితములగు త్యాగరాజ కీర్తనలను డెబ్బది నాలుగింటిని 'RARE KIRTANAMS OF THYAGARAJA' అను పేర అచ్చు వేయించిరి. దొరకినంతవరకు క్షేత్రజ్ఞుని పదముల సాహిత్యమును ఒక సంపుటముగాను, స్వరసహితములుగా 78 పదములు మరియొక సంపుటముగను వీరే వేయించిరి. ఇటీవల ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీవారు ఇంకను అముద్రితములగు 57 పదములను చేర్చి దీనినే తిరిగి అచ్చొత్తించిరి. అప్పారావు పంతులుగారు అధ్యాత్మ రామాయణ కీర్తనలను కొన్నిటిని సేకరించి స్వరసహితముగా ముద్రింపించిరి.

ఆచార్య పి. సాంబమూర్తిగారు ఆంగ్లమున రచించిన దక్షిణ దేశపు 'సంగీతము-సంగీతజ్ఞులు' అను గ్రంథమునందు అచ్చుపడక మిగిలియున్న భాగములను కూడ సంపాదించి, ప్రకటించుట సంగీత లోకమునకు మహోపకారమగును. వీరి వాగ్గేయకారుల చరిత్రలు, ఇతర సంగీత గ్రంథములు సంగీత ప్రపంచమున కెంతయో సేవ చేయుచున్నవి. సంకుచిత దృష్టులు లేని విశాల హృదయులగు ఇట్టి కళారాధకులు దక్షిణ దేశమున నింకను ఉండుటవలన అనేక విషయములయందలి సత్యము మరుగున పడకుండ నిలిచి యున్నది. సాంబమూర్తిగారి ఆంగ్ల గ్రంథములకు తెనుగు అనువాదములు జరుగుట అత్యంతావశ్యకము.

తాళ్ళపాకవారి రచనలను గూర్చిన విషయములను కూలంకషముగ పరిశీలించి గ్రంథ రూపమున వెలువరించిన వేటూరి ఆనందమూర్తిగారు తాళ్ళపాకవారివే యనుకొనదగిన కొన్ని రచనలు స్వర సహితముగా రాతి పలకలపై చెక్కినవి కొన్ని తిరుపతియందు ఇటీవలనే కనుగొనిరని వ్రాసి యున్నారు. ఈ రాతి పలకలయందలి విషయములను పరిశీలించినచో తాళ్ళపాకవారి కాలమునందలి సంగీత స్వరూపమును కొంతవరకైనను తెలుసుకొనుట కవకాశముండునని తోచుచున్నది.

మునుగంటివారి కుటుంబమున జన్మించిన శ్రీరామ్మూర్తి గారు, తాత తండ్రులవలెనే సంగీత సేవ చేయుటకుపక్రమించి, 'గాన కళ'యను పత్రికను చాల కాలము నుండి నడుపుచున్నారు. ఇది చందాదారులు, అభిమానుల ప్రోత్సాహమున నడచుచున్న ఏకైక తెనుగు సంగీత మాస పత్రిక. ఇట్టివానికి ప్రభుత్వ సహాయముండుట ఆవశ్యకము. వీరిపత్రికయందచ్చొత్తించిన విషయములను వర్గీకరించి, సంపుటములుగా వెలువరించినచో, మరుగుపడిన విషయములనేకములు వెలుగునకు రాగలవు.

దక్షిణ దేశమునందును, ఆంధ్ర దేశమునందును ప్రచారము నందుండి మరుగున పడిపోవుటకు సిద్ధముగా నున్న రామదాసు, నారాయణతీర్థులు, త్యాగరాజస్వామి మొదలగువారి రచనలను దొరకినంతవరకు సంపాదించి, స్వరసహితముగ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమువారు అచ్చు వేయించు ప్రయత్నములు చేయుచున్నట్లు తెలియుచున్నది. ఇది అత్యంతముదావహమగు విషయము. ఇంత వరకు వచ్చిన గ్రంథములే కొద్ది! అందున, భక్తాగ్రేసరులగు తెనుగు వాగ్గేయకారుల రచనలు అతి కొద్ది! ఇది యీనాటి పరిస్థితి. సాహిత్యములను సంపాదించుట, పరిష్కరించి టీకాతాత్పర్యములు వ్రాసి అచ్చొత్తించుట ఇట్టి పనులయందు తెనుగువారు చూపుచున్న శ్రద్ధయు, అంతంత మాత్రముగనే యున్నది. ఇక ముందైనను ఇతోధికముగ కృతి, కీర్తన, పదాదులను తెనుగువారు వెలుగునకు తెచ్చుకొందురని ఆశింతము. ఇంతవరకు తెనుగునందు పరిష్కృతములైన రామదాసు కీర్తనల ప్రతిగాని, ఇతర వాగ్గేయకారుల రచనల ప్రతులు గాని లేవనినచో ఏమనుకోవలెను?

ఇప్పుడిప్పుడు సంస్కృతమునందుగల కొన్ని ఉద్గ్రంథములు తెనుగు వ్యాఖ్యానముతో ప్రకటింపబడుచున్నవి. పి.యస్. ఆర్. అప్పారావుగారి వ్యాఖ్యానముతో వెలువడిన భరతునినాట్యశాస్త్రము, ఆచార్య రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి వ్యాఖ్యానముతో నృత్త రత్నావళి, గంధం శ్రీరామమూర్తిగారి వ్యాఖ్యానముతో సంగీత రత్నాకరము, జమ్మలమడక మాధవరామశర్మగారి వ్యాఖ్యానముతో భావ ప్రకాశనము మొదలగు గ్రంథములు వెలువడినవి. ఇంకను విద్యారణ్యుల దనుకొనబడుచున్న సంగీతసారము, రామామాత్యుల స్వర మేళ కళానిధి, సోమేశ్వరపండితుని రాగ విబోధము, వెంకటమఖి చతుర్దండీ ప్రకాశిక, అహోబలుని సంగీత పారిజాతము, లక్ష్మినారాయణుని సంగీత సర్వోదయము, తిరువేంకటకవి సంగీతసార సంగ్ర

హాము మొదలగు ప్రాచీనుల గ్రంథములు వ్యాఖ్యాన సహితముగ తెనుగువారికి లభింపవలసి యున్నది.

## ముగింపు

ఐహికాముష్మిక సాధనమగు సంగీత విద్యయందు పరిశ్రమించిన కళాకారులకు వారి వారి పూర్వ కర్మానుబంధములగు పరిణామములు సంప్రాప్తించుట సహజము. ఇందు జ్ఞానులైనవారు ఆముష్మిక చింతనాపరులై గాన యోగమును సాధించి భగవంతునికి సన్నిహితులై అజరామరులగుచున్నారు. వారి రచనలు నేటికిని గానము చేయుచు సంగీత రసపిపాసువులు తరించుచున్నారు. ఐహికమునందు తగిలినవారెంత విద్వాంసులైనను, నామరూపములు లేక నే పోవుచున్నారు.

దొరకినంతవరకు సంగీత చరిత్రను పరిశీలించినచో కొన్ని చెప్పుకొనవలసిన విషయములు కనబడుచున్నవి. నాదరూపమగు సంగీతమును, అర్ధరూపమగు సాహిత్యమును, సమానముగ కలిపి వాగ్గేయ రూపములను వెలయించిన రచన లెక్కువగా గాన కళాభిమానులగు భక్తుల నాకర్షించుచున్నవి. ఈ రెంటియందును ఏ వొక్కదాని నధికముగా చేసినను, అట్టి రచనలు వాడుకయందంతగా నిలచుటలేదు. ఉదాహరణకు, నేడు మనము వినుచున్న అనేకములగు చిన్న కీర్తనలని చెప్పుకొనబడువానిని గమనించినచో రెండు మూడు సంగతులు మాత్రమనుగా గల్గిన పల్లవి, అను పల్లవులతో సాహిత్యాతురములు, సంగతుల యందెక్కువ దూరము జరుగక అర్థమును తెలుసుకొనుటకు ఇబ్బంది పెట్టనివై యుండి యొకటి రెండు చిన్నవిగ నుండు చరణములతో తరచుగా వినబడుచు, ఆకర్షించుచున్నవి. ఎక్కువ సంగతులు గలిగి. రాగ స్వరూపమును విస్తరించుకొనునవై యుండి

సాహిత్యము పలుచనై యుండెడి రచనలు నేడంతగా మనకు వినబడుటలేదు. ఇందులకు కారణములు : 1. ఇట్టి రచనలను పాఠము చేసికొని, బలమగు నభ్యాసముతో, సాహిత్య భావమును రూపొందించుచు, ప్రదర్శించుటకు విద్వాంసులు ప్రయత్నింపకుండుటయు, 2. ఇట్టి రచనలను సాధించి, పాటవముతో గానము చేసినను, విని ఆనందించు శ్రోతలు కరువగు చుండుటయునని తోచుచున్నది.

సాహిత్య మధికముగా నుండి తదనుగుణమగు సంగీతమును తగు మాత్రముగా నుండెడి రచన లనేకములు నేడు మరుగున పడి పోవుచున్నవి. దీనికి కారణములు గలవు. గాన విద్యాభ్యాసము చేయువారు సాహిత్యమునందలి మాటల పొందిక, విరుపులు, భావ ద్యోతకములగు నుచ్చారణ, తెలియనివారై, వ్యతిరేకార్థములు ధ్వనించెడు విధముగను, అర్థమే స్ఫురింపని విధముగను, పాడుచుండుట యొకటి. ఇట్టి విధముగా పాడునప్పుడు, గానమునందైనను ప్రజ్ఞా పాటవములు ప్రదర్శించి శ్రోతలనాకట్టుకొనగల విద్వాంసులును కరువగుచున్నారు. ఇది రెండవ కారణము. త్యాగరాజస్వామి వారి పంచరత్న కీర్తనలును, మైసూరు సదాశివరావు, కృష్ణస్వామయ్య, దొరస్వామయ్య మొదలగువారి రచనలలో సాహిత్య పాటవముగల రచనలును, మునిపల్లె సుబ్రహ్మణ్యకవి అధ్యాత్మ రామాయణ కీర్తనలు, నారాయణతీర్థులవారి తరంగములు మొదలగు రచనలు నేడు వినబడుట తగ్గుచున్నది. అట్లే త్యాగరాజస్వామి 'ఓ రంగశాయి'వంటి కీర్తనలును, సంగీత ప్రధానములై యుండెడి యితరుల రచన లనేకములును మనకు నేడంతగా వినవచ్చుట లేదు.

ఈ శతాబ్దపు తొలి రోజులలో నేడు మనము చూచుచున్న కచ్చేరీయను సంగీత ప్రదర్శనా పద్ధతి ప్రారంభమైనది. ఉన్నతాసనమున ప్రదర్శకులు కూర్చుండుట, వారిని పరివేష్టించి శ్రోతలు తీర

గతులుగా కూర్చుండుట, రెండు నుండి మూడు నాలుగు గంటలు కళా ప్రదర్శనము జరుగుట, ఇందు వర్ణముతో ప్రారంభించి, నాలు గైదు మధ్యమకాల కీర్తనలను పాడి, ప్రస్తారమున కనువైన పెద్ద రాగము నొకదానిని విపులముగా నాలపించి, అందు విలంబకాల కీర్తన మొకటి పాడి, అటు పిమ్మట రాగము, తానము, పల్లవి పాడి పాండిత్య ప్రదర్శనము చేసి, పదము, జావళి, తిల్లాన మున్నగు రచన లను కొన్నిటిని పాడి ముగించుట యీ కచ్చేరీ సంప్రదాయమై వచ్చుచున్నది. దీనికిట్టి రూపమేర్పడుటకును కొంతవరకు కొన్ని సంస్థల తోడ్పాటు, కట్టుబాట్లు, పోషణ మొదలగునవి కారణము లనియే చెప్పుకొనవలెను. సుమారు ఏబది సంవత్సరములకు ముందు ప్రారంభింపబడి దేశమునందుగల మూల మూలల నుండి విద్వాంసు లను రప్పించి, ఆదరించి, వారి గానమును విని, ప్రోత్సహించిన సరస్వతీగాన సభవంటి సభలయొక్కయు ఆ సభా నిర్వాహకులగు కొమ్మిరెడ్డి సూర్యనారాయణమూర్తి గారివంటి కళా పోషకుల యొక్కయు కృషి ప్రభావము, చాలవరకు, ఈ కచ్చేరీ సంప్రదాయ ములపై నున్నదనుటకు సందేహము లేదు. ఇట్టి గానసభలు, కచ్చేరీ పద్ధతులు రాక మునుపు రాజాస్థానములయందును, దేవాలయముల యందును, ధనికుల యిండ్ల యందును, గాన విద్యా ప్రదర్శనలు జరుగుచుండెడివి. అట్టియెడ భక్తి వైరాగ్య పూరితములగు గీతముల నాయా సందర్భముల ననుసరించి, శృంగారాది రస భూయిష్ఠములగు రచనలతోను, కాలక్షేపములు జరుగుచుండెడివి.

విలంబకాలమున గానముచేయదగినవగు క్షేత్రజ్ఞుని పదములు, ముద్దుస్వామి దీక్షితులవారి కీర్తనలు, మొదలగునవియు, క్రమముగా మనకు దూరమగుచున్నవి. దీనికిగల కారణము మధ్యమ, దురిత కాలములలో కసరత్తులు చేయు విద్వాంసుల గానమును విని యానం దించు శ్రోత లధికమగుచుండుటయే. విశ్రాంతిగా రాగ సంప్రదా

యములను పోషించుచు సాహిత్యభావమును ద్యోతకమగునట్లు పాడుచు, శ్రోతలకు మానసికమగు విశ్రాంతిని, తన్మయతను కలుగ జేయుచు, సంగీత సరస్వతిని ఆరాధించుకొనుచు, తాము తరించి, యితరులను తరింపజేయు విద్వాంసులకు పోషణ, పాలన, కరువగు చుండుట వలన ఇట్టివి జరుగుచుండునని తోచుచున్నది. కాలక్రమ మున మార్పులు వచ్చుచుండుట సహజమేకదా! అందిట్టివియు, నుండవచ్చును. సంగీతము సంప్రదాయసిద్ధముగ నుంచి పరిరక్షించి, తమ తరువాతి తరములవారికి అందించెడు ప్రయత్నములు చేసెడి వారు కొందరును, నూతనములని తమకు తోచిన కొన్ని క్రొత్త ప్రయోగములను జేసి వానిని సంప్రదాయములుగ తమ తరువాతి తరములవారికి చూపవలెనను నుత్సాహముతో నుండెడివారు మరి కొందరును యుండుట ఎప్పుడును జరుగుచున్నదియేకదా! ఇందు యీ రెండు తరగతులవారి ప్రయత్నముల యందును, మంచిని గ్రహించుటయే న్యాయము.

కచ్చేరీ ప్రదర్శనా పద్ధతి యందెన్నియో నూతన విషయము లుద్భవించి కొన్ని సంప్రదాయములుగా నిలచి యున్నవి, కొన్ని మరుగున పడిపోవుచున్నవి. మహాభక్తులగు త్యాగరాజాదులైన వాగ్గేయకారులు గాన విద్యను ముక్తిసాధనముగా నెంచి దేవతాస్తుతి పరములైన కీర్తనలను, భగవదంకితములైన కృతులను గానము చేయగా, వారి రచనలను తమ గాన విద్యా ప్రౌఢిమతో సంగతులు, సందర్భములు అమర్చుకొని పాడుటను గాయకులు ప్రారంభించినారు. ఇట్టి వానియందు నేటి శ్రోతలను రంజింపజేయగలిగినవి నిలచు చున్నవి, లేనివి అంతరించుచున్నవి.

పల్లవి పాడెడు పద్ధతియే వెనుకబడినదని చెప్పవచ్చును. పాండిత్య ప్రకర్షను తెలియజేయు నిట్టి ప్రక్రియలను విని ఆనందిం చెడి శ్రోతలు కూడ కరువగుచుండుటయే దీనికి కారణము. ఒకప్పుడు

రెండు మూడు గంటల సమయమునందు సుమారు పదిహేను లేక ఇరువది రచనలను గానముచేసి, సంగీత సాహిత్య పిపాసువులగు శ్రోతలను, గాయకులానందింప జేసెడివారు. నేడు చిన్న చిన్న రచనలను పాడి, రాగాలాపనము నందును, కల్పన స్వరమునందును, ఎక్కువ సమయమును గాయకులు గడుపుచున్నారు. కనుక సంగీతాభిమానులకు మాత్రమే, అందున శాస్త్ర పరిచయమున్న వారికి మాత్రమే ఆనందమును కలిగించునవియై తగుమాత్రపు సంగీతాభిరుచియుండి, సాహిత్యభావమును మాత్రము ఆస్వాదించి యానందించు శ్రోతలకు నేటి కచ్చేరీలు దూరమగుచున్నవి. ఈ పరిణామము నందలి మంచి చెడ్డలు కాలమే నిర్ణయించగలదు.

కీర్తన, కృతి యను వాటికి సంగతులను నొక ప్రక్రియను ప్రారంభించి ప్రచారమునకు తెచ్చినవారు కొలదిమంది మహా గాయకులు క్రిందటి శతాబ్దపుటంచులయందు ప్రభవించి యుండిరి. సంగతులు వేయునప్పుడు ఒకే మాటను అనేక భావములను స్ఫురింపజేయునట్లు పాడుటయే యుద్దేశ్యము. ఇది అభినయమునకు వీలగునట్లు క్షేత్రజ్ఞులు మొదలగువారి శృంగార పదములు పాడునప్పుడు, వాక్యము నందలి భావములను వేరు వేరు విధములుగా అభినయించి చూపెడు వారికి అనువగునట్లు పాడుచుండెడి పద్ధతినుండియే యీ సంగతులను వేయు విధమును పుట్టియుండవచ్చును. రాను రాను యిది సంగీత ప్రధానమగు నొక విలక్షణ రూపమును దాల్చుచున్నది. కొన్ని యెడల యిట్టి సంగతులధిక ప్రసంగములవలె తోచుటయు గలదు. వాగ్గేయకారులు తమ భక్తిని, ఆర్తిని చెప్పుట కుపయోగించుకొనిన రచనలయందలి సాహిత్యరూపము దాని వ్యక్తిత్వమునే కోల్పోవుచు వికృతమగుచున్న సందర్భములును కనబడుచున్నవి. భజన కూటములయందు భక్తితో గానముచేసికొనెడి యలవాటు తొలగిపోవుచుండుట వలనను ఇట్టి సందర్భములు తమ గానమునకు తక్కువ

యనుకొనెడి విద్వాంసులు, క్రమముగా మహానుభావుల రచనలలో కొన్నిటికి సంగీతపు పాలును కొంచెము పెంచి, అట్లు పెంచుటకు వలనుపడని వాటిని భజనకీర్తనలనియు, దండకములవలె నున్నవనియు, త్రోసిపుచ్చుట జరుగుచున్నది. కొందరు పూర్వుల రచనలను వర్ణించి అనుశ్రుతముగా వచ్చు పద్ధతులపై వినిపించుటకు శక్తిచాలక తమకు తోచిన విధముగా సంగీత సాహిత్యములను కల్పించుకొనుచు, స్వంత రచన లనుపేర కొన్ని వినిపించుటకును పూనుకొనుచున్నారు. ఇట్టి రచనలను వినునప్పుడు వయోవృద్ధులకును, మహానుభావులగు వాగ్గేయకారుల రచన లనేకములు తెలిసినవారికిని, సాహిత్యమునందు, స్వరమునందుకూడ, ఎచటనుండి యెవరెవరి ధాతుమాతు స్వరూపములు ముక్కస్యముక్కః అనునట్లు సంగ్రహింపబడినవో తెలియుచు మనసునకు బాధ కలిగించుచున్నవి. మహానుభావులైన వాగ్గేయకారు లొకరు, మొన్న మొన్నటివరకు మన మధ్యనే యుండినవారు, తాము రచించిన యే రచన యందైనను ప్రాచీన వాగ్గేయకారుల అనుకరణలను చూపించగలవారికై వెదకుచుండెడి వారట. వీరికి పాఠమునందు లేని త్రిమూర్తుల రచనలే లేవని చెప్ప వచ్చునట. ఇట్టి మహాప్రతిభగల వారినే కదా వాగ్గేయకారులని చెప్పుకొనవలెను !

యుగపురుషు లనుకొనదగిన వారిలో గ్రంధకర్తలు, మార్గ దర్శకులు నగు విద్యారణ్యులు, హరి పాలదేవులు, తాళ్ళపాక వారు, పురందరదాసులు, రామామాత్యులు, సోమనాధుడు, గోవింద దీక్షి తులు, వెంకటమఖి మొదలగువారును, వాగ్గేయకారులు, విద్వాం సులు నగు రామదాసు, నారాయణతీర్థులు, క్షేత్రజ్ఞులు, సిద్ధేంద్ర యోగి, శ్యామశాస్త్రిలు, త్యాగరాజస్వామి, దీక్షితులవారు, పట్నం సుబ్రహ్మణ్యయ్య, గర్భపురివారు, సుబ్బరామదీక్షితులు, ఆదిభట్ల నారాయణదాసు హరినాగభూషణం, మునర్ల దక్షిణామూర్తి, పారు

పల్లి రామకృష్ణయ్య పంతులు, వీణ వెంకటరమణదాసు, బొడుగు రామమూర్తి, ద్వారం వెంకటస్వామి నాయుడు మొదలగు వారం దరును సరస్వతిని తాము సోపానములుగా నేర్పడి దివినుండి భువిపై నవతరింపజేసి రనుకొనుటలో ఆశ్చర్యము లేదు. ఇది తెనుగువారి సంగీత సేవకు, వారి సంగీతాభిమానమునకును ఒక క్లుప్తమగు ప్రశంస మాత్రమే!

ఇది యొక చిన్న రచనమగుటచే నిందుదహరించుటకు వలను పడని విషయములును, గ్రంధములును ఎన్నియోకలవు, అట్లే గాయక, వాదక నిపుణులగు విద్వాంసు లెందరో కలరనుటకు సందేహము లేదు. దీనికి కళాకారులు, కళాభిమానులు మన్నింతురుగాక!

# అనుబంధం 1

గడచిన 70, 80 ఏండ్ల నుండియు గాన విద్యయందు నిపుణులై పేరు గడించిన కొందరు విద్వాంసులను తలచుకొనుట న్యాయము.

## 1 గాయకులు

1 పర్వతనేని వీరయ్య చౌదరి
2 చిలకలపూడి వెంకటేశ్వర శర్మ
3 ఉప్పలపాటి అంకయ్య
4 సుసర్ల నాగేశ్వర శాస్త్రి
5 వంకదారి వెంకట సుబ్బయ్య గుప్త
6 మంగిపూడి రామలింగ శాస్త్రి
7 అద్దంకి శ్రీరామమూర్తి
8 క్రొవ్విడి సత్యనారాయణ
9 మహోవాది వెంకటప్పయ్య
10 డొక్కా శ్రీరామమూర్తి
11 రాజనాల వెంకటప్పయ్య శాస్త్రి
12 సంధ్యావందనం శ్రీనివాసరావు
13 ధేనువకొండ సుబ్బారావు
14 శ్రీపాద పినాకపాణి
15 రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ
16 చిత్తూరు సుబ్రహ్మణ్య పిళ్ళై

17 వింజమూరి వరదరాజ అయ్యంగార్
18 ఈదర నాగరాజు
19 ఎం. సీతారామానుజాచారి
20 మర్ల సూర్యనారాయణమూర్తి
21 శిష్టా రాజశేఖరం
22 పురాణం పురుషోత్తమ శాస్త్రి
23 సాగి వెంకటేశ్వరులు

## 2 వర్ధిష్ణు కళాకారులలో కొందరు

1 మంగళంపల్లి బాలమురళీ కృష్ణ
2 నేదునూరి కృష్ణమూర్తి
3 నూకల చిన సత్యనారాయణ
4 ఓలేటి వెంకటేశ్వరులు
5 ఎం. ఎస్. బాల సుబ్రహ్మణ్య శర్మ
6 ఎ. వి. ఎస్. కృష్ణరావు
7 కర్లపాలెం చంద్రమౌళి
8 ద్వారం భావనారాయణరావు మొదలగు వారెందరో కలరు,

## 3 వైణికులు

1 పెహాతా రాజారావు
2 కంభంపాటి అక్కాజీరావు
3 ములుగు శివానంద శాస్త్రి
4 ఈమని శంకర శాస్త్రి
5 అయ్యగారి సోమేశ్వరరావు

6 కవిసామ్రాయని జోగారావు

7 వాసా కృష్ణమూర్తి

8 చిట్టిబాబు

9 మొక్కపాటి నాగేశ్వరరావు

10 పద్మనాభాచార్యులు

11 నల్లాన్ చక్రవర్తుల పార్థసారథి

12. పప్పుసోమేశ్వరరావు మొదలగువారు.

## 4 వాయులీన విద్వాంసులు

1 అరిపిరాల సత్యనారాయణమూర్తి (వీరు తెనుగునం దనేక గ్రంథములు రచించిరి)

2 తిరుపతి పొన్నారావు

3 చాగంటి గంగరాజు

4 కె. ఎస్. వెంకట్రామయ్య

5 నోరి నాగభూషణం

6 పేరి సుబ్బారావు

7 అన్నవరపు రామస్వామి

8 నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచారి

9 కరూర్ చిన్నస్వామి శిష్యులు పి. కుప్పుస్వామయ్య

10 సుసర్ల లక్ష్మీనరసింహశాస్త్రి

11 మారెళ్ళ కేశవరావు

12 చల్లపల్లి పంచనదీశ్వర శాస్త్రి

13 చల్లపల్లి సీతారామయ్య

14 సేతురామయ్య మున్నగువారు,

## 5. వేణు విద్వాంసులు

1 మంగళంపల్లి పట్టాభిరామయ్య
2 పోలవరపు రామచంద్రరావు
3 వేల్పూరి విజయరాఘవరావు
4 ప్రపంచం సీతారాం
5 జంగం పాపయ్యలింగందేవర
మున్నగువారు.

ఇంకను—

1 సుందరంపల్లి సూర్యనారాయణ
2 రాధాకృష్ణనాయుడు
3 వై. తాతయ్య
4 చిప్పాడ చిట్టి
5 మహమ్మద్ ఖాసీంసాహెబ్
మొదలైన క్లారినెట్ విద్వాంసులు.

1 షేక్ చినమౌలాసాహెబ్
2 దోమాడ చిట్టబ్బాయి
3 గుంటుపల్లి విఠల్‌దాసు
మొదలైన నాదస్వర విద్వాంసులు.

1 కోలంక వెంకటరాజు
2 మారేమండ వరదాచారి
3 తిరుపతి రామానుజాచారి

4 చింతలపూడి త్రిమూర్తి

5 కాట్రావులపల్లి వీరభద్రరావు

6 క్రొవ్విడి హనుమంతరావు

7 పుచ్చా సుబ్బారావు

8 శ్రీపాద సన్యాసిరాజు

9 ముక్తేవి రంగాచార్యులు

10 జొన్నలగడ్డ సింహాచలశాస్త్రి

11 మహాదేవ రాధాకృష్ణంరాజు

12 అట్లూరి వెంకటేశ్వరరావు

13 దండమూడి రామమోహనరావు

14 ఎల్లా వెంకటేశ్వరరావు

15 వి. కమలాకరరావు

మొదలగు మృదంగ విద్వాంసులు.

# అనుబంధం 2

ఈ రచనా వ్యాసంగము నందు నాకు తోడ్పడిన వ్యక్తులు, ఉపకరించిన గ్రంధములు.

| | | |
|---|---|---|
| 1 | తాళ్ళపాక కవుల కృతులు | డా॥ వేటూరి ఆనందమూర్తి |
| 2 | ఆంధ్ర వాగ్గేయకారుల చరిత్ర | బాలాంత్రపు రజనీకాంతరావు |
| 3 | మార్గ-దేశి | వాఙ్మయమహోధ్యాయ డాక్టర్ వడ్లమూడి గోపాలకృష్ణయ్య |
| 4 | ఆంధ్ర యక్షగాన వాఙ్మయ చరిత్ర | డా॥ ఎస్.వి. జోగారావు |
| 5 | శ్రీ మల్లికార్జున పండితారాధ్య చరిత్ర | చిలుకూరి నారాయణరావు గారిచే పరిష్కరింపబడిన పాల్కురికి సోమనాధుని గ్రంధము |
| 6 | Dictionary of South Indian Music and Musicians, Vol I, II, III | ఆచార్య పి. సాంబమూర్తి |
| 7 | సంగీత శబ్దార్ధ చంద్రిక | గానకళా విశారద అరిపిరాల సత్యనారాయణ |
| 8 | నాట్యకళ (మాసపత్రికలు) | ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ ప్రచురణలు |

9 గానకళ (మాస పత్రికలు) | మునుగంటి శ్రీరామమూర్తి సంపాదకత్వమున కాకినాడ నుండి వెలువడుచున్న ప్రచురణలు.

ఇంకను తమ అమూల్యములగు సలహా సంప్రదింపులతో నాకు సహకరించిన చిన్నస్వామయ్యగారి శిష్యుడు వాయులీన విద్వాంసుడు పి. కుప్పుస్వామయ్య, శతాధిక గ్రంథ రచయిత రావూరి భరద్వాజ, గాయక, వైణికులు వాసా పద్మనాభం, నా సోదరుడు వాడ్రేవు పురుషోత్తం, కుమార్తె వాడ్రేవు భరణి. మున్నగువారు వీరికి నా హృదయపూర్వకమైన కృతజ్ఞతలు, ఆశీస్సులు.